ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 07.08.2026 | సంపుటి :13 సంచిక : 18 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV




# ఒకే డిజిటల్ వ్యవస్థలోకి రోడ్లు



- ఔటర్ రింగ్ రోడ్ నిర్వహణపై అసంతృప్తి..
- టీడీఆర్‌కు పారదర్శక ఆన్‌లైన్ విధానం
- రేడియల్ రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్ల పనులు వేగవంతం చేయాలని సూచనలు

**హైదరాబాద్, ఆగస్టు 6 (జనంసాక్షి) :**
హైదరాబాద్ నగర భవిష్యత్ అభివృద్ధి సమర్థవంతమైన రోడ్ల నెట్‌వర్క్‌పైనే ఆధారపడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నగర రోడ్ల నిర్మాణం, విస్తరణ, నిర్వహణ, భూసేకరణ, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలన్నింటినీ ఒకే సమగ్ర డిజిటల్ వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో గురువారం హెచ్‌ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఆర్‌డీసీఎల్) అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, మిగతా 2లో..




## ప్రజల మధ్యకు
# 'కాక్రోచ్' ప్రభంజనం

క్యా బోల్తీ పబ్లిక్.. జనం ఏం అనుకుంటున్నారు.. జనం ఏం చెబుతున్నారు.. క్యా బోల్తీ పబ్లిక్ అనే నినాదంతో.. దేశ వ్యాప్తంగా జనంలోకి వచ్చేస్తోంది కాక్రోచ్ జనతా పార్టీ. దేశంలో స్కూల్స్, కాలేజీల పరిస్థితి ఏంటీ.. స్కూల్ ఫీజులు ఎలా ఉన్నాయి.. కోచింగ్ సెంటర్ల దందా ఏంటీ.. కాలేజీల్లో ఫీజుల వసూళ్ల సంగతి ఏంటీ.. విద్యా వ్యవస్థ ఎలా ఉంది.. ఎలాంటి సంస్కరణలు జరుగుతున్నాయి.. వాటి ఫలితాలు ఏంటీ.. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు విషయంలో ఏం కోరుకుంటున్నారు.. వాళ్లు చెప్పాలనుకుంటున్నది ఏంటీ.. వాళ్ల బాధలు ప్రభుత్వాలు పట్టించుకుంటున్నాయా లేదా.. ఇలాంటి విషయాలపై క్యా బోల్తీ పబ్లిక్ నినాదంతో.. దేశ వ్యాప్తంగా కాక్రోచ్ జనతా పార్టీ అతి పెద్ద క్యాంపెయిన్ స్టార్ట్ చేస్తుంది.

## 'పబ్లిక్ క్యా బోల్తే హై' నినాదంతో మరో రాజకీయ సంచలనం

### సీజేపీ అతిపెద్ద క్యాంపెయిన్‌కు శ్రీకారం

- నిరుద్యోగం, ఫీజుల దోపిడీ,ప్రభుత్వ వ్యవస్థల విధ్వంసంపై ఇక పోరుబాట
- దేశవ్యాప్తంగా పర్యటనలు చేసేందుకు నిర్ణయం
- మీడియాకు వివరాలు వెల్లడించిన కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే



**ముంబై, ఆగస్ట్ 6 (జనంసాక్షి) :**
కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' అంటే ప్రజలు ఏమం టున్నార. పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభి స్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు. విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక ప్రకటన చేసింది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తా మని వెల్లడించింది. ప్రజల ఆందోళనలు, ఆకాంక్ష లను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవ డమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం చేసింది. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని మిగతా 2లో..



# జై బోలో జయశంకర్ సార్..!

## తెలంగాణ సిద్ధాంతకర్తకు రాష్ట్రవ్యాప్తంగా ఘన నివాళులు

### ఆయన సేవలను స్మరించుకున్న అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలు

**హైదరాబాద్, ఆగస్ట్ 6 (జనంసాక్షి) :**
ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు నివాళులర్పిం చారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు జయ శంకర్ సార్ సేవలను స్మరించుకుంటూ.. తెలంగా ణ కోసం ఆయన చేసిన త్యాగాన్ని గుర్తుచేసుకు న్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. సిద్ధాంతకర్తగా తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని ఆయన కొనియాడారు.ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఎన్ని కొత్త పార్టీలు పుట్టినా, వారికి తాత్కాలిక భావసారూప్యత లేకపోయినా, లక్ష్యసారూప్యత ఉండాలని బలంగా వాదించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 93వ జయంతి సందర్భంగా రాజ్యసభ బీఆర్‌ఎస్ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావు, అమర్ రావు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు తోడుగా నిలిచి తెలంగాణ కోసం పోరాడారు జయశంకర్ సార్ అని అన్నారు. ?ప్రజల స్వాభిమానం, సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం జయశంకర్ సార్ నిరంతరం శ్రమించారని పేర్కొన్నారు.? సార్ ?తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చేసిన సేవలు అమూల్యం అని మిగతా 2లో..

# డిజిటల్ చెల్లింపులకు షాక్!

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీల బిల్లుకు సభ గ్రీన్ సిగ్నల్

- అమెరికా ఒత్తిడి వల్లే నిర్ణయం: కాంగ్రెస్ విమర్శ
- ఛార్జీల అంశంపై ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 6 (జనంసాక్షి) :**
యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించడానికి ఉద్దేశించిన 'పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007 సవరణ బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. ఇక డిజిటల్ లావాదేవీలపై బ్యాంకులతో పాటు ఇతర ఫిన్టెక్ సంస్థలకు ఛార్జీలు వసూలు చేసే అధికారం ఈ బిల్లు కల్పించనుంది. ఎలాంటి చర్చా లేకుండానే ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. వాయిస్ ఓటు ద్వారా లోక్సభలో పాస్ అయ్యింది.
యూపీఐ సహా కొన్ని ఎలక్ట్రానిక్ పేమెంట్లపై మర్చంట్ డిస్కౌంట్ రేటును బ్యాంకులు, సర్వీసుల ప్రొవైడర్లు వసూలు చేయకుండా ఇప్పటి వరకు చట్టపరమైన నిబంధన ఉంది. ఈ బిల్లుతో ఇది తొలగనుంది. ప్రస్తుతం ఆర్టీజీఎస్, నెఫ్ట్ ద్వారా జరిపే రియల్ టైం లావాదేవీలపై బ్యాంకులు సర్వీస్ ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. యూపీఐ లావాదేవీలకు మాత్రం మినహాయింపు ఉంది. దీన్ని తాజాగా తొలగించారు. వినియోగదారులు, చిన్న వ్యాపారాల కోసం డిజిటల్ చెల్లింపు సేవలపై చిన్న రుసుము



విధించడంతో పాటు, డిజిటల్ చెల్లింపుల పర్యావరణ వ్యవస్థను నడిపించే బ్యాంకులు, చెల్లింపు సర్వీస్ ప్రొవైడర్లు, పేమెంట్ ఇన్ఫ్రా సంస్థలకు ఆదాయాన్ని కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో నిర్దిష్ట పరిమితి దాటిన యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధించే అవకాశం ఉంది. ఈ ఛార్జీలు పెద్ద వ్యాపారులకే వర్తిస్తాయి. సాధారణ వినియోగదారులకు మిగతా 2లో..




# ఉక్రెయిన్ అగ్గి బరాటా

- రష్యా చమురు కేంద్రాలపై వరుస దాడులు
- సుమారు 605 డ్రోన్లను రాత్రికి రాత్రే కూల్చినట్లు రష్యా ప్రకటన

2

# నీట్ ఇక పూర్తిగా ఆన్‌లైన్‌లో




## సుప్రీంకోర్టుకు కేంద్రం అఫిడవిట్

- జేఈఈ తరహాలో 'నీట్' నిర్వహణ
- ఒకే విడతగా లేదా రెండు దశల్లో నిర్వహించేలా ప్రణాళికలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 6 (జనంసాక్షి) :**
నీట్-యూజీ పరీక్షల నిర్వహణలో సమూల మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు ఉన్న పెన్-అండ్-పేపర్ విధానానికి స్వస్తి పలికి, కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించే అంశం తమ తీవ్ర పరిశీలనలో ఉందని సుప్రీంకోర్టుకు తెలిపి ంది. పేపర్ లీకేజీలు, వ్యవస్థాగత లోపాలను పూర్తిగా అరికట్టేందుకు ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొంది. జేఈఈ (మెయిన్స్ అడ్వాన్స్‌డ్) తరహాలోనే నీట్‌ను కూ డా ఆన్‌లైన్‌లో ఒకే విడతగా లేదా రెండు దశల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నందన్ నిలేకని నేతృత్వంలోని హైపవర్ టాస్క్‌ఫోర్స్ కమిటీ ఇచ్చే సిఫార్సుల ఆధారంగానే నూతన విధానంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఆన్‌లైన్ విధానంలోకి మారి తే విద్యార్థులు సిద్ధమవ్వడానికి వీలుగా వీలైనంత త్వరగా స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని మరో వైపు వైద్యుల సంఘం విజ్ఞప్తి చేసింది. మిగతా 2లో..

# ఢిల్లీకి సామంతులమా?



- సాధించుకున్న తెలంగాణ దేనికి?: కేటీఆర్ ఫైర్
- జయశంకర్ సార్‌కు ఘన నివాళులు

**హైదరాబాద్,ఆగస్టు 6 (జనంసాక్షి) :**
తెలంగాణలో మళ్లీ నీళ్లకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేటీఆర్ తెలిపారు. తెలంగాణకు సంబంధించిన 7 ప్రాజెక్టులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ ప్రభుత్వం మిగతా 2లో..

# మా వాటా మాకు ఇవ్వాల్సిందే!

### అందుకే ఢిల్లీకి సీఎం పయనం : విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, ఆగస్టు 6 (జనంసాక్షి) :**
ప్రొఫెసర్ జయశంకర్ జయంతి రోజున కూడా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చవకబారు రాజకీయాలు మాట్లాడటం సిగ్గుచేటని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. సీఎల్పీ మీడియా సెంటర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కేసీఆర్, కేటీఆర్లు తెలంగాణ ఉద్యమకారులను గానీ, ప్రొఫెసర్ జయశంకరు గానీ ఏనాడూ మిగతా 2లో..



# ఆగస్ట్ 15 నుంచి కొత్త తెల్ల రేషన్ కార్డులు

## 1.05 కోట్ల కొత్త, ల్యామినేటెడ్ రేషన్ కార్డులు

- అర్హులకు ఆహార భద్రతను విస్తరించడమే లక్ష్యం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,ఆగస్టు 6 (జనంసాక్షి) :**
తెలంగాణలో నూతన పీడీఎస్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం తుది ముహూర్తం ఖరారు చేసింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ను ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అర్హులకు ఆహార భద్రతను విస్తరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.05 కోట్ల కొత్త, ల్యామినేటెడ్ రేషన్ కార్డులను అర్హులకు అందించనున్నా రు. సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి మిగతా 2లో..

# హలో మోదీజీ..!

- నేతన్యాహు ఫోన్‌లో సంభాషణ
- ద్వైపాక్షిక విజయాలపై ముచ్చట్లు
- వ్యూహాత్మక భాగస్వామ్యం, పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ



2

# పెట్టుబడుల వరదకు మా విధానాలే కారణం

- జీసీసీలకు తెలంగాణే బెస్ట్ డెస్టినేషన్
- మంత్రి శ్రీధర్ బాబు



2 లో..

# నిరసన తెలిపే యువత దేశ వ్యతిరేకులు కాదు

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

# ప్రజల మధ్యకు 'కాక్రోచ్' ప్రభంజనం!

తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు. మహారాష్ట్రలో నిర్వహించిన పార్టీ ప్రధాన బృంద సమావేశం అనంతరం దీప్కే ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరఫున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతాయి' అని దీప్కే పేర్కొన్నారు. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్య అని, దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు. భారతీయ కుటుంబాలకు నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోందని, అందుకే ఆ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు. ఒకటో తరగతికి ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఆ భారం తగ్గాలని మా పార్టీ కోరుకుంటోంది. తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత విద్య అందించాలనుకున్నప్పుడు దాని వారు భారంగా భావించకూడదు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయిందని దీప్కే వ్యక్తంచేశారు. తమ ప్రచారంలో పాల్గొనాలనుకునేవారు అధికారిక క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని సూచించారు. ఆ క్యూఆర్ కోడ్‌లను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. సభ్యత్వం పూర్తిగా ఉచితమని చెప్పారు. మోసపూరిత చెల్లింపు అభ్యర్థనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా... ఒత్తిడి తెచ్చే సంస్థగా సీజేపీ పనిచేస్తుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. రాజకీయ పార్టీల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు ఉదయం ఒక పార్టీకి ఓటేస్తే సాయంత్రంకల్లా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఆయన అన్నారు.

## ఉక్రెయిన్ అగ్గి బరాటా

**మాస్కో, ఆగస్టు 6 (జనంసాక్షి) :** ఉక్రెయిన్ భారీ సంఖ్యలో డ్రోన్లతో రష్యాపై అటాక్ చేసింది. యరోస్లావిల్ సిటీపై జరిగిన దాడిలో ఆయిల్ రిఫైనరీ దెబ్బతిన్నది. ఆ నగరం నుంచి దట్టమైన నల్లటి పొగలు వ్యాపిస్తున్నాయి. తమ నగరంపై అతి పెద్ద అటాక్ జరిగినట్లు గవర్నర్ మైఖైల్ ఎవ్రేవ్ తెలిపారు. సుమారు 92 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు ఆయన చెప్పారు. రష్యాలో ఉన్న అతిపెద్ద 5 ఆయిల్ రిఫైనరీల్లో ఇదొకటి. మరో వైపు రష్యా చేసిన దాడిలో బాలక్లియా సిటీలో ముగ్గురు మృతి చెందినట్లు ఉక్రెయిన్ తెలిపింది. 12 మంది గాయపడ్డారు. ఉక్రెయిన్ వదిలిన సుమారు 605 డ్రోన్లను రాత్రికి రాత్రే కూల్చినట్లు రష్యా ప్రకటించింది. అనేక ప్రాంతాలపై డ్రోన్ దాడులు జరిగాయి. మాస్కోతో పాటు నల్ల సముద్ర ప్రాంతంతో పాటు యరస్లావిల్ ఆయిల్ రిఫైనరీపై అటాక్ జరిగింది. ఈ ఆయిల్ రిఫైనరీలో ప్రతి ఏడాది సగటున 15 మిలియన్ల టన్నుల క్రూడ్ ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తారు.

## డిజిటల్ చెల్లింపులకు షాక్!

వర్తించవు.

**అయ్యే ఖర్చును ఎవరో ఒకరు భరించాల్సిందే..**

యూపీఐ లావాదేవీలపై ఛార్జీల అంశంపై ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేయాలంటే అందుకు అయ్యే ఖర్చును ఎవరో ఒకరు భరించాల్సిందేనని పేర్కొన్నారు. ద్రైమాసిక పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు ప్రకటన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన.. యూపీఐ ఛార్జీల అంశంపై స్పందించారు. దీనిపై అప్పుడే మాట్లాడడం తొందరపాటే అవుతుందన్న ఆయన.. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిన అవసరం ఉందన్నారు.

## నిరసన తెలిపే యువత దేశ వ్యతిరేకులు కాదు

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్
- జెన్-జెడ్ మనవాళ్లే, వారి సమస్యలను పరిష్కరించాలని సూచన
- ప్రస్తుత తరం కంటే యువత ఎంతో నిజాయితీపరులని వ్యాఖ్య



**ముంబై ఆగస్టు 6 (జనంసాక్షి) :** నిరసనలు చేస్తున్నారనే కారణంతో జెన్-జీ యువతను దేశద్రోహం లుగా ముద్ర వేయడం సరైంది కాదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. వాళ్లంతా మన దేశ భవిష్యత్తు అని, వాళ్లంతా మనవాళ్లేనని, వారి సమస్యలను వినడం, పరిష్కరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హితవు పలికారు. ప్రపంచంలోనే అతిపెద్ద యువత ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాల్లో ఒకటిగా పేర్కొంటున్న 'ది రోల్ ఆఫ్ యూత్ ఇన్ యునైటింగ్ ది వరల్డ్, ది ఇండియన్ వే' సదస్సులో మోహన్ భగవత్ పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. "జెన్ జీ యువత ఆందోళనలు చేస్తున్నం టే వారు దేశ వ్యతిరేకు లు కారు. వారు మనవాళ్లే.. మన తర్వాతి తరం. వారు ఎందుకు నిరసనలు వ్యక్తం చేస్తున్నారో తెలుసు కుని, వారి ఆందోళనలను పరిష్కరించాలి." అని అన్నారు. అయితే ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేయడానికి కూడా కొన్ని పద్ధతులు, నియమాలు ఉంటాయని సూచించారు. యువత అసలు నిరసన లు చేయకూడదని తాను చెప్పడం లేదని.. కానీ ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేయడానికి ఒక విధానం ఉంటుందని.. ఆ మార్గంలోనే తమ అభిప్రాయాలను వెల్లడించాలని భాగవత్ పేర్కొన్నారు

# ఒకే డిజిటల్ వ్యవస్థ పరిధిలోకి రోడ్లు

ముఖ్యమంత్రి కార్యదర్శి మణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్, నగరంలోని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ప్రధాన రహదారులు అన్నీ ఒకే రోడ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూసేకరణ, రుణాల నిర్వహణ, రోడ్ల నిర్వహణ, అభివృద్ధి పనులు తదితర అంశాలన్నీ ఈ వ్యవస్థ ద్వారా పర్యవేక్షించేలా రూపొందించాలని ఆదేశించారు.

### సీఎం అసంతృప్తి

ఔటర్ రింగ్ రోడ్ నిర్వహణ సంతృప్తికరంగా లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివేయడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రహదారి నిర్వహణను నిరంతరం పర్యవేక్షించి లోపాలను వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) విధానంలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం సేకరించిన భూములకు మాత్రమే టీడీఆర్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. టీడీఆర్ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ లో నిర్వహించి ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పకడ్బందీ వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు రేడియల్ రోడ్--1 పనులను డిసెంబర్ 9లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు నిర్దేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణంలో ఎదురవుతున్న అడ్డంకులను వెంటనే తొలగించాలని సూచించారు.

### భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం

బద్వేల్ ఇంటర్‌చేంజ్ ట్రంపెట్ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంతో పూర్తి చేయాలని, ఎలివేటెడ్ కారిడార్లు-1, 11 పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే బంజారాహిల్స్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్-3 పనులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, అధికారులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని సీఎం హెచ్చరించారు. రోడ్లప్రణాళిక, నిర్మాణ దశల నుంచే ట్రాఫిక్ విభాగాన్ని భాగస్వామ్యం చేయాలని, ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించవద్దని స్పష్టం చేశారు.

## జై బోలో జయశంకర్ సార్‌కు..!



వెల్లడించారు. మలిదశ ఉద్యమ సమయంలో తెలంగాణ కోసం పోరాడిన సార్ 2011లో ప్రత్యేక రాష్ట్రం రాకముందే కన్నుమూయడం బాధాకరమని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఏ రోజూ కూడా జై తెలంగాణ అనలేదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ఈరోజు తెలంగాణ సీఎంగా ఉన్నారని విమర్శించారు. సిద్దిపేట ప్రాంతంతో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎంతో అనుబంధం ఉండేదని హరీశ్ రావు అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్ పోరాటం, జయశంకర్ సారు ఆరాటం వల్లే అని చెప్పుకొచ్చారు. గోదావరిలో 380 టిఎంసిల నీళ్లు కేసీఆర్ నాయకత్వంలో హక్కుగా సాధించామని గుర్తుచేశారు.

## మా వాటా మాకు ఇవ్వాల్సిందే!

పట్టించుకోలేదని మండిప డ్డారు. "అధికారంలో ఉన్నప్పు డు జయశంకర్ సార్ పేరును ఒకటి రెండు సంస్థలకు పెట్టి వదిలేశారే తప్ప కనీసం ఆయన విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయలేదు. వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలంలోని ఆయన స్వగ్రామమైన అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా మార్చాలని గ్రామస్థులు కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదు. కానీ మా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీఓ నెంబర్ 405 జారీ చేసి అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ప్రకటించింది. తెలంగాణ మిగులు బడ్జెట్ ప్రాంతమని జయశంకర్ సార్ చెబితే, కేసీఆర్ మాత్రం పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు" అని ఆది శ్రీనివాస్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి చంద్రబాబు గురువు అని కేటీఆర్ అనడాన్ని తిప్పికొడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలే గురువులు, శ్రేయోభిలాషులని స్పష్టం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో ప్రజల తరఫున నిలబడి పోరాడతామని, విచ్చలవిడిగా బూతులు మాట్లాడటం కేటీఆర్ మానుకోవాలని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు పోస్టుమార్టం చేసుకోకుండా ఇంకా ఊహల్లోనే బతుకుతున్నారని ఎద్దేవా చేశారు.

## ఢిల్లీకి సామంతులమా?

అడుగుతుంది. ఢిల్లీ పార్టీ చేతుల్లో జుట్టు ఉంటే వాళ్లు ఆడించినట్లే ఆడాలి. అదే తెలంగాణ కోసం పుట్టిన పార్టీ అధికారంలో ఉంటే ఆ పరిస్థితి ఉంటుందా..? అని కేటీఆర్ అడిగారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం సమయంలో ఎన్ని కొత్త పార్టీలు పుట్టినా, వారికి తాత్కాలిక భావసారూప్యత లేకపోయినా, లక్ష్యసారూప్యత ఉండాలని బలంగా వాదించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు. లోక్‌సభలో తెలంగాణ విభజనను పాకిస్తాన్‌తో పోలిస్తే ఒక్క బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ అయినా మాట్లాడిండా..? అదే మనవాడు ఉంటే గల్లా పట్టి అడిగేవాడని అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 75వ సారి ఇవాళ ఆయన ఢిల్లీలో ఉన్నడు. ముఖ్యమంత్రి అయి 32 నెలలు కూడా కాలేదు.. రేపటితోనో, ఎల్లుండితోనో అవుతయి. కానీ 13 రోజులకోసారి ఢిల్లీ పోతడు.. 2,3 రోజులు అక్కడుంటడు. దేహి దేహీ అని ఈ రోజు అక్కడ యాచిస్తున్నడు. అందుకే జయశంకర్ సార్ ఢిల్లీకి సామంతులుగా ఉండొద్దు.. స్వతంత్రులుగా ఉండాలే అని కోరుకున్నరని అన్నారు. ఎన్నటికైనా స్వీయ రాజకీయ అస్థిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష. తెలంగాణ కోసం ఒక స్వీయ రాజకీయ అస్థిత్వ పతాక ఉండాలే. ఎన్నటికైనా తెలంగాణ కోసం ఎలాంటి రాజీ లేకుండా ఎవరితో కాంప్రమైజ్ కాకుండా గొంతు విప్పితే ఒక సింహం లాగా గర్జించే విధంగా కేసీఆర్ తీరుగా గొంతు ఉండాలే.. అందుకే కాంగ్రెస్‌లో కలవొద్దు అని గట్టిగా వాదించిన నాయకుడు, మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు.

## ఆగస్ట్ 15 నుంచి కొత్త తెల్ల రేషన్ కార్డులు

స్వయంగా ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని 119అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ పక్రియ మొదలవుతుంది. స్వాతంత్య్ర దినోత్సవం రోజున మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఈ పంపిణీ కార్యక్రమాలు సాగుతాయి. కార్య క్రమం సజావుగా సాగేందుకు ప్రతి నియోజక వర్గంలో పంపిణీ పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం ఆర్డీవోలకు అప్పగించింది. స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల భాగస్వా మ్యంతో ఈ వేడుకలు జరగనున్నాయి. కార్డుల సేకరణకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేదికల వద్ద మౌలిక వసతులు, తాగునీరు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ పూర్తయిన వెంటనే సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు

## పెట్టుబడుల వరదకు మా విధానాలే కారణం

**హైదరాబాద్, ఆగస్టు 6 (జనంసాక్షి) :** హైదరాబాద్ కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42శాతమని మంత్రి తెలిపారు. హెల్త్‌కేర్, బయోటెక్, సెమీకండక్టర్లకు హైదరాబాద్ తొలి ఎంపిక అని వివరించారు. జేఎల్ఎల్ జీసీసీతో రెండేళ్లలో 1,600 ఉద్యోగాలు వస్తాయని చెప్పుకొచ్చారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులకు తెలంగాణ ఆకర్షణ కేంద్రమని వెల్లడించారు. ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీతో పెట్టుబడులకు కొత్త ఊపు వస్తోందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధితో యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో జీసీసీల విస్తరణలో వేగం పెరిగిందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

తెలంగాణకు 150 కొత్త జీసీసీలు 20 నెలల్లో రానున్నాయని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. జీసీసీలతో 1.5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు ప్రకటించారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ శాఖ

జిల్లా కలెక్టర్ కార్యాలయము
ఆదిలాబాద్

ఫారం-VII
(పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)
(భూ సకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధకమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం - 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి)

కలెక్టర్ ఫైల్ నెం. జి1/816/2018 తేది: 01.07.2026
ఆర్డీఓ ఫైల్ నెం. B/105/2022 తేది: 25.06.2026

ఈ దిగువ నిర్దిష్ట పరిచిన ఆదిలాబాద్ జిల్లా జైనథ్/బేల మండలములోని 1, కరంజి, 2 నారాయణపూర్, 3 సంగిడి, గ్రామములోని మొత్తము విస్తీర్ణము ఎ. 15.16 గుంటలు భూమి ప్రజాప్రయోజనం నిమిత్తం అనగా ఇంటర్ స్టేట్ లోవర్ పెన్ గంగా ప్రాజెక్టు(DI) డిస్ట్రి బుటోరి DL-19 మెయిన్ 4L సబ్ మైనర్ 13- మైనర్ కాలువల నిర్మాణము నిమిత్తం సదరు భూసేకరణ ప్రకటన జారీ చేయనైనది. ఇట్టి ప్రాజెక్ట్ ప్రభుత్వ ఉత్తర్వులు నెం. 58 ఐ అండ్ సి ఎ డి (ఎల్.ఏ ఆర్ & ఆర్ ఏ) ఇట్టి ప్రాజెక్ట్ ప్రభుత్వం ఉత్తర్వుల శాఖ తేదీ: 25.07.2017. ననుసరించి భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 చాప్టర్-II మరియు III పరిధి నుండి మినహాయింపు ఇవ్వబడినది.

కావున ఆదిలాబాద్ జిల్లా జైనథ్/బేల మండలములోని 1, కరంజి, 2 నారాయణపూర్, 3 సంగిడి, గ్రామములోని మొత్తము విస్తీర్ణము ఎ. 15.16 గుంటలు భూమి ప్రజాప్రయోజనం నిమిత్తం అనగా ఇంటర్ స్టేట్ లోవర్ పెన్ గంగా ప్రాజెక్టు (DI) డిస్ట్రి బుటోరి DL-19 మెయిన్ 4L సబ్ మైనర్ 13L మైనర్ కాలువల నిర్మాణము నిమిత్తం నిర్మాణంనక అవసరమైనందున భూమిని సేకరించుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

షెడ్యూలు

గ్రామము: కరంజి &(2 గ్రామములు) మండలము: జైనథ్/బేల జిల్లా: ఆదిలాబాద్

| క్రమ సంఖ్య | సర్వే నెం. | ఉప నెం. | సర్వే విస్తీర్ణం | పట్టా/మెట్ట/తరి | సేకరించబోవు విస్తీర్ణం | పట్టాదారు పేరు/ తండ్రి పేరు | కాస్తుదార్ పేరు/ తండ్రి పేరు | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1-కరంజి -కే గ్రామము జైనథ్ మండల్ (DL-19, 4L సబ్-మైనర్, 13ఎల్, మైనర్) | | | | | | | | |
| 1 | 45/2 | 45/ఆ | 1.03 | పట్టా/ మెట్ట | 0.26 | సమ అభిరామ్ రెడ్డి తండ్రి నర్సింగ్ రెడ్డి | స్వంతం | అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ |
| 2 | | 45/అ | | పట్టా/ మెట్ట | 0.08 | సమ లింగ రెడ్డి తండ్రి రాంరెడ్డి | స్వంతం | లేదు |
| 3 | | 45/ఉ | | పట్టా/ మెట్ట | 0.07 | సమ ఆశిష్ రెడ్డి తండ్రి లింగ రెడ్డి | స్వంతం | " |
| 4 | | 45/ఈ | | పట్టా/ మెట్ట | 0.01 1/2 | సమ అశోక్ రెడ్డి తండ్రి నారన్నా | స్వంతం | " |
| 5 | | 45/ఇ/ 1 | | పట్టా/ మెట్ట | 0.00 1/2 | సమ అనిల్ రెడ్డి తండ్రి లింగ రెడ్డి | స్వంతం | " |
| 6 | 46/2 | 46/2 | 0.08 | పట్టా/ మెట్ట | 0.08 | ఎల్మ రజనీకాంత్ రెడ్డి తండ్రి రామ్ రెడ్డి | స్వంతం | " |
| 7 | 47/2 | 47/అ | 1.01 | పట్టా/ మెట్ట | 0.29 | సమ మీనాషి భర్త/ తండ్రి ప్రభాకర్ రెడ్డి | స్వంతం | " |
| 8 | | 47/ అ1 | | పట్టా/ మెట్ట | 0.12 | సమవార్ గోవర్దన్ తండ్రి గంగా రెడ్డి | స్వంతం | " |
| 9 | 50/2 | 50/ఇ /2 | 0.33 | పట్టా/ మెట్ట | 0.09 | యెల్టి నవీన్ రెడ్డి తండ్రి విట్టల్ రెడ్డి | స్వంతం | " |
| 10 | | 50/ఆ | | పట్టా/ మెట్ట | 0.24 | గంగమ్ రాంరెడ్డి తండ్రి శివ రెడ్డి | స్వంతం | " |
| 11 | 51/2 | 51/ఉ | 0.01 | పట్టా/ మెట్ట | 0.01 | తుమనే గంగు బాయి భర్త పొచ్చిరామ్ | స్వంతం | " |
| | మొత్తం | | 3.06 | | 3.06 | (3.09 (-) 0.06 = 3.09 | | |
| 2-నారాయణపూర్ గ్రామము బేల మండల్ (DL-19, 4L సబ్-మైనర్, 13 ఎల్, మైనర్) | | | | | | | | |
| 1 | 4/2 | 4/2 | 1.09 | పట్టా/ మెట్ట | 1.09 | సమ విద్యారాణి భర్త రవీందర్ రెడ్డి | స్వంతం | అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ |
| 2 | 16/2 | 16/E | 2.34 | పట్టా/ మెట్ట | 0.19 | M. నర్సింహారెడ్డి తండ్రి వెంకర్ రెడ్డి | స్వంతం | లేదు |
| 3 | | 16/B | | పట్టా/ మెట్ట | 0.18 | తిరుపతి రెడ్డి తండ్రి లస్మారెడ్డి | స్వంతం | " |
| 4 | | 16/A | | పట్టా/ మెట్ట | 0.20 | M. రామన్న తండ్రి బాపు | స్వంతం | " |
| 5 | | 16/D | | పట్టా/ మెట్ట | 0.20 | M. దేవ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి | స్వంతం | " |
| 6 | | 16/1 | | పట్టా/ మెట్ట | 0.37 | M. నర్సింగ్ రెడ్డి తండ్రి లస్మా రెడ్డి | స్వంతం | " |
| 7 | 28/2 | 28 | 1.13 | పట్టా/ మెట్ట | 0.27 | నక్కవార్ నారాయణ తండ్రి దేవన్న | స్వంతం | " |
| 8 | | 28/1 | | పట్టా/ మెట్ట | 0.26 | M. నర్సింగ్ రెడ్డి తండ్రి లస్మ రెడ్డి | స్వంతం | " |
| 9 | 29/2 | 29/1 | 1.16 | పట్టా/ మెట్ట | 1.16 | ప్రమోద్ కుమార్ తండ్రి లైహినూజి | స్వంతం | " |
| 10 | 32/2 | 32/2 | 1.02 | పట్టా/ మెట్ట<br>పట్టా/ మెట్ట<br>పట్టా/ మెట్ట<br>పట్టా/ మెట్ట<br>పట్టా/ మెట్ట | 1.02 | 1. గెడమ్ రాందాస్, 2. జ్ఞనాన్ దాస్ 3.రోహిదాస్, 3.కావల్దాస్ తండ్రి దావు | G.రోహిదాస్ తండ్రి దావు<br>G.సదాశివ్ తండ్రి వర్లు<br>జి. పండరి తండ్రి హన్మ్య<br>జి.మోతీరం తండ్రి వావాజి<br>గంగారామ్ తండ్రి విత్తు | "<br>"<br>"<br>"<br>" |
| 11 | 33/2 | 33/B | 0.27 | పట్టా/ మెట్ట | 0.13 1/2 | యెల్టి గోవర్ధన్ రెడ్డి తండ్రి భూమా రెడ్డి | స్వంతం | " |
| 12 | | 33/C | | పట్టా/ మెట్ట | 0.13 1/2 | యెల్టి జయగోవర్ధన్ రెడ్డి తండ్రి భూమా రెడ్డి | స్వంతం | " |
| | మొత్తం | | 8.21 | | 8.21 | (8.30(-) 0.09 = 8.21) | | |
| (3-సంగిడి గ్రామము బేల మండల్ (DL-19, 4L సబ్-మైనర్, 13ఎల్, మైనర్) | | | | | | | | |
| 1 | 128/ 2 | 128/2 | 0.33 | పట్టా/ మెట్ట | 0.33 | కుంట అమృత్‌రెడ్డి తండ్రి గణేశ్‌రెడ్డి | స్వంతం | లేదు |
| 2 | 130/ 2 | 130/ 2 | 0.24 | పట్టా/ మెట్ట | 0.24 | కుంట రమాబాయి తండ్రి భర్త రాఘవ్‌రెడ్డి | స్వంతం | " |
| 3 | 131/ 2 | 131/ 2 | 1.11 | పట్టా/ మెట్ట | 1.11 | హేమ భర్త మధుసూదన్ | స్వంతం | " |
| 4 | 133/ 1/2 | 133/ 1/2 | 0.39 | పట్టా/ మెట్ట | 0.39 | కుంట భారతి భర్త రాజశేఖర్ | స్వంతం | " |
| 5 | 134/ 3/2 | 134/ 3/2 | 0.02 | పట్టా/ మెట్ట | 0.02 | గోహర్కర్ ప్రభాకర్ తండ్రి వార్లు | స్వంతం | " |
| మొత్తం | | | 3.29 | | 3.29 | | | |
| సంపూర్ణ మొత్తం | | | 15.16 | | 15.16 | | | |

సెక్షన్ 15(కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ / జైనథ్ మండలములోని 1, కరంజి, 2 నారాయణపూర్, 3 సంగిడి, గ్రామములోని మొత్తము విస్తీర్ణము ఎ. 15.16 గుంటలు గుర్తించనైనది.

భూసేకరణ, పునరావాసం మరియు పునరావాసంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం, 2013 యొక్క సెక్షన్ 16 ప్రకారం, ప్రాజెక్ట్ పాలనదికారి, ఇంటర్ స్టేట్ లోయర్ పెంగంగా ప్రాజెక్ట్, ఆదిలాబాద్ గారి అధ్వర్యములో నిర్వహణ అధికారులు పంపిన అభ్యర్థనల ప్రకారము తమ భూమి చేర్చబడ్డ ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబాల సామాజిక-ఆర్థిక సర్వే చేయడం జరిగినది మరియు పునరావాసం మరియు రి-సెటిల్మెంట్ ప్యాకేజ్ (R&R - ప్యాకేజ్) పొందుటకు ఎవరు అర్హులు కారు అని తెలియ పర్చనైనది.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైన పని దినములలో మరియు కార్యాలయము పనివేళలో జిల్లా కలెక్టరు ఆదిలాబాదు/రాజస్వ మండలాధికారి, ఆదిలాబాద్ గారి కార్యాలములో పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సం/- రాజస్వ మండలాధికారి, మరియు భూసేకరణ అధికారి ఆదిలాబాద్
సం/- అదనపు కలెక్టర్ ఆదిలాబాద్
సం/- జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్

DIPR R.O.No. 595/LA/PP/Advt/2026-27


# హలో మోదీజీ..!

**న్యూఢిల్లీ,ఆగస్టు 6 (జనంసాక్షి) :** పశ్చిమాసియా ప్రాంతంలో భౌగోళిక రాజకీయాలు, భద్రతా పరిస్థితులు అత్యంత వేగంగా మారుతున్న వేళ ప్రపంచ దృష్టిని ఆకర్షించే కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ ప్రధాని బెన్జమిన్ నెతన్యాహు గురువారం భారత ప్రధాని నరేంద్ర మోదీకి స్వయంగా ఫోన్ చేశారు. అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలు, భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్న ప్రస్తుత తరుణంలో.. ఇద్దరు అగ్రనేతల మధ్య జరిగిన ఈ సంభాషణ తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకుంది. పశ్చిమాసియాలో తాజా పరిస్థితులు, యుద్ధ మేఘాల మధ్య ప్రాంతీయ శాంతి భద్రతలతో పాటు భారత్-ఇజ్రాయెల్ ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు.

ఈ ఫోన్ సంభాషణకు సంబంధించిన వివరాలను భారత ప్రధాని కార్యాలయం అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించింది. భారత్ - ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' సాధించిన పురోగతిని ఇద్దరు నేతలు చర్చించుకున్నారు. రక్షణ, వ్యవసాయం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, నీటి యాజమాన్యం, సైబర్ సెక్యూరిటీ, ద్వైపాక్షిక వాణిజ్య రంగాల్లో ఇరుదేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించాలని నిశ్చయించుకున్నారు. రెండు దేశాల పరస్పర ప్రయోజనాలే లక్ష్యంగా ఈ సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తామని ఇద్దరు నేతలు పునరుద్ఘాటించారు.

### పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ

పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులపై నెతన్యాహు, మోదీ తమ తమ దృక్పథాలను పంచుకున్నారు. ఈ ప్రాంతంలో శాంతిభద్రతల పునరుద్ధరణ, దౌత్యపరమైన మార్గాలు, భద్రతా సవాళ్లపై ఇరుపక్షాలు లోతుగా మాట్లాడాయి. దౌత్యపరమైన రహస్యాల దృష్ట్యా సంభాషణకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం బయటపెట్టకపోయినప్పటికీ, ప్రాంతీయ పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తూ, భవిష్యత్తులోనూ ఇద్దరూ నిరంతరం సంప్రదింపుల్లో ఉండాలని అంగీకారానికి వచ్చినట్లు పీఎంవో స్పష్టం చేసింది. న్యూఢిల్లీ - టెల్ అవీవ్ మధ్య ఉన్న బలమైన దౌత్య సంబంధాలకు ఈ ఫోన్ సంభాషణ మరొక తార్కాణంగా నిలిచింది

# మెటా తీరుపై మండిపడ్డ కేజ్రీవాల్

- తన ఖాతాను నియంత్రిండంపై ఆక్షపణ
- ప్రధాని మోడీ ఒత్తిళ్లకు తలొగ్గద్దని సూచన



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 (జనంసాక్షి) :** తన అకౌంట్ నియంత్రణపై మెటా అధికారులను ప్రశ్నిస్తే సరిగా సమాధానం ఇవ్వడం లేదని, ఈమెయిల్ పంపినా కూడా స్పందించడం లేదన్నారు. ప్రధాని మోదీ ఒత్తిళ్లకు తలగొద్దని మెటా సంస్థకు కేజ్రీవాల్ సూచించారు. తన సోషల్ మీడియా ఖాతాను భారత్‌లో ఎందుకు నిలిపివేశారో సంస్థ నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని కేజ్రీవాల్ మండిపడ్డారు. మెటా ఇండియా కార్యాలయంలో మౌఖికంగా విచారించినా ఎలాంటి సరైన సమాధానం రాలేదని, తాము పంపిన ఈమెయిల్స్‌కు సాధారణ రసీదులు మాత్రమే వస్తున్నాయని ఆరోపించారు. ఇది చాలా చెత్త సేవ అంటూ అసహనం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి ఒత్తిళ్లకు తలవంచకండి.. లేదంటే భవిష్యత్తు లో దేశంలో ప్రధాని ఖాతా ఒక్కటే నడుపుకోవడానికి మిమ్మల్ని అనుమతిస్తారు' అంటూ ఆయన ఎద్దేవా చేశారు. మెటా సంస్థ తన సేవలను మరింత బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని కేజ్రీవాల్ అన్నారు. కాగా, దేశంలో మెటా సంస్థపై ప్రస్తుతం తీవ్రస్థాయిలో ప్రభుత్వ నిఘా, విచారణ కొనసాగుతున్న తరుణంలో కేజ్రీవాల్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## నీట్ ఇక పూర్తిగా ఆన్‌లైన్‌లో...

ఇక, నీట్ అక్రమాలపై సీబీఐ విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో కీలక నిందితులైన రాజస్థాన్‌కు చెందిన బీవాల్ కుటుంబ సభ్యులకు పాలిగ్రాఫ్, లై-డిటెక్టర్ పరీక్షలు నిర్వహించాలనే పిటిషన్‌పై ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పును ఆగస్టు 10కి రిజర్వ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం సమర్పించిన ఈ ప్రతిపాదనలపై పిటిషనర్లు తమ స్పందనలను తెలియజేయాలని జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఆలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19 కి వాయిదా వేసింది.

# ప్రధాని మోదీ విదేశీ ప్రయాణాల ఖర్చు రూ.550 కోట్లకుపైనే

**పలు దేశాల పర్యటనలపై వివరాలు వెల్లడించిన విదేశాంగ శాఖ**

**న్యూఢిల్లీ,ఆగస్ట్ 6 (జనంసాక్షి) :**

ప్రధాని మోదీ విదేశీ ప్రయాణాల ఖర్చులకు సంబంధించి విదేశాంగ శాఖ వివరాలు వెల్లడించింది. 2025లో మొత్తం 23 దేశాల్లో పర్యటించగా, ఇందుకోసం రూ.187 కోట్లు ఖర్చు అయినట్లు తెలిపింది. 2021 నుంచి విదేశీ ప్రయాణాల కోసం మొత్తంగా సుమారు రూ.550 కోట్లకుపైగా ఖర్చయ్యిందని, ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.74 కోట్లు ఖర్చు అయినట్లు పేర్కొంది. ప్రధాని మోదీ 2021 నుంచి ఇప్పటివరకు ఏయే దేశాల్లో పర్యటించారు? ఒక్కో దేశ పర్యటనకు అయిన ఖర్చు ఎంత? తదితర వివరాలపై రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు విదేశాంగశాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గెరిటా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు పీఎం చేపట్టిన విదేశీ పర్యటనల కోసం రూ.74.58 కోట్లు ఖర్చు అయ్యింది. జులై 6 నుంచి 11 వరకు ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటించారు. విదేశీ పర్యటనల కోసం గతేడాది (2025లో) రూ.187 కోట్లు, 2024లో రూ.109 కోట్లు, 2023లో రూ.93 కోట్లు, 2022లో రూ.55 కోట్లు, 2021లో రూ.36 కోట్లు ఖర్చయినట్లు కేంద్రం వెల్లడించింది. గతేడాది (2025) మొత్తంగా 23 దేశాల్లో పర్యటించారు. ఫ్రాన్స్ (రూ.25 కోట్లు), అమెరికా (రూ.16 కోట్లు), సౌదీ అరేబియా (రూ.15 కోట్లు), బ్రెజిల్ (రూ.17 కోట్లు), చైనా (రూ.10 కోట్లు), బ్రిటన్ (రూ.9 కోట్లు) తదితర దేశాల్లో ప్రధాని మోదీ అధికారిక పర్యటనలు చేశారు. మారిషస్, థాయ్‌లాండ్, శ్రీలంక, సైప్రస్, కెనడా, క్రొయేషియా, ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అ÷-జ్గ÷ంటీనా, నమీబియా, మాల్దీవులు, జపాన్, భూటాన్, దక్షిణాఫ్రికా, జోర్డాన్, ఒమన్, ఇథియోపియా దేశాల్లోనూ ప్రధాని మోదీ పర్యటించారు. వివిధ దేశాలతో సన్నిహిత సంబంధాలను పెంపొందించడానికి.. ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశ భాగస్వామ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రధానమంత్రి అత్యున్నత స్థాయి పర్యటనలు దోహదం చేస్తాయని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ పర్యటనల (ఏప్రిల్ 2021- డిసెంబర్ 2025 మధ్య) సందర్భంగా చేసుకున్న అవగాహన ఒప్పందాల్లో భాగంగా సుమారు 381 బిలియన్ డాలర్ల (రూ.30 లక్షల కోట్ల కన్నా ఎక్కువ) విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చినట్లు తెలిపింది.

ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలకు సంబంధించిన వివరాలను తాజాగా విదేశాంగ శాఖ వెల్లడించింది. 2021 నుంచి 2025 డిసెంబర్ వరకు ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై మొత్తం రూ.482.92 కోట్లు ఖర్చు అయ్యాయి. అదే సమయంలో భారత్‌కు 381.8 బిలియన్ అమెరికన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. అంటే భారతీయ కరెన్సీలో సుమారు రూ.31.69 లక్షల కోట్లు. ప్రధాని విదేశీ పర్యటనలపై ఖర్చు చేసిన ఒక్కో రూపాయికి సుమారు రూ.66 వేలు విలువైన ఎఫ్‌డీఐలు భారత్‌కు వచ్చినట్లు ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలు

**ముంబై, ఆగస్టు 6 (జనంసాక్షి) :** తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు 2013లో నమోదైన లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టు గోవా బెంచ్ పదేళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే రూ.5 లక్షల జరిమానా విధించిన న్యాయస్థానం, రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. 2013లో గోవాలో జరిగిన థింక్‌ఫెస్ట్ కార్యక్రమం సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో తనపై జూనియర్ సహోద్యోగినిపై లైంగిక దాడికి పాల్పడ్డారని నమోదైన కేసులో హైకోర్టు ఈ తీర్పు వెలువరించింది. తీర్పులో బాధితురాలు తేజ్‌పాల్ ఆధ్వర్యంలో పనిచేసిన ఉద్యో గి అని, ఇద్దరి మధ్య ఉన్న అధికార అసమానతను ఆయన దుర్వినియోగం చేశారని కోర్టు పేర్కొంది. బాధితురాలు పలుమార్లు నిరాకరించినప్పటికీ ఆమె అభ్యంతరా లను పట్టించుకోలేదని, "నో అంటే నో" అనే ప్రాథమిక సూత్రాన్ని విస్మరించారని గోవా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు.

### సుప్రీంకోర్టును ఆశ్రయిస్తా: తేజ్‌పాల్

తీర్పు అనంతరం మీడియాతో మాట్లాడిన తరుణ్ తేజ్‌పాల్, తాను ఎలాంటి నేరం చేయలేదని, ఈ తీర్పుతో ఏకీభవించడం లేదని చెప్పారు. న్యాయం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని వెల్లడించారు. తనపై రాజకీయ కక్షసాధింపు జరిగిందని ఆరోపించిన ఆయన, తెహల్కా నిర్వహించిన దర్యాప్తు కథనాల కారణంగా కొందరి రాజకీయ ప్రయోజనాలు దెబ్బతిన్నాయని, అందుకే తనను లక్ష్యంగా చేసుకున్నారని పేర్కొన్నారు. ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్, సురేంద్ర గాడ్లింగ్‌ల మాదిరిగానే తానూ రాజకీయ వేధింపులకు గురయ్యానని వ్యాఖ్యానించారు.

### 13 ఏళ్ల తర్వాత తుది తీర్పు

2013 నవంబర్‌లో నమోదైన ఈ కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా తేజ్‌పాల్‌ను అదే ఏడాది అరెస్టు చేశారు. దాదాపు 13 ఏళ్ల న్యాయపోరాటం అనంతరం బాంబే హైకోర్టు ఆయనను దోషిగా నిర్ధారించి పదేళ్ల జైలు శిక్ష విధించింది.

## మహిళల హక్కులకు భంగం కలిగితే ఉపేక్షించం

- రాష్ట్ర మహిళా కమీషన్ చైర్పర్సన్ విజయలక్ష్మీ



**పాలకుర్తి, ఆగస్టు 06(జనంసాక్షి) :** మహిళల హక్కులకు భంగం కలిగితే ఉపేక్షించబోమని. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ గద్వాల విజయలక్ష్మీ స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ, అధికారులు, పూజారులు మహిళా కమీషన్ చైర్పర్సన్ విజయలక్ష్మికి, సభ్యులకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడారు. మహిళల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు కమీషన్ చిత్తశుద్ధితో పని చేస్తోందని అన్నారు. కమీషన్ కార్యకలాపాలు హైదరాబాద్ కే పరిమితం కాకుండా ప్రతి జిల్లాలకు విస్తరిస్తామని తెలిపారు. ప్రతి జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో కమీషన్ చేపట్టే కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. సోషల్ మీడియా వేదికను చేసుకొని మహిళలు ధైర్యంగా సమస్యలు కమీషన్‌కు విన్నవించడం ఆహ్వానించదగిందన్నారు. గృహహింస, వేధింపులు, మహిళల అక్రమ రవాణా, వరకట్న వేధింపులు, సైబర్ నేరాలు, కిడ్నాప్, బాల్య వివాహాలు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆ కమీషన్ సభ్యులు చిట్యాల శ్వేత, నూనావత్ రాధా, కాసోజు శంకరమ్మ, శశికళ, కమీషన్ కార్యదర్శి పద్మజా, ఆర్డీవో కిరణ్ ప్రకాష్, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, తహసీల్దార్ సరస్వతీ, ఈవో లక్ష్మీప్రసన్న, ఆలయ పూజారులు డీ.వీ.ఆర్ శర్మ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య కొత్తపల్లి జయశంకర్ విగ్రహానికి ఘన నివాళులు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు, తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఎల్‌బీ నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య జయశంకర్ చూపిన దార్శనికత, చేసిన ఉద్యమం, అందించిన స్ఫూర్తి తెలంగాణ ప్రజలకు ఎల్లప్పుడూ మార్గదర్శకమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఆయన చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం ఆయన సేవలను ఎన్నటికీ మరువదని, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు సల్వ చారి తదితరులు పాల్గొన్నారు.

## గోపాలపురం పాఠశాలకు రూ.25లక్షలు మంజూరు

- ముఖ్యమంత్రి ఆదేశాలతో పాఠశాలను సందర్శించిన కలెక్టర్
- ఉపాధ్యాయినితో మాట్లాడిన సీఎం ప్రిన్సిపల్సెక్రటరీశ్రీధర్

**హైదరాబాద్, ఆగస్ట్6 (జనంసాక్షి) :** గోపాలపురం ప్రాథమిక పాఠశాలలోగదుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25లక్షలు మంజూరు చేసింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంగోపాలపురం ప్రభుత్వ ప్రాథమికపాఠశాలలోగదులు శిథిల మైన తీరుపై పత్రికలో ప్రచురితమైన కథనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. వెంటనే పాఠశాలను సందర్శించి, వసతులకల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ దివాకరంను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్సెక్రటరీ ఎన్.శ్రీధర్ ఉపాధ్యాయిని ఇందిరతో మాట్లాడారు. పాఠశాలలోపరిస్థితులను గురించి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతోకలెక్టర్ దివాకర గురువారం పాఠశాలను సందర్శించారు. పాఠశాల అభివృద్ధిపై చొరవ చూపిన ఉపాధ్యాయిని నిమ్మతోట ఇందిరను అభినందించారు. పాఠశాలలో గదుల నిర్మాణానికి రూ.25లక్షలు విడుదల చేస్తున్నట్లు ఆమెకు తెలియజేశారు. ఆ వెంటనే నిధులు మంజూరు చేశారు.

## గ్రీన్‌ఫీల్డ్ హైవేపై కారు ప్రమాదం

- ప్రమాదంలో తల్లీ కొడుకు దుర్మరణం



**ఖమ్మం, ఆగస్ట్6 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఒక కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ ఫీల్డ్ హైవేపై దంసలాపురం సమీపంలోని మున్నేరు వంతెన వద్ద గురువారం ఉదయం చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో తల్లి, కొడుకు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడగా, అతడి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతులు చింతకాని మండలం గాంధీనగర్ గ్రామానికి పాపబత్తిని సుజాత (38), పాపబత్తిని పవన్ కుమార్ (17) వారుగా గుర్తించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన పాపబత్తిని నరసింహారావు అనే వ్యక్తి తన భార్య, కొడుకుతో కలిసి హైదరాబాద్‌కు కారులో బయల్దేరారు. మున్నేరు వంతెన పై నుండి ప్రయాణం చేస్తున్న సమయంలో హైదరాబాద్ వైపు నుండి వస్తున్న డీసీఎంను అదుపుతప్పి బలంగా ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో సుజాత, పవన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన నరసింహారావును ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఖమ్మం రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి విచారణ చేపట్టారు.

## స్నేహితుణ్ని స్మరించి.. ఆదర్శంగా నిలిచి..

- 55 యూనిట్ల రక్తదానం



**మావల ఆగస్ట్ 07(జనం సాక్షి):** రక్తసంబంధీకులనే నిర్లక్ష్యం చేస్తున్న ప్రస్తుత రోజుల్లో, తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిన తమ స్నేహితుడిని స్మరించుకుంటూ రక్తదానం చేసి అతని మిత్రులు ఆదర్శంగా నిలిచారు. ఆదిలాబాద్ పట్టణంలోని రవీంద్రనగర్ కాలనీకి చెందిన గజేందర్ నాయుడు 33వ జయంతి సందర్భంగా గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించి 55 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ రక్త నిల్వలు రిమ్స్ ఆసుపత్రికి వచ్చే అత్యవసర రోగులకు ఎంతో ఉపయోగపడనున్నాయి. ప్రతి ఏడాది మిత్రుని స్మారకార్థం సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమ స్నేహితుడికి నిజమైన నివాళి అని ఆయన మిత్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన సోదరుడు గజేందర్ నాయుడు, మిత్రులు నాని, హెచ్కే రాజు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల ప్రాణాలు కాపాడండి

- హామీలు అమలు చేయండి, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించండి
- తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో పత్రికా గోష్టిలో వక్తలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నిరుద్యోగుల ప్రాణాలు కాపాడాలని వక్తలు కోరారు. హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్, సోమాజిగూడలో తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రికా గోష్టిలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి తెలంగాణ సమాఖ్య సలహాదారు సయ్యద్ రఫీ అధ్యక్షత వహించారు. కన్వీనర్ కరుణాకర్ దేశాయ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, తెలంగాణలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని, కానీ ప్రభుత్వం హామీల అమలులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల పోరాటాలు విడివిడిగా కాకుండా ఐక్యంగా సాగితేనే ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగి ఫలితాలు సాధించగలమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగ నియామకాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. నిరుద్యోగ యువతకు విజ్ఞప్తి చేస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ నిరాశకు లోనై ఆత్మహత్యలు వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని, 'బతికి ఉండి హక్కుల కోసం పోరాడుదాం' అని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు నిర్వహించడం ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొంటూ, నిరసనలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని కోరారు. ఉద్యమాలను అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, ఒకవేళ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్బంధాల వల్ల నిస్సహాయ స్థితిలో ఎవరైనా ప్రాణత్యాగాలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడితే అందుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. 'మాట తప్పిన వారిని నిలదీద్దాం! బతికి ఉండి కొట్లాడుదాం! ఆశ పెట్టిన కొలువులు ఎట్లియ్యడో చూద్దాం!!' అని నినదించారు.

ఈ పత్రికా గోష్టిలో పాల్గొన్న నిరుద్యోగ పోరాట ప్రతినిధులు ప్రభుత్వానికి తమ డిమాండ్లను ఏకగ్రీవంగా వినిపిస్తూ, నిరుద్యోగ యువత ప్రయోజనాల కోసం ఐక్య ఉద్యమాన్ని కొనసాగించాలని తీర్మానించారు. నిరుద్యోగ పోరాట ప్రతినిధులు ఇంద్ర నాయక్, తేజ రెడ్డి, జనార్ధన్, బుక్యా కుమార్, కరుణాకర్ రెడ్డి, సయ్యద్ రఫీ, అస్మా, సుమేష్ జాదవ్, అజయ్ పాల్గొన్నారు.

## జయశంకర్ సార్‌కు ఎంపీలు వద్దిరాజు, దీవకొండ ఘన నివాళులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 93వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యులు దీవకొండ దామోదర్ రావులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆచార్య జయశంకర్ బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు తోడుగా నిలిచి పోరాడారని వారు కొనియాడారు. పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్న సందర్భంగా ఢిల్లీలో ఉన్న ఎంపీలు రవిచంద్ర, దామోదర్ రావులు జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ అస్థిత్వం, ప్రజల స్వాభిమానం, సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం జయశంకర్ తన జీవితాంతం కృషి సల్పారని శ్లాఘించారు. తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున కొనసాగుతున్న సమయంలో... 2011లో ఆయన మహనీయుడు మనల్ని వీడివెళ్లడం బాధాకరమన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు అమూల్యం అని ఎంపీలు వద్దిరాజు,దీవకొండలు వివరించారు.

## గవర్నర్‌ను కలిసిన ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్



**హైదరాబాద్, ఆగస్టు 6 (జనంసాక్షి) :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ నీలేశ్ ద్వివేది గురువారం లోక్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్‌బీఐ చేపడుతున్న బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక సమావేశం, సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై గవర్నర్‌కు వివరించారు. ప్రజల ఆర్థిక సాధికారతకు, సమగ్రాభివృద్ధికి బ్యాంకింగ్ రంగం మరింత సమర్థవంతంగా సేవలందించాలని గవర్నర్ ఆకాంక్షించారు.

## భద్రాచలం-వాజేడు రహదారికి మోక్షం కల్పించండి

- వారం రోజుల్లో పనులు ప్రారంభం కాకపోతే కాంట్రాక్టర్‌ను మార్చాలి.
- ఏపీ ఆర్అండ్‌బీ మంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- 100 కిమీ ప్రయాణానికే మూడు గంటలు
- ప్రజల ఆవేదనకు స్పందించిన మంత్రి తుమ్మల



**ములుగు ప్రతినిధి, ఆగస్టు 06(జనంసాక్షి) :** భద్రాచలం నుంచి వాజేడు వరకు అధ్వాన్నంగా మారిన రహదారికి తక్షణమే మోక్షం కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ని కోరారు. బుధవారం ఈ మార్గంలో ప్రయాణించిన సందర్భంగా రహదారి దుస్థితిని చూసిన స్థానికులు మంత్రిని అడ్డుకుని తమ సమస్యలను వివరించారు. గతంలో మీరు ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్నప్పుడు ఈ రహదారి నిర్మాణం జరిగిందని, అనంతరం ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 100 కిలోమీటర్ల ప్రయాణానికే మూడు గంటల సమయం పడుతోందని, ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు తెలిపారు.

ప్రజల సమస్యలను విన్న వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి, సంబంధిత అధికారులకు, తెలంగాణ ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. రహదారి మరమ్మతులు, అభివృద్ధి పనులను అత్యవసరంగా ప్రారంభించి ప్రజల కష్టాలకు ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తుమ్మల స్థానికులకు హామీ ఇవ్వడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రహదారి అభివృద్ధి పనులకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించినప్పటికీ కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం ఆందోళనకరమని మంత్రి జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారం రోజుల్లోగా పనులు ప్రారంభం కాకపోతే ప్రస్తుత కాంట్రాక్టర్‌ను తొలగించి, కొత్త టెండర్లు పిలిచి పనులను వేగవంతం చేయాలని కోరారు. దీనిపై మంత్రి జనార్దన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

భద్రాచలం-వాజేడు రహదారి అభివృద్ధి పనులు మొత్తం మూడు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. భద్రాచలం నుంచి ఏటపాక వరకు ఆంధ్రప్రదేశ్ పరిధిలోని 7.8 కిలోమీటర్ల రహదారిని రూ 3.70 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఏటపాక నుంచి చర్ల మండలంలోని సుబ్బంపేట వరకు 56.8 కిలోమీటర్ల మేర భద్రాద్రి డివిజన్ పరిధిలో రూ 67.58 కోట్లతో పనులు చేపట్టనున్నారు. సుబ్బంపేట నుంచి వాజేడు వరకు ములుగు డివిజన్ పరిధిలోని 48 కిలోమీటర్ల రహదారిని రూ 44 కోట్లతో నిర్మించనున్నారు. మొత్తం 112.6 కిలోమీటర్ల పొడవున సుమారు రూ 115.28 కోట్ల వ్యయంతో ఈ రహదారి అభివృద్ధి కానుంది.

ఈ పనులను ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, తెలంగాణ చీఫ్ ఇంజినీర్ బీవీ రావు పర్యవేక్షించనుండగా, భద్రాచలం, ములుగు ఈఈలు క్షేత్రస్థాయిలో అమలును పర్యవేక్షించనున్నారు. ముఖ్యంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులు రహదారి దుస్థితి కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి తుమ్మల అధికారులను కోరారు.


## 'సెస్'లో జయశంకర్ ఘనంగా జయంతి ఉత్సవాలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సోమాజీగూడ లోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) లో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, ఆర్థిక నిపుణులు జి ఆర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ రేవతి ప్రొఫెసర్ ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ చేసిన కృషిని కొనియాడారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయం పై మూడు తరాలుగా కొనసాగించిన ఘనత జయశంకర్ కు దక్కుతుందని అన్నారు. జయశంకర్ తెలంగాణ ఉద్యమ వ్యాప్తికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వరకు చేసిన పోరాటం గురించి చిన్నారెడ్డి సోదాహరంగా వివరించారు.

## అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూడండి

రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** దేశంలోని అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూస్తూ వాటి సర్వతో ముఖాభివృద్ధికి చేయూతనివ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. రాజ్యసభలో గురువారం మధ్యాహ్నం ద్రవ్య వినిమయ (2026-27) బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ముందుకు సాగడానికి, ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకు ఈ బిల్లు ముఖ్యమైనదని, ఇది రాజ్యాంగపరమైన ప్రక్రియలో భాగమన్నారు. దేశ సమగ్రాభివృద్ధికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రజా సంక్షేమ పథకాల అమలుకు తమ పార్టీ బీఆర్ఎస్ మద్దతునిస్తుందని ఎంపీ రవిచంద్ర చెప్పారు. తమ పార్టీ చాలా రోజులుగా డిమాండ్ చేస్తున్న కొత్తగూడెంను రైల్వే డివిజన్ గా ప్రకటించి, ఆ మార్గాన్ని పొడగిస్తూ దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన శ్రీసీతారామ చంద్రస్వామి కొలువైన భద్రాచలంలో స్టేషన్ ఏర్పాటు చేయాల్సిందిగా ఎంపీ రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు తెల్పుతున్నదని, దీనిని ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను ఎంపీ వద్దిరాజు అభినందించారు.

## ఎంపీ వద్దిరాజు దాతృత్వం

- ఆపదలో ఉన్న నిరుద్యోగి వేణుకు లక్ష రూపాయలు అందజేత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తన దాతృత్వాన్ని మరోసారి చాటిచెప్పారు. ఉద్యోగాల భర్తీకి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేయకపోవడంతో మానసిక ఆందోళనకు గురైన గడ్డం వేణుకుమార్ గౌడ్ ఈనెల ఒకటవ తేదీన ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం వాస్తవ్యులు గడ్డం భద్రయ్య కుమారుడైన వేణుకుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ పూర్తి చేసి ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సంసిద్ధమవుతున్నారు. అయితే, నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసి, అవి విడుదల కాకపోవడంతో తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనై ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రి పాలయ్యారు. వేణు చిన్నగా కోలుకుని బుధవారం సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో తీరిక లేకుండా ఉన్న రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రకు వేణు ఉదంతం గురించి తెలిసి తీవ్ర విచారం ప్రకటించారు. వేణుకు తన వంతు సాయంగా ఎంపీ రవిచంద్ర జేడ్పీ మాజీ ఛైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇంఛార్జి లింగాల కమల్ రాజ్ ద్వారా లక్ష రూపాయలు పంపించి దయార్ద్ర హృదయాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర పంపిన లక్ష రూపాయల నగదును వేణు, ఆయన తండ్రి భద్రయ్య లకు కమల్ రాజ్ గురువారం అందజేసి ప్రభుత్వం అవలం భిస్తున్న విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, సర్పంచ్ సలీమా ఖాసీం, ఉప సర్పంచ్ రమాదేవి, మాజీ ఎంపీటీసీ నానబాల కిరణ్, మాధవి, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేటర్ గుణచరిత్, వేణు సోదరుడు వెంకటేష్, పాల్వంచ రాజేష్, నానబాల హరీష్, వీరాస్వామి, సెల్వరాజ్, కోటయ్య, సతీష్, ఉపేంద్రాచారి, నజీర్, నానబాల హరినాథ్ బాబు, షేక్ నబీ, షేక్ సలాం తదితరులు పాల్గొని ఎంపీ వద్దిరాజు దయాగుణాన్ని కొనియాడారు. ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
07 ఆగస్ట్ 2026

## నిజాయితీ చాలదు.. నవీనత్వాన్ని ఆలింగనం చేసుకున్నప్పుడే యువతకు నమ్మకం

సంపాదకీయం

జెన్జీ ఆందోళనల్లో నిజాయితీ ఉందని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్య దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. యువతలోని చైతన్యాన్ని, ప్రశ్నించే తత్వాన్ని, సామాజిక సమస్యలపై స్పందించే ధోరణిని గుర్తించడం ఒక సానుకూల సంకేతమే. కానీ అక్కడే ఆగిపోతే అది అసంపూర్ణమైన అంగీకారంగా మిగిలిపోతుంది. ఎందుకంటే జెన్జీని ప్రత్యేకంగా నిలబెట్టేది వారి నిజాయితీ మాత్రమే కాదు; వారు విశ్వసిస్తున్న ఆధునిక ప్రజాస్వామ్య విలువలు. వాటిని అంగీకరించకుండా యువతను అభినందించడం అంటే పుస్తక ముఖచిత్రాన్ని మెచ్చుకుని, లోపల ఉన్న భావాన్ని తిరస్కరించినట్లే అవుతుంది. ఈ తరం పుట్టుకతో వచ్చిన సంప్రదాయాలను గుడ్డిగా అనుసరించే తరం కాదు. "ఎందుకు?" అని అడిగే తరం. ఆధారాలు కోరే తరం. అధికారంలో ఎవరు ఉన్నారన్నది కాదు, వారు ఎలా పాలిస్తున్నారన్నదే ముఖ్యమని భావించే తరం. ప్రభుత్వమైనా, రాజకీయ పార్టీయైనా, మత సంస్థయైనా, కార్పొరేట్ సంస్థయైనా ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందేనని నమ్మే తరం. ఇదే ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు. సామాజిక మాధ్యమాల విస్తరణతో ప్రపంచం ఇప్పుడు వారి అరచేతిలో ఉంది. ఒక దేశంలో జరిగిన అన్యాయం, మరో దేశంలో సాధించిన విజయం, శాస్త్రీయ ఆవిష్కరణ, మానవ హక్కుల ఉద్యమం అన్నీ వారికి క్షణాల్లో చేరుతున్నాయి. అందుకే వారి ఆలోచనలు భౌగోళిక సరిహద్దుల్లో బంధించబడవు.

చరిత్రలో ప్రతి యుగాన్ని మార్చింది యువతే. భారత స్వాతంత్ర్య ఉద్యమంలోనూ యువత ముందుంది. అత్యవసర పరిస్థితికి వ్యతిరేక పోరాటంలోనూ యువతే వీధుల్లోకి వచ్చింది. అవినీతి వ్యతిరేక ఉద్యమాల్లోనూ, పర్యావరణ ఉద్యమాల్లోనూ, మహిళల భద్రత కోసం జరిగిన నిరసనల్లోనూ యువత కీలక పాత్ర పోషించింది. ప్రపంచ చరిత్రలోనూ ఇదే నిజం. అమెరికాలో పౌరహక్కుల ఉద్యమం, దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష వ్యతిరేక పోరాటం, యూరప్‌లో ప్రజాస్వామ్య ఉద్యమాలు అన్నింటిలోనూ యువత మార్పుకు చోదకశక్తిగా నిలిచింది. మార్టిన్ లూథర్ ప్రారంభించిన సంస్కరణోద్యమం ఒక కీలకమైన విషయాన్ని ప్రపంచానికి నేర్పింది. రాజ్యం ఏ ఒక్క మతానికీ ప్రతినిధిగా ఉండకూడదు. ఈ భావనే తరువాత సెక్యులర్ ప్రజాస్వామ్యానికి పునాదిగా మారింది. భారత రాజ్యాంగం కూడా అదే స్ఫూర్తిని స్వీకరించింది. నేటి జెన్జీ కూడా ఈ రాజ్యాంగ స్ఫూర్తినే తమ రాజకీయ, సామాజిక ఆలోచనలకు ఆధారంగా తీసుకుంటోంది. మహాత్మ గాంధీ అహింసను ప్రపంచానికి అందించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమానత్వాన్ని రాజ్యాంగ హామీగా మలిచారు. జవహర్‌లాల్ నెహ్రూ శాస్త్రీయ దృక్పథం, విద్య, పరిశ్రమలు, పరిశోధనలతో ఆధునిక భారతానికి పునాది వేశారు. ఈ ముగ్గురి ఆలోచనల్లో భిన్నతలు ఉన్నప్పటికీ, భారతదేశాన్ని మరింత ప్రజాస్వామ్య, సమానత్వ, ఆధునిక దిశగా తీసుకెళ్లాలనే లక్ష్యం మాత్రం ఒకటే. నేటి యువత కూడా అదే దిశలో ప్రశ్నిస్తోంది.

జెన్జీ భిన్నంగా ఆలోచిస్తే అంటే నిరాదరణ కాదు; రాజ్యాంగాన్ని గౌరవించడం. మతం అంటే ఇతరులను తక్కువ చేసి చూడడం కాదు; ప్రతి ఒక్కరి విశ్వాస స్వేచ్ఛను గౌరవించడం. అభివృద్ధి అంటే కేవలం భారీ ప్రాజెక్టులు కాదు; విద్య, ఆరోగ్యం, ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం కలిసిన సమగ్ర పురోగతి. ఈ నిర్వచనాలు పాత రాజకీయాలకు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. యువతను కేవలం ఓటర్లుగా చూసే రాజకీయాలు ఎక్కువ కాలం నిలవవు. వారిని భాగస్వాములుగా చూడాల్సిందే. ఎందుకంటే వారు సమాచారం ఉన్న తరం. ప్రశ్నించే తరం. తప్పు జరిగితే మౌనంగా ఉండని తరం. వారిని అణచివేయడానికి నిరాదరణ సరిపోదు; విలువల పట్ల నిబద్ధత అవసరం. మాటలు కాదు, ఆచరణ కావాలి. జెన్జీ నిజాయితీని మెచ్చుకోవడం ఒక ఆరంభం. కానీ వారి ఆలోచనలను తిరస్కరించి, అదే సమయంలో వారి మద్దతు ఆశించడం సాధ్యం కాదు. సెక్యులరిజం, సమానత్వం, రాజ్యాంగబద్ధత, శాస్త్రీయ దృక్పథం, భావ ప్రకటనా స్వేచ్ఛ, వైవిధ్యానికి గౌరవం ఇవి ఈ తరం కోసం అదనపు విలువలు కావు; ఇవే వారి రాజకీయ, సామాజిక గుర్తింపు. భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అందరూ చెబుతారు. అయితే ఆ భవిష్యత్తును నిర్మించే యువత నమ్ముతున్న విలువలను అంగీకరించే ధైర్యం కూడా దేశంలోని ప్రతి రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సంస్థకు ఉండాలి. యువతను ప్రశంసించడం సులభం; యువత చూపుతున్న దిశలో ఆత్మపరిశీలన చేసుకోవడం కష్టం. కానీ చరిత్రలో నిలిచేది అదే.


కాలం మారింది. సమాజం మారింది. ప్రపంచం మారింది. ఇప్పుడు సంస్థలు మారాల్సిన సమయం వచ్చింది. నిజాయితీని గుర్తించడం గొప్పదే. కానీ నిజాయితీని నడిపిస్తున్న ఆధునిక విలువలను కూడా గౌరవించినప్పుడే ఆ గుర్తింపుకు విశ్వసనీయత వస్తుంది. సనాతనాన్ని గౌరవించడం ఒక ఎంపిక కావచ్చు. కానీ ఆధునాతనాన్ని అంగీకరించడం భవిష్యత్తు అవసరం. ఆ అవసరాన్ని అర్థం చేసుకున్నవారే రేపటి భారతాన్ని నడిపిస్తారు.

# నగరాల్లో సౌండ్ పొల్యూషన్ డ్యామేజ్

## నిశ్శబ్దంగా వినికిడి శక్తి కోల్పోతున్న ఐటీ, ట్రాఫిక్ ఉద్యోగులు

జనంసాక్షి

నగరాల్లో శబ్ద కాలుష్యం తీవ్ర రూపం దాలుస్తోంది. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ, హారన్ల మోతలు, నిర్మాణ పనుల హోరు, నగర వాసుల ఆరోగ్యానికి పెను సవాలుగా మారాయి. కంటికి కనిపించని ఈ కాలుష్యం, క్రమంగా వినికిడి శక్తిని దెబ్బతీస్తూ మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, మన దేశంలో సుమారు ఆరు శాతం మంది ఏదో ఒక రకమైన వినికిడి లోపంతో బాధపడుతున్నారు. నిరంతరం 60 డెసిబెల్స్ మించిన శబ్దానికి గురికావడం వల్ల శాశ్వతంగా వినికిడి కోల్పోయే ప్రమాదం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. మన హైదరాబాద్ నగరంలో నిర్వహించిన ఒక పరిశీలనలో, విధుల్లో ఉండే ట్రాఫిక్ పోలీసుల్లో ఏకంగా 76 శాతం మందికి వినికిడి శక్తి తగ్గినట్లు తేలడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో గడిచిన ఏడాది శబ్ద కాలుష్యంపై యాభై తొమ్మిది వేలకు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి.ముఖ్యంగా రోజుకు తొమ్మిది నుంచి పన్నెండు గంటల పాటు రోడ్లు కూడళ్లలో విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది నిత్యం నరకం అనుభవిస్తున్నారు. వీరు సగటున 87.5 డెసిబెల్స్ శబ్ద వాతావరణంలో పనిచేస్తున్నారు. ఇది సురక్షిత పరిమితి కంటే చాలా ఎక్కువ. దీర్ఘకాలంగా ఈ శబ్దంలో ఉండటం వల్ల చెవుల్లో నిరంతరం రింగింగ్ శబ్దం రావడం, నిద్రలేమి, తీవ్రమైన చిరాకు, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. అయితే ఈ లోపం చాలా నెమ్మదిగా పెరుగుతుండటంతో, బాధితులు దీనిని త్వరగా గుర్తించలేకపోతున్నారు.



కేవలం రోడ్లపై పనిచేసే వారే కాకుండా, ఆఫీసులకే పరిమితమయ్యే ఐటీ ఉద్యోగులు కూడా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. నిరంతరం ఇయర్ ఫోన్లు, హెడ్ ఫోన్లు ధరించి కాల్స్ మాట్లాడటం, ఓపెన్ ఆఫీస్ వాతావరణంలో విధుల్లో ఉండటం వారి నాడీ వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. నిరంతర శబ్దం వల్ల శరీరంలో కార్టిసాల్ హార్మోన్ స్థాయిలు పెరిగి, రక్తపోటు పెరగడంతో పాటు గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రోడ్డు రద్దీ శబ్దం ప్రతి పది డెసిబెల్స్ పెరిగే కొద్దీ గుండె జబ్బుల ముప్పు పెరుగుతోందని అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.ప్రారంభంలోనే ఈ సమస్యను గుర్తించడం చాలా ముఖ్యం. ఎదుటివారు మాట్లాడే మాటలు సరిగా వినిపించకపోవడం, తక్కువ స్వరంతో చెప్పే విషయాలు అర్థం కాకపోవడం తొలి సంకేతాలు. చెవుల్లో హోరు, క్రమంగా తలనొప్పి రావడం, నిద్ర పట్టకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ఈ ముప్పు నుంచి తప్పించుకోవడానికి ప్రభుత్వం, ప్రజలు కలిసికట్టుగా ముందడుగు వేయాలి. అనవసరంగా హారన్లు మోగించకుండా చూడటం, ప్రెషర్ హారన్లను పూర్తిగా అరికట్టడం, ఆసుపత్రులు, పాఠశాలల వద్ద ప్రశాంత వాతావరణం ఉండేలా నిబంధనలు అమలు చేయడం అత్యవసరం. రోడ్ల పక్కన చెట్లను పెంచడం ద్వారా శబ్ద తీవ్రతను కొంతవరకు తగ్గించవచ్చు. ట్రాఫిక్ పోలీసులకు ప్రత్యేక చెవి రక్షణ పరికరాలు అందించాలి. ఐటీ ఉద్యోగులు హెడ్ ఫోన్ వాడకంలో తగిన విరామం ఇవ్వడం అలవాటు చేసుకోవాలి. మనం ఇప్పటికైనా మేల్కొనకపోతే, భావి తరాలు నిశ్శబ్దంగా వినికిడి శక్తిని కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.

డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169

## గద్దర్ ఇంకా అస్తమించలేదు

ఒక మనిషి చనిపోవచ్చు. ఒక నాయకుడు చరిత్రలో కలిసిపోవచ్చు. ఒక కళాకారుడు కాలగర్భంలో మరుగునపడిపోవచ్చు. కానీ కొందరు వ్యక్తులు మాత్రం కాలాన్ని దాటి ప్రజల జ్ఞాపకాలలో, వారి గొంతుల్లో, వారి పోరాటాల్లో సజీవంగా నిలిచిపోతారు. గద్దర్ అలాంటి అరుదైన వ్యక్తి. ఆయన మరణించి మూడేళ్లు కావొస్తున్నా, గద్దర్ గురించి మాట్లాడేటప్పుడు ఇప్పటికీ "ఉండేవాడు" అనే భాష కంటే "ఉన్నాడు" అనే భాషే సహజంగా నోటి మీదకు వస్తుంది. ఎందుకంటే గద్దర్ అనేది ఒక వ్యక్తి కాదు; ఒక ప్రజా చైతన్యం. ఒక గానం. ఒక ప్రతిఘటన. ఒక సాంస్కృతిక శక్తి. గద్దర్ మరణించిన రోజు నాకు ఇప్పటికీ స్పష్టంగా గుర్తుంది. ఆ వార్త వినగానే చుట్టూ ఒక విచిత్రమైన నిశ్శబ్దం అలుముకుంది. ఆ నిశ్శబ్దం నాదొక్కటే కాదు; లక్షలాది మంది మనసుల్లో అదే మౌనం దిగివచ్చింది. ఆ రోజు మా మండల కేంద్రంలో జరిగిన ఒక చిన్న సంఘటన ఇప్పటికీ నా మనసులో చెరగని ముద్రగా నిలిచింది. గద్దరకు నివాళి అర్పించే దుకు ఒక యువకుడు ఒక్కడే ఫోటోతో చౌరస్తాలో నిలబడ్డాడు. కాసేపటికే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, కమ్యూనిస్టు పార్టీలు, దళిత సంఘాల కార్యకర్తలు, సాధారణ ప్రజలు రాజకీయాలకు అతీతంగా అక్కడికి చేరుకుని గద్దరకు నివాళులర్పించారు.

**గద్దరను రాజకీయ పార్టీలతో కొలవలేం :** ఆయనను సిద్ధాంతాల గోడల మధ్య బంధించలేం. ఆయనను ప్రజలు తమ మనిషిగా స్వీకరించారు. నా బాల్య జ్ఞాపకాలలో కూడా గద్దర్ ఉన్నాడు. మా ఇంట్లో తెల్లవారుజామున టేప్ రికార్డర్‌లో వినిపించేది ఆయన గొంతే. "సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో...", "నిండూ అమాసనాడు...", "తల్లి లాగిను నాకుతుంటే..." వంటి పాటలే నా బాల్యానికి జోలపాటలు. ఆ పాటల అర్థం అప్పుడు తెలియదు. కానీ ఆ గొంతు మాత్రం హృదయంలో శాశ్వతంగా నిలిచిపోయింది. అదే గద్దర్ అసలు శక్తి. పాటను కేవలం వినోదంగా కాకుండా, ప్రజల జీవిత భాషగా మార్చిన కళాకారుడు ఆయన. తెలంగాణ గ్రామాల్లో రైతుకూలీల గుడిసెల నుంచి విశ్వవిద్యాలయాల వరకు ఒకే గొంతు మార్మోగిందంటే అది గద్దరదే. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రను రాస్తే గద్దర్‌ను దాటేసి ఒక్క అధ్యాయమూ పూర్తికాదు. ఉద్యమాలకు రాజకీయ నాయకత్వం ఎంత అవసరమో, సాంస్కృతిక నాయకత్వం కూడా అంతే అవసరమని చరిత్ర చెబుతుంది. ఆ సాంస్కృతిక నాయకత్వానికి గద్దర్ చిరునామా. ఆయన జీవితంలో రాజకీయ మలుపులు వచ్చాయి. విప్లవ రాజకీయాల నుంచి పార్లమెంటరీ రాజకీయాల వైపు నడిచారు. ఆ మార్పును కొందరు విమర్శించారు. మరికొందరు సమర్థించారు. కానీ చరిత్ర ఒక మనిషిని అతని చివరి రాజకీయ నిర్ణయంతో తీర్పు చెప్పదు. అతను సమాజంపై వేసిన చెరగని ముద్రతో తీర్పు చెబుతుంది. ఆ కొలమానంలో చూస్తే గద్దర్ ఒక మహోన్నత ప్రజా కళాకారుడు. ఒక తరం చేతిలో డప్పు పెట్టాడు. మరో తరం గొంతులో పాట పెట్టాడు. ఇంకో తరం గుండెల్లో ఆత్మగౌరవాన్ని నాటాడు. అదే ఆయన అసలైన వారసత్వం. ఈరోజు పాటలు కోట్ల వ్యూస్ కోసం పుడుతున్న కాలం. రెండు రోజుల ట్రెండ్ కోసం తయారవుతున్న కాలం. అలాంటి సమయంలో ఐదు దశాబ్దాల తర్వాత కూడా ఒక పాట ప్రజల గొంతులో బతికుంటే, అది కళాకారుడి విజయానికి కాదు, అతని చారిత్రక అవసరానికి నిదర్శనం. గద్దర్ అదే సాధించాడు. ఆయన పాటలో బాధ ఉంది. ఆయన గానంలో ఆవేదన ఉంది. ఆయన పద్యంలో తిరుగుబాటు ఉంది. ఆయన స్వరంలో తల్లి ఉంది. ఆయన ఊపిరిలో మట్టి ఉంది. ఆయన ఆలోచనల్లో అణగారిన మనిషి ఆత్మగౌరవం ఉంది. అందుకే గద్దరను కేవలం విప్లవ గాయకుడిగా చెప్పడం ఆయనను చిన్నచూపు చూడడమే అవుతుంది. ఆయన ఒక ప్రజా సాంస్కృతిక విశ్వవిద్యాలయం. ఈరోజు ప్రజా సాంస్కృతిక ఉద్యమం కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. మార్కెట్ సంస్కృతి, సోషల్ మీడియా వేగం, రాజకీయ ధ్రువీకరణల మధ్య ప్రజా కళ తన అసలు లక్ష్యాన్ని కోల్పోయే ప్రమాదం కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో గద్దరను కేవలం జయంతి, వర్ధంతి సభలకు పరిమితం చేయడం ఆయనకు చేసే అతిపెద్ద అన్యాయం. ఆయన పాటలను అధ్యయనం చేయాలి. ఆయన భాషను పరిశోధించాలి. ఆయన ప్రజలతో ఏర్పరచుకున్న బంధాన్ని కొత్త తరం అర్థం చేసుకోవాలి. ఎందుకంటే గద్దర్ అసలు వారసత్వం విగ్రహాల్లో లేదు. పాటల్లో ఉంది. ప్రజల్లో ఉంది. ప్రతిఘటనలో ఉంది. సామాజిక న్యాయం కోసం వినిపించే ప్రతి గొంతులో ఉంది. ప్రహ్లాదుడి కథ ఉన్నంతకాలం విశ్వాసం బతికినట్లే... స్పార్టకస్ కథ ఉన్నంతకాలం తిరుగుబాటు బతికినట్లే...

రాజేందర్ దామెర (దారా)
rajenderdamera@gmail.com

# అసలు సాంబశివుడు ఎవరు?

నల్ల మల్లెకు ఎర్రమల్లెగా వన్నె తెచ్చి .చెంపల జీవితాల్లో వెలుగులు నింపి పాలమూరు వలస కూలీలపై . అవిశ్రాంతంగా పోరాడిన పోరాటయోధుడు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నల్లమల్లలో అణువణువు పట్టు ను సాధించి విప్లవ పోద్యమాన్ని కష్టకాలంలో తీవ్ర నిర్బంధ కాలంలో ముందుకు నడిపించి శత్రువుకు వణుకు పుట్టించిన ఒక పోరాట యోధున్ని విప్లవ యోధున్ని చరిత్రను అసలు ముందుకు మీ ముందుకు తీసుకువస్తున్నాం.

సాంబశివుడు అసలు ఎవరు దీనిమీద చర్చ జరగవలసిన అవసరం ఉంది ఎందుకంటే 2002 కృష్ణానది పుట్టిలో మునిగి అమరుడైనాడు. దీంతో కోనపురి ఐలయ్య సాంబశివుడిగా పేరు పెట్టుకుని చలామణి అయ్యాడు. అసలు సాంబశివుడు ఎవరు. చుక్కాయిపల్లి. గ్రామానికి చెందిన సాంబశివుడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కు చెందిన వ్యక్తి ప్రస్తుతం వనపర్తి జిల్లాలోని చుక్కాయి పల్లి గ్రామం ఉంది. సాంబశివుడు బాల్య దశ నుండే విప్లవ పోద్యమం వైపు ఆకర్షితులై ఆర్ ఎస్ యు నుండి విప్లవ పార్టీ రాష్ట్ర నాయకత్వం వరకు అంచ లంచలుగా ఎదిగారు. సాంబశివుడు అలియాస్ మహేష్, రామన్న అలియాస్ చంద్రన్న, ప్రభాకర్. ఆయా పేర్లతో నల్లమల్లలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుపరి చితుడు అయ్యాడు ఆయా పేర్లతో . ఉమ్మడి పాలమూరు జిల్లా .కార్యదర్శిగా సంతోష్ పేరట ప్రకటనలు ఇచ్చేవారు. జిల్లాలో కూడా యువతి యువకులను రిక్రూట్మెంట్ భారీగానే చేసినారు. పోలీస్ అనేకసార్లు ఎన్కౌంటర్ నుండి దొరికినట్టే దొరికి త్రుటిలో తప్పించుకోగలిగారు.




నేను ఆ పేరు పెట్టుకోవడం లేదని ప్రజలే పిలుస్తున్నారని నా పేరు కోనపురి ఐలయ్య అని చెప్పాడు. ఇప్పటికీ చుక్కాయిపల్లి సాంబశివుడిని చెంచులు ఉమ్మడి పాలమూరు జిల్లా వాసులు తలుచుకుంటారు. అక్కడ ప్రజలలో చెరగని ముద్రను వేసుకున్నారు. స్మరించుకుంటారు.

నల్లమల్లపై పట్టును సాధించాడు మావోయిస్టు అగ్ర నేతలు పటేల్ సుధాకర్ రెడ్డి, శాఖమూరి అప్పారావు ,మేడం బాలకృష్ణ లాంటి నేతలతో కలిసి పనిచేశాడు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పోతుల సుదర్శన్ రెడ్డి , మద్దిలేటి రమాకాంత్ లతో కలిసి జిల్లా విప్లవ ఉద్యమానికి నిర్మాణం చేసినాడు. అప్పటి రాష్ట్ర కార్యదర్శి మాధవ్ తో కలిసి. చెంచులు. అడవి బిడ్డలకు . వైద్యునిగా పనిచేశాడు . శాఖమూరి అప్పారావు పటేల్ సుధాకర్ రెడ్డి రామకృష్ణ లాంటి అగ్రనేతలు కూడా పార్టీ క్యాడర్కు పార్టీ కార్యకర్తలకు సభలు సమావేశాలు పెట్టి ఉత్తేజాన్ని నింపారు. పార్టీ నిర్మాణంలో ప్రణాళికలు రచించేవాడు చుక్కాయి పల్లి .సాంబశివుడు ప్రజల్లో మంచి పేరును సంపాదించుకున్నాడు జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుపరిచితుడే పాలమూరు జిల్లా కు సుపరిచితుడే అసలు సాంబశివుడు ఎవరు ఏమిటి అనేది చర్చని అంశంగా మారింది. సాంబశివుడు (ఒక మాదిగ బిడ్డ) దళిత సామాజిక వర్గానికి చెందిన పేద కుటుంబంలో జన్మించి మావోయిస్టు పార్టీలో అనాటి పీపుల్స్ వార్ పార్టీ లో చేరి విప్లవ ఉద్యమంలోనే అసువులు బాసినాడు . అయితే సాంబశివుడు తో పాటు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు లింగస్వామి అలియాస్ కృష్ణ మరో నాయకుడు భాస్కర్ కృష్ణానదిలో పడవలో మునిగి చనిపోయారు. సాంబశివుడు, లింగసామిని .రక్షించడానికి వెళ్లి కృష్ణ నదిలో మునిగి చనిపోయారు. అప్పటినుంచి వలిగొండకు మండలం దాసిరెడ్డిగూడెం కి చెందిన కోనపురి ఐలయ్య అలియాస్ సుధాకర్ సాంబశివుడి పేరు పెట్టుకుని మావోయిస్టు పార్టీలో ఎదిగారు కానీ తెలంగాణలో అందరూ అనుకునేదే అసలు సాంబశివుడు కోనపురి ఐలయ్య అని అనుకుంటున్నారు కానీ అసలు సాంబశివుడు పాలమూరు జిల్లా చుక్కాయిపల్లికి చెందిన ఇతనే .అసలైన సాంబశివుడు .కానీ అసలు సాంబశివుడు పేరు .వక్కన పోయి తెరపైకి కోనపురి ఐలయ్య సాంబశివుడిగా . ప్రచారంలోకి వచ్చింది .ఆయన త్యాగం. పోరాటం నేడు. కనుమరుగై కోనపురి ఐలయ్యని సాంబశివుడిని అనుకుంటున్నారు ఇది కాదు జగమెరిగిన అక్షర సత్యం కార్పొరేట్ మీడియా సాంబశివుడు అని పదే పదే వార్తలు రాయడం ప్రచారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్టే .కోనపురి ఐలయ్య అప్పటి ఇంటెలిజెన్స్ ఐజి శివధర్ రెడ్డి ఎదుట లొంగి పోయారు. రివార్డులు కూడా తీసుకున్నారు టిఆర్ఎస్ లో చేరిపోయారు ఎమ్మెల్యే టికెట్ ఆశించింది. అంతలోనే గ్యాంగ్ స్టార్ .నహీం సాంబశివుడు .ల మధ్య రియల్ ఎస్టేట్ ల్యాండ్ విషయంలో గొడవలు తలెత్తాయి ఆ గొడవలోని నహీం చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. కోనపురి ఐలయ్యను సాంబశివుడిగా పేరును వాడుకోవద్దని ఆ పేరు వాడుకుంటే నిజమైన విప్లవ కారుని అమరవీరుని కించపరిచినట్లేనని .ఆ పేరు వాడుకోవద్దని అప్పటి మావోయిస్టు నేత తలారి కృష్ణ ఒక ప్రకటన విడుదల చేస్తూ హెచ్చరికలు కూడా జారీ చేశారు. నేను ఆ పేరు పెట్టుకోవడం లేదని ప్రజలే పిలుస్తున్నారని నా పేరు కోనపురి ఐలయ్య అని చెప్పాడు. ఇప్పటికీ చుక్కాయిపల్లి సాంబశివుడిని చెంచులు ఉమ్మడి పాలమూరు జిల్లా వాసులు తలుచుకుంటారు. అక్కడ ప్రజలలో చెరగని ముద్రను వేసుకున్నారు. స్మరించుకుంటారు ఎందుకంటే అతను జీవించిన అన్ని రోజులు పీడిత తాడిత ప్రజల కోసం ప్రాణాలు అర్పించినవాడు. వలస కూలీలపై పోరాటాలు నిర్వర్తించినవాడు వలస కూలీలను ఆపాలన్నాడు కూలీలకు కూలి రేట్లు పెరగాలి అన్నాడు. ప్రజాసామిక తెలంగాణ కోసం. విద్యుత్ చార్జీల పెంపు వ్యతిరేక ఉద్యమంలో ప్రజల్ని పోరాటాల వైపు మళ్ళించాడు. ఎన్నో దాడులు కూడా చేసినాడు. అప్పటి దేవరకొండ ఎమ్మెల్యే రాగ్యా నాయక్ అత్యాంతరం పోరాటాలు జరిగిందని సంతోష్ పేరట లేక విడుదలైంది. ఇది కలకలం రేగింది. 2002 అమరత్వం పొంది 24 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ప్రజల హృదయాలలో ఉన్నాడంటే అతను ఎంత నిస్వార్థంగా పనిచేశాడు అర్థమవుతుంది. అసలు సాంబశివుడు చరిత్రను నేడు తెలియ చేయవలసిన అవసరముంది. ఆయన చరిత్రను మీ ముందుకు తీసుకు వస్తున్నాము అసలు సాంబశివుడు ఎవరో మీరే తెలుసుకోవాలని. ఈ వ్యాసం ద్వారా మీ ముందు ఉంచుతున్నాను. మావోయిస్టు పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసే లొంగిపోతే ఆ నాయకుడిని మావోయిస్టు పార్టీ కార్యకర్తగా కూడా పరిగణించదు. అసలైన సాంబశివుడు చుక్కాయిపల్లికి చెందిన వ్యక్తి ఇది అందరికీ తెలవాలని ఈ వ్యాసాన్ని మీ ముందుకు తెస్తున్నాను. పార్టీలో అమరులు అయితే అమరత్వమూ పొందు తే ఆ వీరుడికి అమరవీరుల పేరు నామకరణం చేసి ఆ పేరు మీదనే పిలుస్తారు.

దామరపల్లి నర్సింహారెడ్డి
9581358696

జాతీయ విద్యా విధానం

# ప్రభుత్వ విద్యకు ముప్పా? లేక.. సంస్కరణల పేరుతో కేంద్రీకరణా?

విద్య అనేది ఒక ప్రభుత్వ పథకం కాదు. అది ఒక దేశ భవిష్యత్తును నిర్మించే సామాజిక పెట్టుబడి. ఒక తరం ఆలోచనా శక్తిని, శాస్త్రీయ దృక్పథాన్ని, ప్రజాస్వామ్య విలువలను, ఆర్థిక సామర్థ్యాన్ని నిర్ణయించేది విద్యా వ్యవస్థే. అందుకే ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు విద్యను ఖర్చుగా కాకుండా జాతీయ అభివృద్ధికి మూలధనంగా పరిగణిస్తాయి. అయితే భారతదేశంలో గత కొన్నేళ్లుగా విద్యా రంగంలో జరుగుతున్న మార్పులు, ముఖ్యంగా జాతీయ విద్యా విధానం–2020 అమలు తీరు, ప్రభుత్వ విద్య భవిష్యత్తుపై తీవ్ర చర్చకు దారితీశాయి.




"ఎన్ఈపీ ప్రభుత్వ విద్యను నాశనం చేస్తుంది" అనే విమర్శ కేవలం రాజకీయ నినాదం కాదు. దాని వెనుక ఉన్న ప్రశ్న మరింత లోతైనది. భారతదేశంలో ఇప్పటికే అసమానతలతో బాధపడుతున్న విద్యా వ్యవస్థలో, ప్రభుత్వ బాధ్యత తగ్గి మార్కెట్ ఆధారిత విద్యా విధానం పెరిగితే పేద, గ్రామీణ, సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యా అవకాశాలు దెబ్బతింటాయా అన్నదే అసలు ఆందోళన.గత పన్నెండేళ్లలో కేంద్ర ప్రభుత్వం విద్యా రంగంలో అనేక విధాన మార్పులను ప్రకటించింది. డిజిటల్ విద్య, నైపుణ్యాభివృద్ధి, జాతీయ విద్యా విధానం 2020 వంటి కార్యక్రమాలు ఆధునిక విద్య అవసరాలకు అనుగుణంగా మార్పులను లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే ఒక విధానం విజయాన్ని దాని ప్రకటనలతో కాకుండా, దానికి కేటాయించిన వనరులు, అమలు సామర్థ్యం, విద్యార్థులకు అందుతున్న వాస్తవ ప్రయోజనాల ఆధారంగా అంచనా వేయాలి.

మంచి లక్ష్యాలను ప్రకటించినప్పటికీ, వాటిని సాధించడానికి అవసరమైన ప్రజా పెట్టుబడులు,ఉపాధ్యాయ నియామకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశోధన నిధులు అదే స్థాయిలో కనిపించడం లేదు. నిజానికి విద్యా సంస్కరణలు ఎంతో అవసరం.పనికిరాని పాత పద్ధతులు మారాలి.

**ఇక్కడ మొదటి ప్రశ్న ప్రభుత్వ పెట్టుబడుల గురించి:**

1964–66లో వచ్చిన కొఠారి కమిషన్ విద్యపై దేశ స్థూల ఉత్పత్తిలో కనీసం 6 శాతం ఖర్చు చేయాలని సిఫారసు చేసింది. దాదాపు ఆరు దశాబ్దాలు గడిచినా ఆ లక్ష్యం పూర్తిగా సాధించలేదు. కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయింపులు పెరిగినప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం, విద్యార్థుల సంఖ్య, కొత్త సాంకేతిక అవసరాలతో పోలిస్తే పెట్టుబడి ఇంకా తక్కువగానే ఉందనే విమర్శ కొనసాగుతోంది. కేంద్ర బడ్జెట్ గణాంకాలను పరిశీలిస్తే, 2014–15లో విద్యా రంగానికి కేటాయింపు సుమారు రూ.82,000 కోట్ల పరిధిలో ఉండగా, 2024–25లో విద్యా మంత్రిత్వ శాఖకు కేటాయింపు సుమారు రూ.1.20 లక్షల కోట్లకు పైగా చేరింది. సంఖ్యాపరంగా ఇది పెరుగుదలే అయినప్పటికీ, ద్రవ్యోల్బణం, విద్యార్థుల పెరుగుదల, డిజిటల్ మౌలిక వసతుల అవసరం, పరిశోధన వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ పెరుగుదల సరిపోతుందా అనే ప్రశ్న మిగిలిపోతుంది. ముఖ్యంగా ఉన్నత విద్యలో సమస్య మరింత స్పష్టంగా కనిపిస్తుంది. భారతదేశంలో ఉన్నత విద్యలో నాలుగు కోట్లకు పైగా విద్యార్థులు ఉన్నారు. దేశంలో 1,100కు పైగా విశ్వవిద్యాలయాలు, 45,000కు పైగా కళాశాలలు ఉన్నప్పటికీ, వాటిలో చాలా సంస్థలు నాణ్యమైన అధ్యాపకులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, పరిశోధనా వనరుల కొరతను ఎదుర్కొంటున్నాయి. ఒక దేశం ప్రపంచ జ్ఞాన శక్తిగా ఎదగాలంటే పరిశోధన రంగం బలంగా ఉండాలి. కానీ భారతదేశ పరిశోధన, అభివృద్ధి (ఆర్ & డీ) వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 0.6–0.7 శాతం పరిధిలోనే ఉంది. దీనితో పోలిస్తే దక్షిణ కొరియా 4 శాతానికి పైగా, ఇజ్రాయెల్ 5 శాతం సమీపంలో, అమెరికా సుమారు 3 శాతం స్థాయిలో పరిశోధనపై పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ వ్యత్యాసం ఎందుకు ముఖ్యమంటే, పరిశోధనకు నిధులు లేకుండా ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలు నిర్మించడం అసాధ్యం.

జాతీయ విద్యా విధానం (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ) ఎన్ఈపీ–2020లో పరిశోధనకు ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ, విధానానికీ, వాస్తవ అమలు మధ్య అంతరం స్పష్టంగా కనిపిస్తుంది. జాతీయ పరిశోధనా ఫౌండేషన్ వంటి ప్రతిపాదనలు పరిశోధనకు కొత్త ఊపునిస్తాయని చెప్పింది. కానీ పరిశోధనకు అవసరమైన నిరంతర నిధులు, విశ్వవిద్యాలయాల సామర్థ్య పెంపు, యువ పరిశోధకులకు అవకాశాలు లేకుండా కేవలం సంస్థల పేర్లు మార్చడం వల్ల ప్రయోజనం ఉండదు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీనపడటం వల్ల వచ్చే ప్రమాదం కేవలం విద్యా రంగానికి మాత్రమే పరిమితం కాదు. భారతదేశంలో ఎక్కువ మంది విద్యార్థులు ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలపై ఆధారపడుతున్నారు. ఈ వ్యవస్థ బలహీనపడితే సామాజిక అసమానతలు మరింత పెరుగుతాయి. నాణ్యమైన విద్య ధనిక వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉండే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వ విద్య యొక్క అసలు ఉద్దేశం కూడా ఇదే. దేశంలో ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా... ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి సమాన అవకాశం కల్పించడం ముఖ్యం. కానీ, ప్రభుత్వ రంగం బలహీనపడి, ప్రైవేట్ రంగం ఆధిపత్యం పెరిగితే విద్య ఒక హక్కు నుంచి ఒక వస్తువుగా మారే ప్రమాదం ఉంటుంది. ఇక్కడ ఎన్ఈపీపై వస్తున్న ప్రధాన విమర్శ ఏమిటంటే, విధానం అనేక మంచి లక్ష్యాలను ప్రకటించినప్పటికీ, వాటిని సాధించడానికి అవసరమైన ప్రజా పెట్టుబడులు,ఉపాధ్యాయ నియామకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశోధన నిధులు అదే స్థాయిలో కనిపించడం లేదు. నిజానికి విద్యా సంస్కరణలు ఎంతో అవసరం.పనికిరాని పాత పద్ధతులు మారాలి. నూతన సాంకేతిక పెరగాలి. నైపుణ్య విద్య పెరగాలి. కాని ప్రశ్న ఏమిటంటే... ఈ మార్పులు ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశలో జరుగుతున్నాయా? లేక ప్రభుత్వ తన బాధ్యత నుండి తప్పుకుంటుందా? అనే దిశలో అనేక మార్పులు జరుగుతున్నాయి. ఈ పాలసీని మేధావులు లోతుగా అధ్యయనం చేయాలి.లోపాలు ఉంటే కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలి.



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్
ramkishore.1504@gmail.com

# భూ భారతి పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించాలి

- విద్యార్థినుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- పెద్ద శంకరంపేట మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



**పెద్దశంకరంపేట, ఆగస్టు 6 (జనం సాక్షి) :** భూ భారతి పెండింగ్ దరఖాస్తులపై అధికారులు దృష్టి సారించడంతోపాటు పారదర్శక రెవెన్యూ పాలన లక్ష్యంగా పనిచేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదేశించారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలు భాగంగా పెద్ద శంకరంపేట లోని తాసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడంతో పాటు భూభారతి పెండింగ్ దరఖాస్తులపై చర్చించిన అనంతరం పేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. మీ సేవలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలన్నారు. భూభారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం తనిఖీ చేసి వంటశాల తాగునీటి సౌకర్యాలు తరగతి గదులు పరిశుభ్రత తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు.. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి ఆహార నాణ్యత పరిశుభ్రత ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న విద్య వసతి ఆహారం తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలు పై వరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తరగతి గదులలో విద్యార్థినుల సామర్థ్యాలను పరీక్షించడంతోపాటు కచ్చితంగా వారికి పౌష్టిక ఆహారాన్ని సకాలంలో అందించాలన్నారు. పేట మండల పరిధిలోని బుజరాన్ పల్లి గ్రామపంచాయతీ ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని. తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల భూగర్భ జలాలను పెంపొందించు కోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నారాయణ ఎంపీడీవో క్రాంతికుమార్ ఆర్ఐ నాగరాజు ఎంపీఓ జాకీర్ హుస్సేన్. కేజీ విపి ప్రిన్సిపల్ విజయ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో మౌళిక వసతులు కల్పించడమే ధ్యేయం

- అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శిరీష కృష్ణారెడ్డి



**శామీర్‌పేట్, ఆగస్టు 6 (జనంసాక్షి) :** అలియాబాద్ మున్సిపాలిటీలో మౌళిక వసతులు కల్పించి అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నామని అలియాబాద్ మున్సిపల్ చైర్ పెర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. గురువారం అలియాబాద్ పురపాలక సంఘం పరిధిలోని 5వ వార్డులో మున్సిపల్ జనరల్ నిధులు 6 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన నూతన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణా రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవ రెడ్డి , కౌన్సిలర్లు తల్లా స్వప్న ,తలారి మౌనిక ,క్రైరా గణేష్, మున్సిపల్ ఏఈఈ సనాషాహీన్ , మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## స్కూల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



**మర్పల్లి, ఆగస్టు 6 (జనంసాక్షి) :** స్కూల్ ప్రాంగణాన్ని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి ట్యాంకులను తప్పకుండా శుభ్రం చేయాలని మర్పల్లి ఎంపీడీవో శాంతమ్మ అన్నారు. గురువారం మర్పల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. వంటగదినీ, విద్యార్థులకు వండిన వంటను ఆమె పరిశీలించారు. మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్ లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ మేనో ప్రకారం వడ్డించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మంచి విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అశోక్, ఎంపీఓ శ్రీనివాస్, ఏపిఎం సమయం, తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్‌సీ ప్రకటించేదాకా ఉద్యమం ఆగదు

- టీఎస్‌యుటిఎఫ్ జిల్లా నాయకులు




**శ్రీరంగాపూర్, ఆగస్టు 6 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ టిటీఎస్ యుటిఎఫ్ శ్రీరంగాపూర్ మండల యూనియన్ సభ్యత్వ నమోదు లో భాగంగా మండల అధ్యక్షులు వి చిన్నస్వామి మండల ప్రధాన కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో జెడ్పి ఎంపీపీ ఎస్, కేజీబీవీ ,తదితర అనేక పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు చేశారు ఉపాధ్యాయుల నుంచి విశేష ఆదరణ లభించింది ఈ సందర్భంగా విద్యారంగ సమస్యలు చర్చించి, వాటి పరిష్కారం కోసం ఉపాధ్యాయులు యుటిఎఫ్ నాయకత్వంలో దశల వారి పోరాట కార్యక్రమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.కాంపెయిన్ లో పాల్గొన్న జిల్లా కోశాధికారి టి. తిమ్మప్ప మాట్లాడుతూ తక్షణమే పి ఆర్ సి ప్రకటించాలని ,6 పెండింగ్ డి ఎ లు విడుదల చేయాలని,సిపిఎస్ ఉద్యోగుల పెండింగ్ ఏరియర్స్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.జీవో317 బాధితులకు 190 జీవోను తక్షణమే అమలు చేసి వారి స్వంత జిల్లాలకు డిప్యూటేషన్ పై పంపాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జీవో నెంబర్ 25 ను సవరించి ప్రాథమిక పాఠశాల లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను ఇవ్వాలని, 40 మంది విద్యార్థులు దాటిన పాఠశాలలో తరగతికొక ఉపాధ్యాయుడిని నియమించాలని సూచించారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసు గౌడ్ మాట్లాడుతూ.కేజీబీవీ ఉద్యోగులకు టైమ్ స్కేల్ ఇవ్వాలని, వారికి సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.కేజీబీవీ ఉపాధ్యాయుల కు హెల్త్ కార్డు లు వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న పాఠశాల స్థాయిలో నిరసన, ఆగస్టు 12, 13న మండల కేంద్రంలో వినతి పత్రాలు ఇవ్వడం, ఆగస్టు 19న జిల్లా కేంద్రంలో ధర్నా చివరగా ఆగస్టు 29 న రాష్ట్ర రాజధాని లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నిరసనలో వేలాది గా ఉపాధ్యాయులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కే కురుమన్న, మండల ఉపాధ్యక్షులు టి. శ్రావణ్ కుమార్, సమీన్ బేగం, సీనియర్ నాయకులు ఎం. నరసింహ, ఆంజనేయులు బి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



**గోపాలపేట, ఆగస్టు 6 (జనంసాక్షి) :** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి, ప్రతి గర్భిణికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం గోపాలపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవల తీరుపై సమీక్ష నిర్వహించారు. లేబర్ రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, గర్భిణులకు అందుతున్న సేవలు, ప్రసవాల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం ఈడీడీ రిజిస్టర్‌ను పరిశీలించి, ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణుల వివరాలు, వారికి నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, రక్తహీనతతో బాధపడుతున్న మహిళల పరిస్థితిని తెలుసుకున్నారు. అనీమియాతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించి వారికి పోషకాహారం, అవసరమైన మందులు అందించి ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించాలని అధికారులకు సూచించారు. మాతా-శిశు ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను ఎంసీహెచ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు ఖచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలు, పరీక్షలు, మందుల పంపిణీపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. రోజువారీ ఓపీ నమోదును పరిశీలించి, చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లేబర్ రూమ్‌లకు అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మోసాలు చేసే న్యాయవాదుల డిగ్రీలను రద్దు చేయాలి



**ముషీరాబాద్, ఆగస్టు 6 (జనం సాక్షి) :** కోర్టు తీర్పుల విషయంలో సంవత్సరాల తరబడి జాప్యం వల్ల న్యాయవ్యవస్థ పై నమ్మకం పోతుందని, త్వరిత న్యాయం, జాప్యం లేని న్యాయ వ్యవస్థను అమలు చేయాలని రాగన్నగూడ కు చెందిన చిలగాని కరుణశ్రీ, ఆమె భర్త ధర్మరాజు లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్దగల ధర్నా చౌక్ లో "మార్పు కోసం నిరంతర ధర్నా" పేరుతో పౌర సమాజ ప్రతినిధులు శాంతియుత నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం రాగన్నగూడ కు చెందిన చిలగాని కరుణశ్రీ, ఆమె భర్త ధర్మరాజు మాట్లాడుతూ.. 2025 జూలై 4న ఆన్‌లైన్ మోసంలో డబ్బులు పోయిన ఘటనపై ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు తమ డబ్బు రికవరీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూ వివాదానికి సంబంధించి గత 13 సంవత్సరాలుగా వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులను, కోర్టులను ఆశ్రయించినా ఇప్పటికీ న్యాయం జరగలేదని తెలిపారు. న్యాయ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి సామాన్య ప్రజలకు వేగంగా, సులభంగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మోసాలకు పాల్పడే న్యాయవాదులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి డిగ్రీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన సందర్భంగా "త్వరిత న్యాయం మా హక్కు", "జాప్యం లేని న్యాయ వ్యవస్థ కావాలి", "మోసాలు చేసే న్యాయవాదుల డిగ్రీలు రద్దు చేయాలి" అంటూ నినాదాలు చేశారు. ప్రజలకు జాప్యం లేని న్యాయం అందే విధంగా న్యాయ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ తమ నిరాహార దీక్ష కొనసాగుతుందని తెలిపారు.

# గద్దర్ ఆశయాలు స్ఫూర్తిగా నిలవాలి

- మూడో వర్ధంతి సందర్భంగా జేఏసీ ఆధ్వర్యంలో నివాళులు



**అల్వాల్, ఆగస్టు 6 (జనంసాక్షి) :** ప్రజాకవి, విప్లవ ప్రజాగాయకుడు గద్దర్ మూడో వర్ధంతి సందర్భంగా తెలంగాణ అమరుల పోరాట సమితి (జేఏసీ) ఆల్వాల్ సర్కిల్ సభ్యులతో కలిసి మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి గద్దర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం, తెలంగాణ ఆత్మగౌరవం కోసం గద్దర్ జీవితాంతం పోరాడారని అన్నారు. ఆయన ఆట, పాట, మాటలు ప్రజల్లో చైతన్యాన్ని రగిలించాయని, గద్దర్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సురేందర్ రెడ్డి, సామాజిక కార్యకర్తలు, అభిమానులు పాల్గొని గద్దర్ సేవలను స్మరించుకున్నారు.

## వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 6 (జనంసాక్షి) :** ప్రజలకు సత్వర న్యాయం, మర్యాదపూర్వకమైన, పారదర్శక పోలీసు సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, తెలిపారు. గురువారం సాయంత్రం ఆమె వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిసెప్షన్ సెంటర్, ఫిర్యాదుల నమోదు, బాధితులతో సిబ్బంది వ్యవహరించే తీరు, పెండింగ్ కేసుల పురోగతి, స్టేషన్ రికార్డులు, సీసీ కెమెరాల పనితీరు, పరిశుభ్రత, స్వాధీనం చేసుకున్న వాహనాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ప్రతి ఫిర్యాదుదారుడిని గౌరవంగా స్వీకరించి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ రాత్రి వేళల్లో పెట్రోలింగ్, నిఘా చర్యలు మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఆకతాయిలు, ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గంజాయి విక్రయాలు, చోరీలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, వదంతులు, చట్టవ్యవస్థకు భంగం కలిగించే పోస్టులు చేసే వారిపై సైబర్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు ధృవీకరించని సమాచారాన్ని పంచుకోవద్దని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే డయల్-112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీలో డీఎస్పీ గిరిబాబు, సీఐ సుగంధరత్నం, రూరల్ ఎస్సై హృషికేష్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన కరాటే మాస్టర్లను అభినందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**నిజాంపేట్, ఆగస్టు 6 (జనం సాక్షి) :** హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఏప్రిల్ 26వ తేదీన నిర్వహించిన ప్రపంచంలోనే అతిపెద్ద కరాటే కటా డెమోన్‌స్ట్రేషన్ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ రాఘవేంద్ర కాలనీకి కు చెందిన ఫైటర్స్ షోటోకాన్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు మాస్టర్ కాసర్ల కార్తీక్ మాస్టర్ సోనియా పాల్గొని 25 నిమిషాల పాటు నిరంతరాయంగా కటా ప్రదర్శించి గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని ఫైటర్స్ షోటోకాన్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు మాస్టర్ కాసర్ల కార్తీక్ మరియు మాస్టర్ సోనియా లు గురువారం కుత్బుల్లాపూర్ లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలువగా గిన్నిస్ రికార్డ్ తో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మాస్టర్ కాసర్ల కార్తీక్ మరియు మాస్టర్ సోనియా లను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఎంతో గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో కుంట సిద్దిరాములు, సుధాకర్ గౌడ్, సమ్మయ్య నేత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

- ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- జనసేన నేత డాక్టర్ మణికంఠ



**మఖ్తల్, ఆగస్టు 6 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వేదికగా జనసేన పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'విద్యార్థి పోరు దీక్ష' కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ మణికంఠ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం సాగుతున్న ఈ పోరాటంలో ఆయన పాల్గొని, ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది పేద విద్యార్థులు వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి డిగ్రీలు, పీజీలు, ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వం నుండి డబ్బులు రాకపోవడంతో యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో ఉన్నత చదువులకు, ఉద్యోగ అవకాశాలకు దూరమై యువత మనోవేదనకు గురవుతోందని తెలిపారు. తక్షణమే పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే విద్యార్థుల ఆగ్రహజ్వాలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం దహనమైపోవడం ఖాయమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసేన పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్, సంపత్ నాయక్, ముమ్మా రెడ్డి ప్రేమ్ కుమార్, దామోదర్ రెడ్డి, ప్రజీత్ గౌడ్, మేకల సతీష్ రెడ్డి, మేడ రామకృష్ణ, కుత్బుల్లాపూర్ సతీష్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థి పోరు దీక్షకు సంపూర్ణ మద్దతు తెలిపారు. డాక్టర్ మణికంఠ గౌడ్ పిలుపు మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుండి నాయకులు భారీగా తరలివెళ్లారు. మక్తల్ నియోజకవర్గం నుండి బాదేపల్లి నరేష్ గౌడ్, రామన్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రవీణ్, హనుమంతు; నారాయణపేట జిల్లా నుండి విష్ణువర్ధన్ రెడ్డి, గుడిసె నరసింహ, మౌనిష్ చారి; కొడంగల్ నియోజకవర్గం నుండి అరుణ్ కుమార్ గౌడ్, డీకే అశోక్ కుమార్, స్వామి తేజ, హనుమంతు, రమేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని దీక్షను విజయవంతం చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి



**మద్దూరు, ఆగస్టు 6 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కొడంగల్ నియోజకవర్గ జనసేన నాయకుడు డీకే అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో జనసేన విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి పోరు దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం సకాలంలో ఫీజులు, స్కాలర్షిప్‌లు విడుదల చేయకపోవడంతో కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో వారు ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలను కూడా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడవద్దని, వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు. లేకపోతే విద్యార్థుల ఆందోళనను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అరుణ్ కుమార్ గౌడ్, హస్నాబాద్ హనుమంతు, స్వామి తేజ, రమేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేర్యాల కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

- న్యాయవాది మల్లయ్య హత్యను ఖండించిన బార్ అసోసియేషన్



**చేర్యాల, ఆగస్టు 6 (జనంసాక్షి) :** కొల్లాపూర్ కోర్టు పరిధిలోని పెంట్లవెల్లిలో న్యాయవాది మల్లయ్యను అత్యంత దారుణంగా హత్య చేయడాన్ని చేర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరేళ్ల వీర మల్లయ్య తీవ్రంగా ఖండించారు. న్యాయవాదులు ప్రజలకు న్యాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఒక న్యాయవాదిపై ఇంతటి క్రూరమైన ఘటన న్యాయవాదుల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని ప్రత్యేక దర్యాప్తు నిర్వహించి, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని, అడ్వకేట్స్ ప్రొటెక్షన్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. అలాగే, మృతుడు మల్లయ్య కుటుంబానికి తగిన న్యాయం చేయడంతో పాటు, ప్రభుత్వ పరంగా తగిన ఆర్థిక సహాయం అందించి, కుటుంబంలోని ఒక అర్హుడైన సభ్యునికి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ఈ దారుణ హత్యను మరోసారి తీవ్రంగా ఖండిస్తూ, నిందితులపై వేగవంతమైన, నిష్పాక్షిక చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ మెరుగు రమేష్, ఉపాధ్యక్షుడు కాటం సురేందర్, సీనియర్ న్యాయవాదులు భూమిగారి మనోహర్, బి. యాదగిరి గౌడ్, న్యాయవాదులు పొన్నం సురేష్, నల్గొండ సంతోష్, తాటికొండ ప్రణీత్, నీరటి రాజలింగం, గుస్క వెంకటేష్, రామకృష్ణారెడ్డి, ఆంజనేయులు, ప్రశాంత్, దస్తగిరి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని ధృడపరుచుకోవాలి




**మల్దకల్, ఆగస్టు 6 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోనిప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మానసిక ఆరోగ్యం పైన అవగాహన కార్యక్రమం ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డిఅధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ దశ విద్యార్థులకు కీలకమైందని ఈ దశలో శరీరంలో విభిన్న మార్పులు వస్తాయని వాటిని నియంత్రించుకుంటూ శారీరకంగా,మానసికంగా దృఢంగా ఉండాలని దీనికోసం మంచి ఆహారపు అలవాట్లు,యోగా లాంటివి అలవాటు చేసుకోవాలని అన్నారు.కార్యక్రమానికి అతిథులుగా మెడికల్ డిపార్ట్మెంట్ లోని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం నుండి వచ్చిన డాక్టర్ విజయ్ కాంత్,డాక్టర్ సామ్రీన్ కౌశిర్ లు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పౌష్టిక ఆహారం గురించి వివరించి,అమ్మాయిల ఆరోగ్య సమస్యలపై,చిన్న వయసులో వివాహాల వలన జరిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు.ఈ వయసులో మత్తుపదార్థాలు,ధూమపానం తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రోగ్రామ్ ఆఫీసర్ రామాంజనేయులు గౌడ్,అధ్యాపకులు గోవర్ధన్ శెట్టి,భాగ్యలక్ష్మి,మాధురి, శ్రీకాంత్,రంగస్వామి, ఇష్తికర అహ్మద్ అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## జయశంకర్ సేవలు స్ఫూర్తిదాయకం

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 6 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడి న మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిం చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయ న ఆలోచనలు, రచనలు, పరిశోధనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొ న్నారు.కార్యక్రమంలో ఎస్ డీసీ రాజేందర్ గౌడ్, ఏవో అనిల్ కుమార్, బీసీ సంక్షే మ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీపీఆర్‌వో రషీద్, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో తరలిరావాలి
- కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల నాయకుల పిలుపు



**రేవల్లి, ఆగస్టు 6 (జనంసాక్షి) :** ఏదుల మండల కేంద్రంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో మండల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్ ఎన్ రమేష్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ అజయ్, సీఐటీయూ జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 10న వనపర్తి జిల్లా కేంద్రలో జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. 29 లేబర్ చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి ఏప్రిల్ 01 నుంచి దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్నారు. 8 గంటల పని దినాన్ని రద్దు చేస్తూ 12 గంటలకు పని దినాన్ని తీసుకురావడం కార్మికులకు తీరని నష్టం చేసే విధంగా ఉన్నాయని వెంటనే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి 29 కార్మిక చట్టాలని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దేశంలో నిరుపేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టాన్ని తీసివేసి వీబీజీ రాంజీ పేరుతో ఉపాధి హామీని నీరుగార్చే విధంగా రాష్ట్రం వాటా 40% ఇస్తే కేంద్రం వాట 60% జమ చేస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వాలు 90% కేంద్రం నుంచి నిధులు ఇచ్చే వాళ్ళని వెంటనే విబిజీ రాంజీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు ఎంఎస్పి చట్టాన్ని అమలు చేయాలని గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. భారతదేశానికి స్వతంత్రం రాకముందు ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమని రగిలించి భారత దేశ ప్రజలను ఐక్యం చేసి బ్రిటిష్ వాళ్ళని ఈ దేశం నుంచి తరిమేసినరు, కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పోరేట్లకి కారు చౌకగా ప్రభుత్వ రంగ సంస్థలను భారతదేశం యొక్క భౌగోళిక స్వరూపాన్ని ధ్వంసం చేసే విధంగా కార్పొరేట్ సంస్థలకు ఇతర దేశాలకు చౌకగా అమ్మేయడం జరుగుతుందని అందులో భాగంగానే భారతదేశ కార్మిక వర్గాన్ని వ్యవసాయ కూలీలను రైతాంగాని పరోక్షంగా బడా కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడే విధంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం విధానాలు తీసుకురావడం సరి అయినది కాదని ఈనెల 10న వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఖండించాలని కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది. క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో భారతదేశ ప్రజల యొక్క మౌలిక హక్కులని కాపాడడం కోసం కార్మిక వర్గాన్ని నిలబెట్టడం కోసం ఎంతటి త్యాగానికైనా కార్మిక వర్గం ముందుండి పోరాడుతుందని ఇలాంటి మోడీలను ఎంతోమందిని ఇంటికి పంపిందని అలాంటి నరేంద్ర మోడీ కార్మికులతో చెలగాటమాడుతున్నాడని రాబోయే కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కార్మికులు కర్షకులు గుణపాఠం చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకురాలు సుమతి, రాజేశ్వరి, నిర్మల, బాలమషమ్మ, ఇందిరమ్మ, లక్ష్మి, లలిత, శ్రీదేవి, విమలమ్మ, చంద్రయ్య, వెంకటయ్య సువర్ణ, చెనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 10న జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శెట్టిపల్లి సత్తిరెడ్డి



**కొమురవెల్లి, ఆగస్టు 6 (జనం సాక్షి) :** ఈనెల 10వ తారీఖున జరిగే జైలు బరో కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొంటారని కొమురవెల్లి ఎంపీడీవో గారికి తెలంగాణ గ్రామ పంచాయతి యూనియన్ సిఐటియు కొమురవెల్లి మండల కమిటీ వినతి పత్రం ఇవ్వడం జరిగింది.అనంతరం సత్తిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగాన్ని కార్మికులను వ్యవసాయ కార్మికులను విస్మరిస్తూ ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకురావడం జరుగుతుందని దాంట్లో బాగానే 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని పని గంటలు పెంచి కనీస వేతనం తగ్గించి కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు లేకుండా కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆయన అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని మొత్తం కార్పోరేట్ సంస్థలకి కారు చౌకగా అమ్మేస్తుందని ఆయన అన్నారు దేశంలో ప్రభుత్వ రంగ సంస్థల లేకుండా చేస్తుందని అన్నారు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రైవేటీకరణ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 10న క్విట్ ఇండియా స్ఫూర్తితో జరిగే జైలు బరో కార్యక్రమంలో కార్మికులు కర్షకులు వ్యవసాయ కార్మికులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ మండల నాయకులు పరుశరాములు రోడ్డనరసింహులు తాడూరి రాజలింగం సార్ల శ్రీను పుష్ప మల్లేశం యాదవ తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ సార్ ఆశయ సాధనే ధ్యేయం



**జడ్చర్ల, ఆగస్టు 6 (జనంసాక్షి) :** జడ్చర్ల పట్టణంలో తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ గిరీష్ ఆధ్వర్యంలో జయశంకర్ సార్ చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గిరీష్ మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం జయశంకర్ సార్ అందించిన అమూల్యమైన సేవలను, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మన్న, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణలో ఉన్న జయశంకర్ విగ్రహానికి బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మరియు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ ఆవిర్భావానికి సిద్ధాంతకర్త, ఉద్యమానికి మార్గదర్శి అయిన జయశంకర్ సార్ ఆత్మగౌరవం కోసం జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, జయశంకర్ సార్‌కు భారత రత్న ప్రకటించేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర కార్యదర్శి రఘునందన చారి, జిల్లా అధ్యక్షులు శేఖర్, మండల అధ్యక్షులు నర్సిములు, నియోజకవర్గం అధ్యక్షులు నిరంజన్, కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్, రైతు సంఘము జిల్లా అధ్యక్షులు గోపాల్, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి శేఖర్, పట్టణ అధ్యక్షులు శివ రాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు భీమ్ రాజ్, మండల కార్యదర్శి రఘు, రామస్వామి, జంబులయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం మార్చాలని వినతి



**జడ్చర్ల, ఆగస్టు 6 (జనంసాక్షి) :** జడ్చర్ల పట్టణంలో ప్రైవేట్ అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కావేరమ్మపేటలోని పాత మున్సిపల్ ప్రభుత్వ భవనంలోకి మార్చాలని కోరుతూ స్థానిక జేఏసీ నాయకులు, యువకులు గురువారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చవలసి ఉన్నందున, బాదేపల్లి ప్రాంతంలో ప్రైవేట్ అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం వల్ల ప్రభుత్వానికి అనవసరమైన అద్దె భారం పడుతోందని అందుకు 44వ జాతీయ రహదారికి పక్కనే, అందరికీ అందుబాటులో ఉన్న కావేరమ్మపేటలోని పాత మున్సిపల్ కార్యాలయం ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఈ భవనంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి అద్దె భారం తప్పడంతో పాటు, సువిశాలమైన పార్కింగ్ స్థలము, రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉంటాయి. జాతీయ రహదారికి ప్రక్కనే ఉండటం వల్ల ప్రజల రాకపోకలకు, రిజిస్ట్రేషన్ పనులకు సౌకర్యవంతంగా ఉంటుందని కార్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కోరగా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. బాదేపల్లిలోని అద్దె భవనంలో ఉన్న కార్యాలయాన్ని కావేరమ్మపేటలోని పాత మున్సిపల్ ప్రభుత్వ భవనంలోకి షిఫ్ట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జడ్చర్ల, కావేరమ్మపేట జె.ఎ.సి నాయకులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

# వ్యసనాలు వీడితేనే ఆనందమయ జీవితం

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 6 (జనంసాక్షి) :** మానవులు వ్యసనాలు వీడితేనే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని జాగృతి కళాశాల యాజమాన్య సభ్యులు శ్యాం కుమార్ అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారిస్ వనపర్తి శాఖ ఆధ్వర్యంలో నష ముక్తు భారత అభియాన్ అండ్ మిషన్ స్పందన ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుండి 20 వరకు చేపట్టనున్న వ్యసన విముక్తి ప్రతిజ్ఞ అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం కళాశాల చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజా హితం కోసం చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుదాం అన్నారు. ఆరోగ్యకరమైన జీవనం, జీవితం కోసం, సామరస్య కుటుంబం కోసం, ఉజ్వల భవిష్యత్తు కోసం, అభివృద్ధి చెందిన భారతదేశం నిర్మాణం కోసం వాగ్దానం చేపట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తూ .... నేను అన్ని రకాల మత్తు పదార్థాలకు దూరంగా ఉంటాను అని, నేను నా కుటుంబ సభ్యులకు స్నేహితులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా కృషి చేస్తానని, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన సమాజ నిర్మాణానికి నా వంతు కృషి చేస్తానని, భారత దేశాన్ని మాదకద్రవ్య రహిత దేశంగా మార్చడానికి నా వంతు కృషి చేస్తానని వ్యక్తిగత ప్రమాణం చేయించారు. వనపర్తి బ్రహ్మకుమారి కేంద్రం ప్రతినిధులు బికే నాగమణి, బికే శోభ మాట్లాడుతూ మత్తు పదార్థాలు లేని జీవన విధానం వలన కలిగే ప్రయోజనాలు ఎన్నో అని, వాటిలో ముఖ్యంగా మెరుగైన ఆరోగ్యం, మనశాంతి, ఉజ్వల భవిష్యత్తు, ఆర్థిక అభివృద్ధి, సంతోషకరమైన సత్సంబంధాలు, సానుకూల జీవనశైలి అలవరుస్తాయని చెప్పారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్యపై దృష్టి కేంద్రీకరించి ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అంబటి వినోద్ కుమార్, యాజమాన్య సభ్యులు భాస్కర్, సత్యనారాయణ, కార్యక్రమ సహాయకులు గంధం భక్తరాజు, నరసింహయ్య , విజయలక్ష్మి, అరుణమ్మ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# నామినేటెడ్ పోస్టుల్లో ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలి

**నారాయణపేట, ఆగస్టు 6 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ షేక్ ఫారూక్ హుస్సేన్ ప్రభుత్వాన్ని కోరా రు.నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ గార్డె న్స్ లో గురువారం నిర్వ హించిన ఉద్యమకారుల జిల్లా సమన్వయ సమావే శంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడా రు.ఈ సమావేశానికి సరా ఫ్ నాగరాజు అధ్యక్షత వహించారు.ఈ సందర్భం గా పలువురు ఉద్యమకా రులు మాట్లాడుతూ తెలం గాణ ఉద్యమంలో పాల్గొని తమ సర్వస్వాన్ని కోల్పో యామని, కొందరు ప్రాణ త్యాగం చేశారని, వారి కుటుంబాలకు ఇప్పటికీ తగిన ఆర్థిక భరోసా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.షేక్ ఫారూక్ హుస్సే న్ మాట్లాడుతూ,ఉద్యమ కారుల వివరాలను సేకరిం చేందుకు ప్రభుత్వం ఏర్పా టు చేసిన కమిటీ కనీసం ఉమ్మడి జిల్లా కేంద్రాలను సందర్శించి ఉద్యమకారుల అభిప్రాయాలు తెలుసుకో వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారులకు నామినేటెడ్ రాజకీయ పద వుల్లో ప్రాధాన్యత కల్పిస్తూ ప్రతి జిల్లాలో ఐదు సింగిల్ విండో అధ్యక్ష పదవులు, కార్పొరేషన్ చైర్మన్‌లలో పది రాష్ట్రస్థాయి చైర్మన్ పదవులను ఉద్యమకారు లకు కేటాయించాలని కోరారు.అదనంగా ఆయన ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను ఉంచారు.

అమరుల కుటుంబాల్లో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి.అమరుల భార్య లేదా భర్తకు నెలకు రూ.50 వేల పెన్షన్ మంజూరు చేయాలి. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు నెలకు రూ.25 వేల పెన్షన్ ఇవ్వాలి.ఉద్యమకారులు కోరుకున్న గ్రామం, పట్టణం లేదా నగరంలో 250 గజాల ఇంటి స్థలం కేటాయించి, ప్రభుత్వం ఇంటిని నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాం డ్ చేశారు. అనంతరం జరి గిన సమావేశంలో షరాఫ్ నాగరాజును జిల్లా కన్వీన ర్‌గా, రామ్‌రెడ్డిని కో-కన్వీ నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు.నూతన జిల్లా కన్వీ నర్ సరాఫ్ నాగరాజు మాట్లాడుతూ త్వరలో కొడంగల్, మక్తల్, నారాయ ణపేట నియోజకవర్గాల ఉద్యమకారులను సమీక రించి భారీ ఆత్మీయ సమ్మే ళనం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ఈ సమావే శంలో ఉద్యమకారులు అబ్దుల్ జహీద్, వీరన్న, కావలి గోపాల్, ఆషిరెడ్డి, కృష్ణ, వెంకట శాస్త్రి, షరీఫా బేగం, భారతి,సతీష్, లక్ష్మా రెడ్డి, వెంకట్‌రెడ్డి, కిష్టప్ప, వేణుగోపాల్, నరసింహులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గడువులోగా హాస్పిటల్ పనులు పూర్తి చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులపై సమీక్ష



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 06 (జనం సాక్షి) :** జిల్లాలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పురోగతి పై జిల్లా కలెక్టర్ డా. సత్య శారద గురువారం సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి భవన నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి పూర్తయితే జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష లో ఆర్ అండ్ బి ఎస్ ఇ రమేష్ బాబు,ఎలక్ట్రిసిటీ ఎస్. ఇ ఆనందం , ఇన్చార్జి డి ఎం అండ్ హెచ్ ఓ రాజా రెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఇంజనీర్ శరవణ్,వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, ఇఇ దేవిక చౌహాన్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

## 6వ రోజుకు చేరుకున్న విబిజి రాంజీ ఉద్యోగుల పెన్ డౌన్ నిరసన



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 05 (జనంసాక్షి) :** విబిజి రాంజీ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విబిజి రాంజీ ఉద్యోగు ల సంఘం నాయకుడు,ఏపీవో ప్రేమయ్య అన్నా రు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని ఎంపిడీఓ కార్యాలయంలో రాంజీ ఉద్యోగులు చేస్తున్న పెన్ డౌన్ నిరసన కార్యక్రమం 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భం గా ఏపీవో ప్రేమయ్య మాట్లాడుతూ 6 రోజులుగా పెన్ డౌన్ కార్య క్రమం నిర్వహిస్తు నిరసన కార్యక్ర మాలు చేపడుతున్నమని, ప్రభుత్వం ఉద్యోగుల కు ఆగస్టు 15 లోపు పే స్కేల్ అమలు చేస్తూ తగిన ఉత్తర్వులు జారీ చేయాలని అన్నారు. గత మూడు నెల లుగా వేతనాలు విడుదల చేయకుం డా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఎస్ ఆర్ డి ఎస్ బోర్డు సమావేశంలో ఆమోదించిన అన్ని నిర్ణయాలను తక్షణమే అమలు చేయాలని కోరారు. రాష్ట్రజేఏసీ పిలుపు మేరకు నిరసన ప్రదర్శనలు, నల్ల బ్యాడ్జీ ల ధారణ, వినతి పత్రాల సమర్పణ వంటి దశల వారి కార్యక్రమాలు చేయడం జరిగిం దన్నారు. ఈనెల 15 వరకు ప్రభుత్వం నుండి సానుకూల నిర్ణయం రాకపోతే 16 నుండి ఆందోళ నలు మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్ర మం లో టెక్నికల్ అసిస్టెంట్లు సునీత, జాంబ, కరుణాకర్, పాల్గొన్నారు.


## అక్రమ ఓట్లను తొలగించాలి

- హైకోర్టును ఆశ్రయించిన ఆదివాసీ సేన



**మంగపేట, ఆగస్టు 06 (జనంసాక్షి) :** తెలంగాణలోని 5వ షెడ్యూల్డ్ (ఏజెన్సీ) ప్రాంతంలో చట్టాలకు విరుద్ధంగా ఓటు హక్కు నమోదు చేసుకున్న గిరిజనేతర అక్రమ ఓటర్లను తొలగించాలని కోరుతూ ఆదివాసి సేన రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేసింది. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ సర్ లో భాగంగా ఈ పిటీషన్‌ను దాఖలు చేయగా, గురువారం దీనిని విచారణకు స్వీకరించిన ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది అని ఆదివాసి సేన ములుగు డివిజన్ అధ్యక్షుడు పోలేబోయిన ఆదినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆదివాసి సేన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోవ దౌలత్ రావు మొకాశి, మడి సాయిబాబు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం వల్ల గిరిజనుల అభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలో స్వయం నిర్ణయాధికారాలు, లబ్ధిదారుల ఎంపికపై గిరిజనేతర అక్రమ ఓటర్లు తీవ్ర ప్రభావం చూపుతున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసించే గిరిజనేతరుల ఓట్ల నమోదుకు ఎలాంటి ప్రత్యేక ధృవీకరణ పత్రాలు లేవని, అందుకే దీనికోసం ఒక ప్రత్యేక మెకానిజం ను రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. రాజ్యాంగ బద్ధ చట్టాలను, గిరిజనుల హక్కులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నికల సంఘంలు స్పందించి కోర్టులో సరైన కౌంటర్ దాఖలు చేయాలని ఆదివాసి సేన ములుగు డివిజన్ అధ్యక్షుడు పోలేబోయిన ఆదినారాయణ తదితరులు కోరారు.

## సకినాల రాజేశ్వరికి కొండా లక్ష్మణ్ బాపూజీ' చేనేత అవార్డు



**బచ్చన్నపేట ఆగస్టు 6 ( జనం సాక్షి):** చేనేత రంగంలో విశేష నైపుణ్యం కనబరిచిన జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన యువ నేత కళాకారిణి సకినాల రాజేశ్వరి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక "శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర చేనేత అవార్డు" కు ఎంపికయ్యారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా ప్రాంగణంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో నేడు నిర్వహించే వేడుకల్లో ఆమె రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. అవార్డుకు ఎంపికైన సందర్భంగా సక్కినాల రాజేశ్వరి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పెర్నోడ్ రికార్డ్ ఇండియా ఫౌండేషన్ సీఎస్ఆర్ మద్దతుతో యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారి ద్వారా పొందిన ప్రీ-లూమ్ శిక్షణ నాలో నమ్మకాన్ని, నైపుణ్యాన్ని పెంచిందని ఆమె తెలిపారు. తక్కువ వయస్సులోనే రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైన సక్కినాల రాజేశ్వరిని బచ్చన్నపేట గ్రామస్తులు, చేనేత సంఘాల ప్రతినిధులు స్థానిక ప్రజలు అభినందించారు

## కేజీబీవీ ప్రహారీ పనులు వారంలోగా ప్రారంభించాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసిన ప్రహారీ నిర్మాణ పనులు ఇంకా ప్రారంభించకపోవడంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈ రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడి వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కూరగాయల నిల్వ, భోజనశాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఆహార నాణ్యత, అల్పాహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి తరగతి గదిని సందర్శించి విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. చదువుతో పాటు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. నల్గొండలో కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థిని అంజలిని అభినందించారు. చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని పేర్కొన్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, ఎంపీఓ తరుణ్ ప్రసాద్, పాఠశాల ఎస్ఓ ఈశ్వరి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# 15 వందల కోట్లతో అభివృద్ధి పనులు

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇండ్లు, సిసి రోడ్ల నిర్మాణాలు
- ఒక్క నమిలిగొండలోనే కోటి 50లక్షలతో సిసి రోడ్లు



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 05 (జనంసాక్షి) :** 1500కోట్లతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నా, గ్రామ గ్రామాన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే ప్రజా సంక్షేమ పథకాలు వారి కళ్ళకు కనిపించడం లేదని, కొంత మంది సిగ్గులేని సన్నాసులు కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే కరువు వచ్చింది అనే చౌకబారు విమర్శలు చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించా రు. మండలంలోని నమిలిగొండ కస్తూరిబా గాంధీ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన 2లక్షల 50వేలతో ఆర్ ఓ వాటర్ ప్లాంట్, లక్షా 50వేలతో హైమాస్ లైట్లను ప్రారంభించారు.అలాగే 40 లక్షల తో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులనిర్మాణాని కి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాసేపు ఉపాధ్యాయునిగా మారి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. అనంతరం పాఠ శాలకు నేను ఇచ్చిన హామీలను నెరవేర్చ నానని, ఉత్తమ ఫలితాలు సాధించి ఉపాధ్యాయులు, విద్యార్థులు మీ బాధ్యతలను నెరవేర్చాలని సూచించారు. అదేవిధంగా నమిలిగొండ గ్రామం లో 23 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణా నికి, కోటి రూపాయలతో నిర్మించనున్న కూడా రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి, గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధి దారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అప్పుల ఊబిలో ఉన్నప్పటికీ రైతు, మహిళా, పేద వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు కొంత మంది కళ్ళకు కనిపించడం లేదని అన్నారు. రాష్ట్రంలో 22వేల 500కోట్లతో అనేక పథకాలు పేద వర్గాల ప్రజలకు ఉపయోగ పడుతున్నాయని తెలిపారు. ఈ ఆగస్టు 15 నుండి రాష్ట్రంలో కొత్త వితంతు పెన్షన్లు మంజూరు కాబోతున్నాయని వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 1500 కోట్లతో అభి వృద్ధిపనులు జరుగుతున్నాయని నియోజకవర్గం లోని ఏ గ్రామానికి వెళ్లిన కాంగ్రెస్ ప్రభుత్వం కడి యం శ్రీహరి చేస్తున్న అభివృద్ధి పనులు జరుగు తున్నాయని తెలిపారు. ఒక్క నమిలిగొండ గ్రామం లోనే కోటి 50లక్షల సిసి రోడ్లు, గ్రామ పంచాయతీ భవనం, 30ఇందిరమ్మ ఇండ్లు, వివో భవనం, కమ్యూనిటీ హాల్లు మంజూరు చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, స్థానిక నమిలిగొండ సర్పంచ్ పురమాని కోమల ఐలోని, ఉప సర్పంచ్ మోటం రామకృష్ణ, మున్సి పల్ వైస్ చైర్పర్సన్ నీల రాజమ్మ గట్టయ్య, తిరు మల నాథ స్వామి దేవస్థానం చైర్మన్ నీల నరసిం హులు,పాముసూరు సర్పంచ్ సంపత్ రెడ్డి, తాహసిల్దార్ స్వప్న, ఎంపీడీవో విజయశ్రీ, ఆర్ ఐ లు శ్రీకాంత్, సతీష్, మాజీ ఎంపిటిసి పురమని రజాక్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షుడు జూలు కుంట్ల శిరీష్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజ్, నాయకులు బెలిదే వెంకన్న, రాజేష్ నాయక్, బూర్ల శంకర్, హరినాథ్, పొన్న రవి, సంపత్ రాజ్, గట్టు రమేష్, పోశాల కృష్ణమూర్తి, నాగరబోయిన శ్రీరాములు, రాపోలు శివ చరణ్ రెడ్డి, గాదె శ్రీధర్, సింగపురం వెంకటయ్య, చింత ఎల్లయ్య,వివిధ గ్రామాలసర్పంచులు, కౌన్సిలర్లు, వివిధశాఖల అధికారులు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతి

- హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి.
- పూలమాలలు వేసిన ఇన్చార్జి కలెక్టర్ రవి, డిఆర్వో శ్రీనివాస్, అధికారులు



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 6 (జనం సాక్షి) :** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆలోచనలు, ఆశయాలు స్ఫూర్తిదాయకం అని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ చిత్రపటానికి జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్, ఇతర అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఊదారని, ప్రొఫెసర్ జయశంకర్ అధికారికంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఉద్యమాల వెనుక మేధావుల పాత్ర ప్రధానంగా ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఎన్నో ఉద్యమాలలో ఉపాధ్యాయులు పాత్ర, సైద్ధాంతిక మార్గదర్శకం ద్వారా విజయవంతం అయ్యాయని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో విలీనం అయిన తర్వాత తెలంగాణ ప్రాంత వెనుక బాటుతనాన్ని 1952లోనే గుర్తించి 1969 లో వచ్చిన తొలి దశ తెలంగాణ ఉద్యమంలో, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆచార్య జయశంకర్ క్రియాశీలక పాత్రను పోషించారని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి శ్వాసగా నిలిచి, తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకోవడంలో ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సేవలు మనకెంతో స్ఫూర్తిదాయకమన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధి పథంలో ఉద్యోగులు మరింత కష్టపడి పనిచేయాల్సి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయం, తదితర అంశాల్లో మిగతా రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు చేయూతనందిస్తూ ఆచార్య జయశంకర్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని, రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు ముఖ్యపాత్ర వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో డిఆర్డిఓ మేన శ్రీను, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**హనుమకొండ ప్రతినిధి / దామెర ఆగస్టు 6 (జనం సాక్షి) :** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భద్రత త్రివర్ణం సైబర్ స్వతంత్ర తెలంగాణ కార్యక్రమంలో భాగంగా గురువారం దామెర మండలం ఊరుగొండ గ్రామంలోని రైతు వేదికలో సైబర్ అవగాహన సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో దామెర పోలీస్ స్టేషన్ ఎస్సై వీర భద్రరావు గ్రామంలోని డ్వాక్రా మహిళలు, విద్యార్థులతో సమావేశమై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైనట్లయితే వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 150 మంది గ్రామస్థులు, మహిళలు,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 06 (జనంసాక్షి) :** జిల్లాలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలం కోసిని గ్రామ శివారులో గల 79, 80 సర్వే నెంబర్లలో గల ప్రభుత్వ భూమిని కాగజ్ నగర్ రాజస్వ అధికారి చెన్నూరి కిష్టయ్య, రెవిన్యూ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు కాపు వాడలో ఓ వ్యక్తి రహదారిని ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్నాడని, ఓ వెంచర్ లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ప్లాట్లు చేశారని వచ్చిన ఆరోపణలపై అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, రెవెన్యూ, అధికారులు పాల్గొన్నారు.

## పాలనలో సాంకేతికను అంది పుచ్చుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా




**మావల ఆగస్ట్ 07(జనం సాక్షి):** దైనందిన విధుల్లో ఎదురయ్యే సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలను అన్వేషిస్తూ, సృజనాత్మక ఆలోచనలతో పాలనలో సాంకేతికత నాణ్యతను పెంచాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో అధికారులకు ప్రత్యేక సామర్థ్య పెంపు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ అధికారులు సాంకేతిక ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించే సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా మార్చడానికి నూతన ఆలోచనలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి శాఖలోనూ సమస్యల పరిష్కారానికి వినూత్న మార్గాలను అన్వేషించాలని, తద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టిజిఐసి ప్రతినిధులు వేర్వేరు రంగాల్లో సాధించిన నూతన ఆవిష్కరణలు, వినూత్న పనితీరు విధానాలను ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో జడ్పీ సీఈఓ రవి, డిఆర్‌డిఓ రవీందర్, డిపిఓ రమేష్, టీ-హబ్ మేనేజర్ అంకిత, జిల్లా కోఆర్డినేటర్ నిఖిని వర్మ, ఈడిఎం రవి, టీ-వర్క్స్ అసోసియేట్ అరవింద్, జైకా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీ, అగ్‌హబ్ మేనేజర్ ముకేశ్, టీజీఐసీ కమ్యూనికేషన్స్ లీడ్ సాహిల్, గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ లీడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- 12వ తేదీలోపు అన్ని పనులు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, ఆగస్టు 06(జనంసాక్షి) :** ములుగు జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని,12వ తేదీ లోపు అన్ని పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటించనున్న సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ముఖ్య మంత్రి పర్యటన లో అధికారులు అప్రమత్తంగా ఉండి అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. పైలాన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. నూతన కలెక్టరేట్ కార్యాలయంలో ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్, సమావేశ మందిరం, మంత్రివర్గ గది, అదనపు కలెక్టర్ల చాంబర్ల లో అవసరమైన అన్ని సదుపాయాలతో సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆగస్టు 12వ తేదీలోపు అన్ని పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మేడారం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నటువంటి హెలిప్యాడ్ ల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతులు, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. వీఐపీల బస కోసం ప్రత్యేక అతిథి గృహాలను సిద్ధం చేయడంతో పాటు, ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకునే సందర్భంగా పూజా కార్యక్రమాలు, శేష వస్త్రాల సమర్పణ, ఆశీర్వచనాల ఏర్పాట్లు, ఆలయ పరిసరాల పరిశుభ్రత, అవసరమైన సౌకర్యాలను ముందుగానే పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. వైద్య శాఖ అన్ని అత్యవసర సదుపాయాలతో సిద్ధంగా ఉండాలని, అవసరమైన మందులు, వైద్య బృందాలు, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని సూచించారు. హెలిప్యాడ్ ప్రాంతంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది, వాహనాలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, శాఖల మధ్య సమన్వయం లోపించకుండా చూడాలని సూచించారు. అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వర్తించి, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమీక్షించి, ఆగస్టు 12వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, స్థానిక సంస్థలు సంపత్ రావు,ఆర్డీవో కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, ఎస్డిసి ప్రతాప్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కుషీల్ వంశీ, ఆర్డీవో కృష్ణవేణి, డి ఎస్పీ రవీందర్, జిల్లా అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6 (జనం సాక్షి) :** ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను ఆచరణలో పెట్టి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం నిరంతర పోరాటం చేసిన గొప్ప మేధావి, విద్యావేత్త, ఉద్యమకారుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. సమాజ అభివృద్ధి, విద్యా వికాసం, సామాజిక న్యాయం, ప్రాంతీయ సమానత్వం కోసం ఆచార్య జయశంకర్ చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనబెట్టి ప్రజల ఆకాంక్షల సాధనకే తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తిత్వమని తెలిపారు. ఆచార్య జయశంకర్ చూపిన మార్గంలో నడుస్తూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, జిల్లా రెవెన్యూ అధికారి పాండు, బీసీ వెల్ఫేర్ అధికారి నరసయ్య, టీఎన్జీవో అధ్యక్షుడు నారాల వెంకట్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ఫిజియో అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, కార్యదర్శి సాయి రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధిపతులు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హరీష్‌రావుపై వ్యాఖ్యలు దారుణం

- కాంగ్రెస్ నేతల ఆరోపణలు అవివేకానికి నిదర్శనం
- ఎమ్మెల్యే మాణిక్‌రావు



**జహీరాబాద్, ఆగస్టు 6 (జనం సాక్షి) :** మాజీ మంత్రి హరీష్‌రావుపై పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ చేసిన వ్యాఖ్యలను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు తీవ్రంగా ఖండించారు. గురువారం జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి హరీష్‌రావుపై కాంగ్రెస్ నాయకులు క్షుద్రపూజలు చేశారంటూ నిరాధార ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ప్రపంచం ముందుకు సాగుతున్న ఈ కాలంలో క్షుద్రపూజల పేరుతో ఆరోపణలు చేయడం కాంగ్రెస్ నాయకుల అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి ఆధారరహిత ఆరోపణలు చేస్తోందని ఆరోపించారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే కాంగ్రెస్ నేతలు రాజకీయ విమర్శలకు దిగుతున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం రాజకీయ ఆరోపణలతో కాలక్షేపం చేయడం తగదని ఎమ్మెల్యే మాణిక్‌రావు హితవు పలికారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు.

## భవాని మందిర్ రోడ్ విస్తరణకు అడుగులు

- ఆస్తి యజమానులకు మున్సిపల్ అధికారుల నోటీసులు
- ప్రజాహితంలో సహకరించాలని కమిషనర్ ప్రభాకర్ విజ్ఞప్తి



**జహీరాబాద్, ఆగస్టు 6 (జనం సాక్షి) :** పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు భవాని మందిర్ రోడ్ విస్తరణ పనులను మున్సిపాలిటీ వేగవంతం చేసింది. ఆమోదిత మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా గురువారం మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది రహదారి వెంట ఉన్న ఆస్తులను పరిశీలించి సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశారు. కమిషనర్ జి. ప్రభాకర్ మాట్లాడుతూ, పట్టణ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారి విస్తరణ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజాహితాన్ని దృష్టిలో పెట్టుకుని చేపడుతున్న ఈ పనులకు ఆస్తి యజమానులందరూ సహకరించాలని కోరారు. నోటీసుల్లో పేర్కొన్న సూచనలను పాటించి స్వచ్ఛందంగా సహకరిస్తే పనులు సకాలంలో పూర్తవుతాయని తెలిపారు. రహదారి విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన రాకపోకల సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

# సౌభాగ్యతో 5.15 లక్షల కుటుంబాలకు విద్యుత్

- దేశవ్యాప్తంగా 2.86 కోట్ల కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు
- లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రామసహాయం
- రఘురాం రెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



**ఖమ్మం, ఆగస్టు 6 (జనం సాక్షి) :** ప్రధాన మంత్రి సహజ్ బిజ్లీ హర్ ఘర్ యోజన (సౌభాగ్య) పథకం ద్వారా దేశవ్యాప్తంగా 2,86,13,424 కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు కల్పించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో తెలంగాణలో 5,15,084 కుటుంబాలకు విద్యుత్ అందించామని పేర్కొంది. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కృషితో 24 గంటల విద్యుత్‌లో దేశంలోనే ముందంజ**

2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో దేశవ్యాప్తంగా రోజుకు సగటున 22.36 గంటలు విద్యుత్ సరఫరా జరుగుతుండగా, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక కృషితో ఇక్కడ 24 గంటలు విద్యుత్ అందుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. విద్యుత్ పంపిణీ బాధ్యత రాష్ట్రాల పరిధిలోనే ఉంటుందని, విద్యుత్ వినియోగదారులకు 24ఇ7 సరఫరా లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొంది.

**పీవీటీజీ గృహాలకు విద్యుదీకరణ పూర్తి**

రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (=ఞూూ)లోని పీఎం-జన్‌మన్ కార్యక్రమం కింద తెలంగాణలో 3,884 పీవీటీజీ గృహాలకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయగా, అన్ని గృహాలకు విద్యుదీకరణ పూర్తయినట్లు కేంద్రం తెలిపింది. ఇందుకోసం రూ.6.79 కోట్ల వ్యయానికి ఆమోదం లభించగా, రూ.4.07 కోట్ల కేంద్ర బడ్జెట్ సాయం మంజూరై, రూ.2.07 కోట్లు విడుదలయ్యాయని వివరించారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 6 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణంతోపాటు ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పలు శాఖల అధికారులతో వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ మండలాల వారీగా పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు, ప్రహరీలు, మరమ్మత్తుల పనుల పురోగతిపై సమీక్షించారు. పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేసినప్పటికీ సకాలంలో పనులు పూర్తి చేయడంలో అలసత్వం చూపడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, పంట కుంటల నిర్మాణాలను చేపట్టాలని, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలు, ప్లాస్టిక్ వేస్టేజ్ మేనేజ్మెంట్‌పై దృష్టి సారించాలన్నారు. వనమహోత్సవం లక్ష్యాలకు అనుగుణంగా ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మొక్కలను నాటాలని సూచించారు. మండల స్థాయిలోనూ త్వరలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నందున సంబంధిత శాఖల అధికారులందరూ హాజరయ్యేలా చూడాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, డీఈ లక్ష్మణ్, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపిఓలు, ఎంఈఓలు, పిఆర్ ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే మాణిక్ రావు



**జహీరాబాద్, ఆగస్టు 6 (జనం సాక్షి) :** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను భావితరాలకు చేరవేసి, వాటి సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం చేసిన త్యాగాలు, ఉద్యమానికి అందించిన సిద్ధాంతపరమైన బలం చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ సమాజం ఆయన సేవలను ఎన్నటికీ మరువదని పేర్కొన్నారు. యువత ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ యూనుస్, కమిషనర్ ప్రభాకర్, కౌన్సిలర్లు, సిబ్బంది జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీవో కార్యాలయంలో వంశీ కార్యాలయ సిబ్బంది, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ దశరథ్ సిబ్బందితో కలిసి జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై వ్యవసాయ శాఖ ఆకస్మిక తనిఖీలు

- నిబంధనలు పాటించని దుకాణాలకు నోటీసులు
- ఈ-పాస్ ద్వారా విక్రయాలు, రైతులకు బిల్లులు తప్పనిసరి



**గట్టు, ఆగస్టు 6 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని ఆలూరు గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా రైతులకు ఎరువులను తప్పనిసరిగా ఈ-పాస్ యంత్రం ద్వారా మాత్రమే విక్రయించాలని, విక్రయించిన ప్రతి ఎరువు, పురుగుమందుకు వెంటనే బిల్లు జారీ చేయాలని దుకాణదారులకు సూచించారు. కాలం చెందిన ఎరువులు లేదా పురుగుమందులను దుకాణాల్లో నిల్వ ఉంచితే వ్యవసాయ శాఖ నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. తనిఖీలలో కొన్ని దుకాణాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం గుర్తించి, సంబంధిత దుకాణదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో గద్వాల డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రతాప్ కుమార్, గట్టు మండల వ్యవసాయ అధికారి హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ జీవితం స్ఫూర్తిదాయకం

- సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం



**చేర్యాల, ఆగస్టు 6 (జనంసాక్షి) :** ప్రొఫెసర్ జయశంకర్ సార్ జీవితం స్ఫూర్తిదాయకమని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు. గురువారం చేర్యాల పట్టణంలోని స్థానిక గ్రంథాలయంలో కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జయశంకర్ యాదిలో గ్రంథాలయం ఆవరణంలో పూల మొక్కలు నాటారు. గ్రంథాలయాని కొన్ని ఏళ్ళుగా కరెంటు సరఫరా లేనందున స్తంభాలు వేసి విద్యుత్ కనెక్షన్ కు సహకరించిన చేర్యాల విద్యుత్ ఏడి వెంకన్న గౌడ్ ను చైర్మన్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగరావు, స్థానిక కౌన్సిలర్ వెలగల దుర్గయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఖాజా, గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగుల వెంకటేశం, బింగి శ్రీనివాస్, బుట్టి యాదగిరి, అమ్లి పూర్ సురేష్, గ్రంథాలయ ఇంచార్జి కనక లక్ష్మి, సిబ్బంది, పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవానికి ఆచార్య జయశంకర్ చిరస్మరణీయ స్ఫూర్తి



**మెదక్ టౌన్, ఆగస్టు 6 (జనం సాక్షి) :** తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా, ప్రత్యేక రాష్ట్ర సాధనకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఎల్లప్పుడూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే తన శ్వాసగా, ఆశయంగా భావించి జీవితాంతం ఉద్యమానికి అంకితభావంతో పోరాడిన మహోన్నత వ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక దిశానిర్దేశం చేసి, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహామేధావిగా జయశంకర్ సార్ చిరస్థాయిగా గుర్తుండిపోతారని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, రచనలు నేటి యువతకు మార్గదర్శకమని, విద్య, జ్ఞానం, సామాజిక చైతన్యంతో సమాజాభివృద్ధికి కృషి చేయాలన్న ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ చరిత్రలో ఆచార్య జయశంకర్ పోషించిన పాత్ర అపూర్వమని, ఆయన చూపిన మార్గం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని సుహాసిని రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొని ఆచార్య జయశంకర్‌కు ఘన నివాళులర్పించారు.

## కేసుల పరిష్కారంలో సాంకేతిక పరిజ్ఞానం కీలకం


- డిఐజిఎల్ఎస్ చౌహాన్



**వడ్డేపల్లి, ఆగస్టు 6 (జనం సాక్షి) :** కేసుల పరిష్కారంలో నేరగాళ్లను పట్టుకోవడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చాలా కీలకమైందని జోగులాంబ జోన్ డిఐజి ఎల్ ఎస్ చౌహాన్ అన్నారు గురువారం గద్వాల జిల్లాలోని శాంతినగర్ పోలీస్ స్టేషన్ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన తనిఖీ చేశారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి శ్రీనివాసరావు, శాంతినగర్ సర్కిల్ సిఐ శంకర్, ఎస్సై నాగ శేఖర్ రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు ఈ సందర్భంగా శాంతి నగర్ పోలీస్ స్టేషన్ లోని పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ అనగానే కేసుల నిర్వహణ మాత్రమే కాదని పచ్చని చెట్లు పరిశుభ్రమైన పరిసరాలు ఆహ్లాద కరమైన వాతావరణముతో విధులు నిర్వహించాలని అన్నారు రౌడీషీటర్ల పై నిత్యం పర్యవేక్షణ ఉండాలని ఆస్తి సంబంధిత నేరాలు జరిగే ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ నేరాలను అదుపు చేయడంతో పాటు కేసుల పురోగతిని సాధించాలని దానికోసం సిబ్బంది నిరంతరం కొత్త విషయాలు తెలుసుకుంటూ ఉండాలని అన్నారు 112 కు వచ్చే ప్రతి కాల్ స్పందించాలని ప్రతి బాధితుడికి న్యాయం చేసేలాగా కృషి చేయాలని అన్నారు వచ్చే ప్రతి ఫిర్యాదు పై సమగ్రమైన విచారణ చేపట్టాలని బాధితులకు న్యాయం జరిగే విధంగా దర్యాప్తును వేగవంతం చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు సమాజంలో జరిగే ప్రతి అంశంపై పోలీసులకు సమాచారం రావడంతో పాటు వీలైనంత వేగంగా అక్కడికి చేరుకొని బాధితులకు న్యాయం చేస్తూ శాంతి భద్రతలను పరిరక్షించాలని సూచించారు.

# యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే బాధ్యత

- మెగా జాబ్ మేళాతో 2 వేలకు పైగా ఉద్యోగాలు
- నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి
- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ వెల్లడి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6 (జనం సాక్షి) :** యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రజాప్రతినిధిగా నా బాధ్యత అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీన జిల్లా కేంద్రంలోని ఆర్మూర్ రోడ్ లో గల శ్రీరామ గార్డెన్ లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో 60 కి పైగా ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రధానంగా 2 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశ్రమలకు నిరుద్యోగులకు మధ్య వారధిగా నిలిచి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకే ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. నిజామాబాద్ యువతలో ఎంతో ప్రతిభ ఉందని, వారికి సరైన మార్గదర్శనం అందించడం తన బాధ్యత అని పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్ బెంగళూరు వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించేందుకు ప్రముఖ కంపెనీలను నేరుగా ఇందూరుకు తీసుకురావడం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి అభ్యర్థి బయోడేటా విద్యార్హతల ధ్రువపత్రాల ప్రతులు, ఆధార్ కార్డు పాస్పోర్ట్ సైజు ఫోటోలతో ఉదయం 9 గంటల నుంచి హాజరుకావాలని కోరారు. అలాగే జాబ్ మేళా కు సహకరిస్తున్న కంపెనీలు, వాలంటీర్లు, భాగస్వామ్య సంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు

**ముంబయి (జనంసాక్షి) :** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం పెట్టుబడిదారుల సెంటిమెంట్‌కు ఊతమిచ్చింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, రసాయన రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు పైకి ఎగిశాయి. సెన్సెక్స్ (ూవఅంవఇ) 374 పాయింట్లు లాభపడి 78,954.76 వద్ద ముగిసింది. నిఫ్టీ (చీఅట్‌ఎ) 11.35 పాయింట్లు పెరిగి 24,636 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారత్ ఎలక్ట్రానిక్స్ అత్యధిక లాభాలు నమోదు చేశాయి. మరోవైపు రియల్టీ, మీడియా, ఆటో రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మిడ్‌క్యాప్ సూచీ 0.44 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.48 శాతం లాభపడింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రసాయన రంగ షేర్లు మాత్రం మార్కెట్ కంటే మెరుగైన ప్రదర్శన కనబర్చాయి.

ముడి చమురు ధరలు తగ్గడం భారత్‌కు అనుకూల పరిణామమని మార్కెట్ నిపుణులు అంటున్నారు. దిగుమతి వ్యయం తగ్గడంతోపాటు ద్రవ్యోల్బణ ఒత్తిడి కూడా తగ్గే అవకాశం ఉండటంతో మార్కెట్ సెంటిమెంట్‌కు ఇది మద్దతుగా నిలిచిందని విశ్లేషిస్తున్నారు.

# రాష్ట్రపతి అంగీకారం తర్వాతే..

- యూపీఐ లావాదేవీల చార్జీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం




**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007, సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోద ముద్ర వేసింది. ఎలాంటి చర్చ లేకుండానే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్స్ ఛార్జీలు విధించేందుకు ఈ చట్టం అవకాశం కల్పిస్తుంది. దీని ద్వారా ఇప్పటివరకు యూపీఐ, ఇతర ఎలక్ట్రానిక్ పేమెంట్లపై వ్యాపారులకు బ్యాంకులు అందిస్తున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) రద్దవుతుంది. ఇంతకుముందు ఆర్టీజీఎస్, నెఫ్ట్ లావాదేవీలపైనే ఛార్జీలు ఉండేవి.

యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు లేవు. కానీ, ఇకపై యూపీఐ ట్రాన్సాక్షన్స్‌పై కూడా ఛార్జీలు విధిస్తారు. టాక్సేషన్ అండ్ అదర్ లాస్ (అమెండ్‌మెంట్) బిల్, 2026 పేరిట రూపొందిన ఈ బిల్లును కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు కోసం పేమెంట్స్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007 బిల్లు, ద ఇన్‌కం ట్యాక్స్ యాక్ట్ 2025 బిల్లు, ద ఫైనాన్స్ యాక్ట్, 2026 బిల్లులకు సవరణలు చేశారు. దీని ద్వారా భవిష్యత్‌లో ఎలక్ట్రానిక్ పేమెంట్లపై ఛార్జీలు వసూలు చేస్తారు. ఏ తరహా పేమెంట్‌పై ఎంత ఛార్జీ అనేది నోటిఫికేషన్ ద్వారా ప్రకటిస్తారు. బ్యాంకులకు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్స్‌కు, పేమెంట్స్ విధానాన్ని నిర్వహించే సంస్థలకు స్థిరమైన ఆదాయం అందాలనే ఉద్దేశంతో ఈ చట్టం తీసుకొచ్చినట్లు కేంద్రం తెలిపింది. ప్రస్తుతం క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపులకు మాత్రమే వ్యాపార సంస్థలు పరిమిత ఫీజు చెల్లిస్తున్నాయి. యూపీఐ లావాదేవీలపై వ్యాపార సంస్థలు ఎలాంటి ఛార్జీలు లేవు.

కానీ, కొత్త చట్టం ద్వారా యూపీఐ లావాదేవీలపై కూడా వ్యాపారులు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ కొత్త చట్టం ఇప్పటికిప్పుడు అమలులోకి రాకపోవచ్చు. దీనికి సంబంధించిన నిబంధనలపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం ప్రకారం.. ఈ ఛార్జీలు వినియోగదారులు చెల్లించాల్సిన అవసరం లేదు. వ్యాపారులే చెల్లించాలి. అది కూడా వార్షిక టర్నోవర్ రూ.1.5 కోట్లు దాటిన వ్యాపారులు మాత్రమే స్వల్ప మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఇక, ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందాలి. తర్వాత రాష్ట్రపతి అంగీకారం తెలపాలి. ఆ తర్వాత ఈ బిల్లు చట్టంగా అమలులోకి వస్తుంది. దీనికి మరికొంత సమయం పడుతుంది.




## సుందరగిరిలో రోడ్డు విస్తరణ పనులపై స్టేటస్ కో

- హైకోర్టులో ఇళ్లు కోల్పోతున్న బాధితుల పిటిషన్
- హైకోర్టు ద్వారా తాత్కాలిక ఉపశమనం




**కరీంనగర్, ఆగస్ట్6 (జనంసాక్షి) :** చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న బాధిత కుటుంబాలు హైకోర్టును ఆశ్రయించాయి. దీంతో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బాధిత కుటుంబాలు బైపాస్ నుండి రహదారిని ఏర్పాటు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేయగా బాధిత కుటుంబాలకు యథాస్థితిని కొనసాగించాలని ఆదేశిస్తూ హైకోర్టు తాత్కాలిక ఉపశమనం కల్పించింది. తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి నుండి హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులలో భాగంగా మొదటి విడతగా హుస్నాబాద్ నుండి సుందరగిరి వరకు ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా సుందరగిరిలో బాధితులు 11 మంది దాఖలు చేసిన రెడ్ పిటిషన్ పై ఆగస్టు 4న విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరపల్లి నంద 11 మందికి చెందిన ఆస్తులపై ప్రస్తుతం ఉన్న పరిస్థితి కొనసాగించాలని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పిటిషన్ దారులకు హైకోర్టు తాత్కాలిక ఊరట కల్పించింది. గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ కు ఎలాంటి అధికారాలు ఉన్నాయని, గ్రామ ప్రజలకు నోటీసులు జారీ చేశారని, అధికారులు చట్టపరమైన ప్రక్రియ అనుసరించకుండా అభ్యంతరాలను పరిగణంలోకి తీసుకోకుండా భవిష్యత్‌లో నాలుగు వరసలు, ఆరు వరుసల రహదారి నిర్మాణం బైపాస్ ద్వారా రోడ్డు నిర్మిస్తే బాగుంటుందనే ఆలోచన లేకుండా నష్టపరిహారం చెల్లించకుండా రోడ్డు విస్తరణ పేరుతో ఆస్తులపై చర్యకు సిద్ధమవుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు పిటిషన్ల తరపున న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టు 11కు వాయిదా పడింది.

# సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

- నైనీ గనుల నుంచి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గురాక
- జైపూర్ వద్ద రైలుకు స్వాగతం పలికిన అధికారులు
- బొగ్గు రాకపై డిప్యూటీ సిఎం భట్టి ఆనందం





**మంచిర్యాల, ఆగస్ట్6 (జనంసాక్షి) :** సింగరేణి చరిత్రలో మరో మైలురాయి చేరింది. ఒడిశాలోని సింగరేణి నైనీ గని నుంచి తొలి బొగ్గు రైల్వే వ్యాగన్ తెలంగాణకు చేరింది. మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి బొగ్గు రైలు చేరుకుంది. సింగరేణి అధికారులు రైలుకు ఘన స్వాగతం పలికారు. 59 వ్యాగన్ల ద్వారా 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు వచ్చింది. ఈసందర్భంగా సింగరేణి యాజమాన్యం, కార్మికులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి చరిత్రలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైందన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి బొగ్గు చేరుకుంది. ఈ పరిణామపం పట్ల తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. గురువారం ఈ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు నైనీ బ్లాక్ నుంచి బొగ్గు లోడ్‌తో రైల్వే వ్యాగన్ వచ్చింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. దేశ అవసరాలకూ సింగరేణి బొగ్గు కీలకమని గుర్తు చేశారు. కొత్త కోల్ బ్లాకుల కోసం ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. సింగరేణిని కాపాడుకుంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నైనీ గనుల నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు ఆ కొరత తీరిందని వివరించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి రైలు వ్యాగిన్ చేరుకోగానే.. ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. 9 బాక్స్ వ్యాగన్లలో మొత్తం 4,000 టన్నుల జీ-10 రకం బొగ్గు ఒడిశాలోని నైనీ గని నుంచి గురువారం ఉదయం జైపూర్‌కు చేరుకుంది. సింగరేణి కాలరీస్ నుంచి 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రాష్ట్రం వెలుపల ఉన్న గని నుంచి బొగ్గు ఉత్పత్తిని సాధించి సొంత థర్మల్ ప్లాంట్‌కు రవాణా చేయడం ఇదే తొలిసారి. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం వెనుక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అలుపెరగని కృషి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. అనుమతుల సాధనలో ఎదురైన ఎన్నో అడ్డంకులను పటాపంచలు చేస్తూ ఈ విజయా న్ని సొంతం చేసుకున్నారని పేర్కొంది. అనుమతుల కోసం భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఒడిశా ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి, ఆటంకాలన్నీ తొలగించారని సర్కార్ స్పష్టం చేసింది. అనంతరం 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్ విధానంలో డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఆ శ్రమ ఫలితంగా నైనీ గని నుంచి బయలుదేరిన తొలి రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా ఏకంగా 4 వేల టన్నుల అత్యుత్తమ జీ-10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరింది. కేంద్ర బొగ్గు శాఖ 2015 ఆగస్టు 13న సింగరేణికి కేటాయించిన ఈ నైనీ గని, మొత్తం 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ గని జీవితకాలం 36 సంవత్సరాలు కాగా, ఏడాదికి కోటి టన్నుల (10 మిలియన్ టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో నడవనుంది. నైనీ నుంచి నాణ్యమైన బొగ్గు రాకతో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిలో ఇకపై ఎలాంటి ఆటంకాలు ఉండవని, భవిష్యత్తు తరాలకు నిరంతర ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని స్పష్టమవు తోంది. సింగరేణి కీర్తి కిరీటంలో ఈ నైనీ బొగ్గు గని మరో వజ్రంగా నిలిచిపోనుంది.

## వివాహ రద్దు ఫత్వాలు చెల్లవు

- మతపరమైన కమిటీలకు అధికారం లేదు
- మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు



**భోపాల్, ఆగస్ట్6 (జనంసాక్షి) :** మసీదు కమిటీ ఫత్వాపై మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివాహాన్ని రద్దు చేసే అధికారం ఏ మతపరమైన సంస్థలు, కమిటీలు, లేదా సెమినరీలకు లేదని స్పష్టం చేసింది. కేవలం మసీదు కమిటీ జారీ చేసిన ఫత్వా ఆధారంగా వివాహ బంధం రద్దు అయినట్లు పరిగణించలేమని తేల్చిచెప్పింది. చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించి రాజ్యాంగబద్ధమైన ఫ్యామిలీ కోర్టుల ద్వారానే విడాకులు పొందాల్సి ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా జస్టిస్ వివేక్ జైన్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా భోపాల్ 'దారుల్-దఫా మసాజిద్ కమిటీ' జారీ చేసిన ఫత్వా ఆధారంగా తన వివాహ బంధం రద్దు అయినట్లు ప్రకటించాలని కోరిన ఓ భర్త అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది. ఫత్వాకు స్వతంత్రంగా చట్టపరమైన గుర్తింపు లేదని, అది కోర్టు తీర్పునకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసింది. వివాహ రద్దు వంటి అంశాల్లో తుది నిర్ణయం తీసుకునే అధికారం కేవలం కోర్టులకే ఉంటుందని వెల్లడించింది. అయితే, విడాకులు కోరే వ్యక్తికి చట్టప్రకారం సంబంధిత ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించి విడాకులు పొందే హక్కు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. వివాహ రద్దు పిటిషన్ దాఖలు చేస్తే, కోర్టు నిబంధనల ప్రకారం విచారిస్తుందని పేర్కొంది. కాగా, ఈ తీర్పు మతపరమైన ఫత్వాల చట్టబద్ధత, వివాహ రద్దు ప్రక్రియపై కీలకమైన స్పష్టతను ఇచ్చిందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## బయోగ్యాస్ ఉత్పత్తికి ప్రోత్సాహం

- రూ.23,731 కోట్ల 'గోబర్ధన్ పథకం
- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ, ఆగస్ట్6 (జనంసాక్షి) :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం కేంద్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు ప్రధాని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్‌లో ప్రధాని మోదీ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బయోగ్యాస్ ఉత్పత్తిని ప్రోత్సహించాలని నిర్ణయించారు. రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2026-27 నుంచి 2035-36 వరకు కేంద్రం అమలు చేయనుంది. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, సేంద్రీయ వ్యర్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ (అఃఉ) ఉత్పత్తి చేయనుంది. దేశీయ అఃఉ ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే లక్ష్యమని కేంద్ర మంత్రులు తెలిపారు. దిగుమతి సహజవాయువుపై ఆధారాన్ని తగ్గించి ఇంధన భద్రతకు బలం చేకూర్చనుందని వెల్లడించారు. రైతులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, సహకార సంఘాలకు కొత్త ఆదాయ అవకాశాలు వస్తాయని మంత్రులు పేర్కొన్నారు. అస్సాంలో నాలుగు లేన్ల నేషనల్ హైవేకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ.8,970 కోట్లతో అస్సాంలో నేషనల్ హైవే నిర్మించాలని మంత్రులు ఆమోదించారు.




## సేంద్రీయ సాగుకు ప్రోత్సాహం

- పంట మార్పిడిపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 6 (జనంసాక్షి) :** రాష్ట్రంలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రాధాన్యంగా ప్రోత్సహిస్తోందని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. నిర్మల్ కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ సాగు, పంట మార్పిడి విధానాలపై దృష్టి సారించాలని సూచించారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో వరి, మొక్కజొన్న, జొన్న, సోయా, కందులు వంటి పంటలతో పాటు ఆయిల్‌పామ్, పసుపు, ఉద్యానవన పంటల సాగు గణనీయంగా పెరుగుతోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు అవుతున్నాయని, ఈ ఏడాది ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని అధిగమించినట్లు తెలిపారు. రెవెన్యూ మ్యాపులు లేని గ్రామాల్లో భూ సర్వేలు వేగంగా కొనసాగుతున్నాయని, భూభారతి దరఖాస్తులను సకాలంలో పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కమిషన్ సభ్యులు, అదనపు కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో గ్యాంగ్‌స్టర్ అతీక్ కొడుకు దుర్మరణం

- వేగంగా కారు డివైదర్‌నుఢీకొనడంతో ప్రమాదం

**లక్నో, ఆగస్ట్6 (జనంసాక్షి) :** ఉత్తర్‌ప్రదేశ్ గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ చిన్నకొడుకు అబన్ అహ్మద్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. జైల్లో ఉన్న తన సోదరుడిని కలిసేందుకు వెళ్తుండగా.. ఝాన్సీ ప్రాంతంలో హైవేపై అతడు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో వాహనంలో అబన్ తో పాటు మరో నలుగురు వ్యక్తులు ఉన్నారు. ప్రమాద తీవ్రతకు కారు ముందుభాగం నుజ్జునుజ్జ య్యింది. అబన్‌తో పాటు మరో వ్యక్తి కూడా మృతి చెందారు. అతి వేగమే ఘటనకు కారణమని పోలీసులు ప్రాథమికంగా వెల్లడించారు. గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపీ అతీక్ అహ్మద్‌పై దోపిడీ, కిడ్నాప్, హత్య కేసులు ఉన్నాయి. బీఎస్పీ ఎమ్మెల్యే రాజుపాల్ హత్య కేసులో కీలక సాక్షి అయిన ఉమేశ్ పాల్‌ను హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఓ కేసులో జైల్లో ఉన్న అతీక్, అతడి సోదరుడిని 2023 ఏప్రిల్‌లో పోలీసులు వైద్య పరీక్షలకు తీసుకెళ్తుండగా.. ముగ్గురు దుండగులు వారిని కాల్చిచంపారు. కాగా.. పాల్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న అతీక్ మూడో కుమారుడు అసద్ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఇక, అతీక్ మరో ఇద్దరు కుమారులు మహమ్మద్ ఉమర్, మహమ్మద్ అలీ ఇతర కేసుల్లో జైల్లో ఉన్నారు. ఉమేశ్ పాల్ హత్య కుట్రలో సంబంధం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న అతీక్ భార్య పర్వీన్ పరారీలో ఉంది. ఇప్పుడు అబన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఒకప్పుడు ఈ గ్యాంగ్‌స్టర్ కుటుంబం తూర్పు ఉత్తర్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలను నియంత్రించింది.

## పదవుల భర్తీలో కాంగ్రెస్ తీరు సరిగా లేదు

- పెదవి విరిచిన ఎమ్మెల్సీ కోదండరామ్



**హైదరాబాద్, ఆగస్ట్6 (జనంసాక్షి) :** పదవుల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి సరిగా లేదని ఎమ్మెల్సీ కోదండరాం పెదవి విరిచారు. పదవుల భర్తీ ఆలస్యం చేయడం వల్ల కలిగే ప్రయోజనం లేదన్నారు. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ సిద్దాంతకర్త ప్రొ. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల అంశంలో బీఆర్ఎస్ హయాంలో కంటే ఈ ప్రభుత్వంలో స్పందన బాగుందని రేవంత్ రెడ్డి సర్కారును ప్రశంసించారు. ప్రభుత్వంలో తమ భాగస్వామ్యంపై సంప్రదింపులు చేస్తున్నామని వివరించారు. మాకు ఎమ్మెల్సీ, కార్పోరేషన్ చైర్మన్లు ఇస్తామన్నారని గుర్తు చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ అంశంపై చర్చిస్తున్నామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఖరితో ఈ ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత జయశంకర్ సర్ అని విద్యార్థులే ప్రకటించుకున్నారని ఎమ్మెల్సీ కోదండరాం వివరించారు.

# కరీంనగర్‌లో ఏసీ మెకానిక్ యువకుడి అనుమానాస్పద మృతి

### దర్యాప్తు కోరిన కుటుంబ సభ్యులు

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 6 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరంలోని జ్యోతినగర్ సాయి ఓం అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న గుప్త శివ (21) అనే యువకుడు ఉరివేసుకుని మృతిచెందిన ఘటనపై కుటుంబ సభ్యులు 2 టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి సోదరుడు విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఫిర్యాదు ప్రకారం, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కుటుంబం ప్రస్తుతం కరీంనగర్‌లోని ఆనంద్‌నగర్ కాలనీలో నివాసం ఉంటోంది. గుప్త శివ గత 10 నెలలుగా జ్యోతినగర్‌లోని సాయి ఓం అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటూ ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. సుమారు 15 రోజుల క్రితం కుటుంబ సభ్యులు స్వగ్రామానికి వెళ్లగా, శివ ఒంటరిగా గదిలో ఉంటున్నట్లు తెలిపారు.ఆగస్టు 5 ఉదయం సుమారు 10:50 గంటలకు శివ గదిలో ఉరివేసుకున్నాడని సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ శివ మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు గుర్తించారు. గదిలోని సీలింగ్ హుక్‌కు బెడ్‌షీట్‌తో ఉరివేసుకున్నట్లు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.శివ మరణానికి గల అసలు కారణాలను సమగ్రంగా విచారించి, నిజానిజాలు వెలికి తీసి తగిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గురుకుల విద్యార్థినిలు



**మల్యాల, ఆగస్టు 6 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లాలోని వివేకానంద మినీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో తాటిపెల్లి గురుకుల పాఠశాలకు చెందిన ఆర్.మనీషా (18) విభాగంలో 1000 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్,అక్షయ షాట్ పుట్ లో గోల్డ్ మెడల్,అండర్ 14 విభాగంలో జి.యశస్వినీ జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్, కె.దేవి 600 మీటర్లలో గోల్డ్ మెడల్,అండర్ 12 విభాగంలో టి.హాస్య బ్యాక్ త్రోలో గోల్డ్ మెడల్ సాధించి ఆగస్టు 7నుండి 8వ తేదీ వరకు హన్మకొండ లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస మరియు పిఇటి.మధులిక తెలిపారు.

# ప్రాణాలు పోయినా భూములు ఇవ్వం..!



### ఇండస్ట్రియల్ పార్క్ ట్రెంచ్ పనులను అడ్డుకున్న రైతులు

### ముత్తారం తహశీల్దార్‌తో వాగ్వాదం.. పోలీసుల జోక్యంతో ఉద్రిక్తత

### చట్టపరమైన న్యాయం చేయండి.. జీవనాధారాన్ని కాపాడండి అంటూ రైతుల ఆవేదన

**ముత్తారం, ఆగస్టు 6 (జనంసాక్షి) :** ముత్తారం మండలం ధర్యాపూర్ గ్రామ శివారులో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం భూములుగా గుర్తించిన ప్రాంతంలో గురువారం ట్రెంచ్ తవ్వకాల పనులు ప్రారంభం కావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దశాబ్దాలుగా ఆ భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని చెబుతున్న రైతులు, కూలీలు పనులను అడ్డుకొని ఆందోళనకు దిగారు. "ప్రాణాలు పోయినా భూములు ఇవ్వం.. మా పొట్ట కొట్టొద్దు.. ముందుగా మాకు చట్టపరమైన న్యాయం చేయాలని అన్నారు.అధికారులు జేసీబీతో ట్రెంచ్ పనులు చేపట్టేందుకు ప్రయత్నించగా రైతులు యంత్రం ముందు నిలబడి పనులు నిలిపివేశారు. విషయం తెలుసుకున్న ముత్తారం తహశీల్దార్మధుసూదన్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. అయితే తమ సమస్యలను పట్టించుకోకుండా బలవంతంగా భూములను స్వాధీనం చేసుకోవడం సరైంది కాదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తహశీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు.

**తరతరాలుగా సాగు చేస్తున్న భూములేనంటూ రైతుల ఆవేదన**

ఈ భూములు ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా ఉన్నప్పటికీ, తాము ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని రైతులు తెలిపారు. పంటలే తమకు జీవనాధారమని, ఎలాంటి ప్రత్యామ్నాయ భూమి గానీ, జీవన భరోసా గానీ కల్పించకుండా ఇండస్ట్రియల్ పార్కు పేరుతో భూములను తీసుకోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు."మా పిల్లల భవిష్యత్తు ఈ భూమిపైనే ఆధారపడి ఉంది. పరిశ్రమలు వస్తే అభివృద్ధి కావచ్చు.. కానీ మా బతుకులు రోడ్డున పడితే ఆ అభివృద్ధి ఎవరికోసం?" అని రైతులు ప్రశ్నించారు.

**ట్రెంచ్ పనులు నిలిపివేత.. పోలీసుల రంగప్రవేశం**

రైతుల నిరసనతో కొంతసేపు ట్రెంచ్ పనులు నిలిచిపోయాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని భద్రత కల్పించారు. నిరసన చేస్తున్న రైతులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కొందరు రైతులను అక్కడి నుంచి బలవంతంగా తొలగించినట్లు సంఘటనా స్థలంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది పోలీసులు రైతులను అక్కడి నుంచి తీసుకెళ్తున్న ప్రయత్నాలు చేశారు.

**చట్టబద్ధ పరిష్కారం కావాలని రైతుల డిమాండ్**

తమను ఆక్రమణదారులుగా చూడకుండా, ఏళ్ల తరబడి సాగు చేస్తున్న వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని చట్టపరమైన న్యాయం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. తమకు హక్కులు కల్పించకుండా భూములు స్వాధీనం చేసుకునే చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్రవంతి శ్రీనివాస్, చంద రవి, తిత్తులశ్రీనివాస్, తిరుపతి, ఖాసీం, జంగ స్వామి, రాపెల్లి నరేష్, దొడ్ల నరేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.





# డబ్బులు డ్రా చేస్తుండగా గుండెపోటు, రైతు మృతి

**గన్నేరువరం,ఆగస్టు 06 (జనంసాక్షి) :** గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామానికి చెందిన రైతు హనుమండ్ల బాలయ్య గుండెపోటుతో మృతి చెందారు. గురువారం మధ్యాహ్నం గుండ్లపల్లి ఎక్స్‌రోడ్‌లోని ఎస్.బి.ఐ బ్యాంకుకు డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లిన బాలయ్య డబ్బులు డ్రా చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై బ్యాంకులోనే కుప్పకూలిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

# 15వ ఆగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### విధిగా ప్రోటోకాల్ పాటించాలి.. వసతుల కల్పనలో ఇబ్బందులు రానీయొద్దు : కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 6 (జనంసాక్షి) :** పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి , అదనపు డీసీపీ వెంకటరమణతో కలిసి వివిధ శాఖల అధికారులతో పంద్రాగస్టు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వేడుక సజావుగా సాగేలా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రోటోకాల్ సమస్య తలెత్తకుండా నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేదిక వద్ద సీటింగ్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. దేశభక్తి పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం కురిసినా ప్రోగ్రాం కు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని, ప్రోటోకాల్ నిబంధనలు పాటిస్తూ, అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు.

**స్టాల్స్, శకటాల ఏర్పాట్లు పై ప్రత్యేక దృష్టి సారించాలి**

వివిధ శాఖల పనితీరు తెలిసేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఆర్టీసీ, వైద్యశాఖ, పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖల పనితీరు తెలిసేలా ప్రత్యేక స్టాల్స్ , శకటాలు ఏర్పాటు చేయించాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే రుణాలతో కూడిన స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో తయారుచేస్తున్న ఉత్పత్తులను ప్రదర్శించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల శకటం, డ్రగ్స్ నియంత్రణకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలతో శకటం ఏర్పాటు చేయాలన్నారు. ఎల్ నినో వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా తీసుకుంటున్న చర్యలతో స్టాల్ ఏర్పాటు చేయాలని ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, ఫిషరీస్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా స్టాల్ ఏర్పాటు చేయాలని, వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్, ఫైరింజన్ అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, పార్కింగ్ లో ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రశంసా పత్రాలు అందించేందుకు ఉత్తమ పనితీరు కనబరిచే ఉద్యోగులను ఎంపిక చేయాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే అతిథులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలకు, విద్యార్థులకు, మీడియా కు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అవసరమైన తాగునీరు, టెంట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం తదితర ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# సంఘ సభ్యత్వాల తిరస్కరణ ప్రకటన

**ఇల్లంతకుంట జూలై 06 (జనంసాక్షి ) :** ఇల్లంతకుంట మండలంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులకు దశాబ్దాలుగా ఎస్‌జీటీ ఉపాధ్యాయులు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ఉపాధ్యాయ సంఘాలు నిర్లక్ష్య వైఖరి అవలంబించడాన్ని నిరసిస్తూ, ఇల్లంతకుంట మండలంలోని మేము ఎస్‌జీటీ ఉపాధ్యాయులందరం ఉమ్మడిగా ఒక నిర్ణయం తీసుకున్నాము. అందువల్ల ఏ ఉపాధ్యాయ సంఘానికీ సభ్యత్వం తీసుకోకూడదని, సభ్యత్వ రుసుము లేదా విరాళాలు ఇవ్వకూడదని నిర్ణయించాము. అలాగే ఏ సంఘానికి చెందిన బాధ్యులూ సభ్యత్వ నమోదు కోసం ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టకూడదని కోరుతున్నాము. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలి. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుని నియమించాలి. జి.ఓ. నెం. 25లో అవసరమైన మార్పులు చేయాలి.ఎస్‌జీటీలకు కూడా ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం పదోన్నతులు కల్పించాలి. ఎస్‌జీటీలు మరియు ఎస్ఏల వేతనాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని రానున్న పీఆర్సీలో సవరించాలి. రేషనలైజేషన్ పేరుతో ప్రాథమిక పాఠశాలలను మూసివేసే నిర్ణయాలను ఉపసంహరించాలి. పై అంశాలపై సంఘాల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నాము. మా న్యాయమైన డిమాండ్ల సాధనకు సంఘాలు చిత్తశుద్ధితో కృషి చేసే వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనబోమని తెలియజేస్తున్నాం.

### యుఎస్‌పిసి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో

# నిరసన, దశలవారి పోరాటం




**జగిత్యాల బ్యూరో ఆగస్టు 6(జనం సాక్షి)**

రాష్ట్రంలోని ఉపాధ్యాయ, విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా యూఎస్పిసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో యూఎస్పిసి ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లాలో జరిగే నిరసన కార్యక్రమాల గురించి తెలియజేస్తూ ఈనెల 7న పాఠశాల స్థాయిలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయడం,12,13 తేదీలలో మండల కేంద్రాల వద్ద నిరసన తెలియజేస్తూ తాసిల్దారులకు వినతి పత్రం సమర్పించడం, ఈనెల 19న జిల్లా కేంద్రంలో నిరసన ధర్నా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది . ఈనెల 21 నుండి 26 తేదీ వరకు యూఎస్పీసి రాష్ట్ర బృందం జిల్లా కమిటీలతో కలిసి జిల్లాల పర్యటన, ఈనెల 29న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహా ధర్నా కార్యక్రమానికి చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది. ఉపాధ్యాయులు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల కొరకు పరిష్కారం కొరకు తమ వంతు పూర్తి సహకారం అందించాలని కోరడం జరిగింది కార్యక్రమం. యూఎస్పీసీ బాధ్యులు తిరుకోవెల శ్యాంసుందర్, ఎన్నం రాంరెడ్డి, రాంచంద్రం, భోగ రమేష్,అంబటి భూమేశ్వర్,సంతోష్ ర, ఎడ్ల గోవర్ధన్, గడప రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో ఘనంగా గ్రీన్ కార్నివల్

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 6 (జనంసాక్షి) :** చెట్లను కాపాడడం, పెంచడం ప్రాథమిక విధిగా భావించాలని తద్వారా సమాజంలో కాలుష్యాన్ని అరికట్టగలమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి విద్యార్థి బాధ్యత అనే గొప్ప సందేశంతో నేడు పాఠశాలలో గ్రీన్ కార్నివల్ కార్యక్రమాన్ని అత్యంత సృజనాత్మకంగా నిర్వహించడం జరిగిందని వారు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించే గ్రీన్ ఎగ్జిబిషన్ వ్యర్థాలతో అద్భుత వస్తువుల తయారీ, మొక్కల ప్రదర్శన, హరిత పోస్టర్లు పర్యావరణ ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలతో కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారు. పలు అంశాల పై రూపొందించినటువంటి నమూనాలను, పోస్టర్లను వారు ఆవిష్కరించారు. విద్యార్థులు ఆకుపచ్చని రంగు దుస్తులలో విచ్చేసి సంబరాలకు వన్నె తెచ్చారు. ప్రాంగణం మొత్తం ఆకు పచ్చని వస్తువులతో అలంకరించి విద్యార్థుల ఉత్సాహాన్ని, ఆనందాన్ని రెట్టింపు చేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### హుస్నాబాద్ టు కొత్తపల్లి నాలుగు వరుసల

# రోడ్డు విస్తరణకు హైకోర్టు బ్రేక్

### హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

**చిగురుమామిడి ఆగస్టు 6(జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామం నుండి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ వ్యవహారంలో చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో నాలుగు వరసల రహదారి విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఈ నాలుగు వరుసల రహదారి విస్తరణ అంశంపై దాఖలైన రిట్ పిటిషన్లపై బాధితులకు స్టేటస్ కో (యధాతథ స్థితి) కొనసాగించాలని ఆదేశిస్తూ హైకోర్టు ఉపశమనం కల్పించింది.మొదట ప్రధాన పిటిషనర్ కందుకూరి లక్ష్మణాచారి,కక్కర్ల బాలయ్య, కెమ్మసాగరం వెంకటయ్య,ఓరుగంటి భారతీ దేవి,వంతడుపుల మల్లయ్య, పిట్టల రమేష్, గైని శ్రీనివాస్, బొల్లబతిని రాజేశం,మొలుగూరి వెంకటాద్రి,వంతడుపుల వినయ్,సిలుమోజు యశోద మొదలైన 11మంది దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై ఆగస్ట్ 4న విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరపల్లి నంద 11మంది మందికి చెందిన ఆస్తులపై ప్రస్తుతం ఉన్న పరిస్థితి కొనసాగించాలని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు స్టేటస్ కో జారీ చేసినట్లు బాధితులు తెలిపారు.దీంతో పిటిషన్ బాధితులకు హైకోర్టు తాత్కాలిక రక్షణ కల్పించింది.వాదన ప్రకారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి , సర్పంచ్ కు,ఇండ్ల కూల్చివేతపై ఎలాంటి అధికారాలు ఉన్నాయని గ్రామ ప్రజలకు నోటీసులు జారీ చేశారని తెలిపారు.అధికారులు చట్టబద్ధమైన ప్రక్రియ అనుసరించకుండా తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా, భవిష్యత్తులో 4,6వరుసల రహదారి నిర్మాణం బైపాస్ ద్వారా రోడ్డు నిర్మిస్తే బాగుంటందనే విషయం ఆలోచించకుండ,నష్టపరిహారం చెల్లించకుండానే రోడ్డు విస్తరణ పేరుతో తమ ఆస్తులపై చర్యలకు సిద్ధమవుతున్నారని కోర్టు దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు.పిటిషనర్ల తరపున న్యాయవాదులు వి.వెంకట సుబ్రహ్మణ్యం,దాసరి శ్రీనివాస్ రెడ్డి వాదనలు వినిపించడం జరిగిందన్నారు.దీనిపై స్పందించిన హైకోర్టు తదుపరి విచారణ వరకు ఆస్తులపై కూల్చివేయడం స్వాధీనం లేదా ఇతర జోక్య చర్యలు చేపట్టరాదని స్పష్టం చేస్తూ స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశించిందన్నారు.ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టు 11,2026కు వాయిదా పడింది.ఈ నాలుగు వరసల రహదారి విస్తరణ అంశంపై పిటిషనర్లుకు హైకోర్టులో స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేయడం హుస్నాబాద్ నియోజకవర్గం లో చర్చనీయాంశంగా మారింది.చట్టబద్ధమైన ప్రక్రియ ప్రజల అభ్యంతరాల పరిశీలన, భవిష్యత్తులో4,6వరుసల రోడ్డుకు, నేషనల్ రోడ్డుకు, గ్రీన్ ఫీల్డ్ రహదారికి బైపాస్ రోడ్డు అనుకూలమని ప్రతిపాదన,అదేవిధంగా ఉత్తర తెలంగాణ నుండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి భవిష్యత్తులో మంచి ప్రదాన రాష్ట్ర, జాతీయరహదారి నిర్మించాలంటే బైపాస్ రోడ్డు ద్వారానే నిర్మించాలని,తగిన నష్టపరిహారం వంటి పలు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయని న్యాయవార్గాలు అభిప్రాయపడుతున్నారు.



# 88 మంది విద్యార్థులకు రెండే గదులు

### తరగతి గదులు, మౌలిక వసతులు కరువు



**పెద్ద కొడప్గల్, ఆగస్టు 06 (జనంసాక్షి) :** పెద్ద కొడప్గల్ మండలంలోని కాటేపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. గోడలకు పగుళ్లు రావటంతోపాటు గత 10 రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పైకప్పులు వర్షానికి కారడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రమాదకర పరిస్థితుల్లో చదువులు కొనసాగిస్తున్నారు. 88 మంది విద్యార్థులకు కేవలం రెండు గదులు మాత్రమే ఉండడంతో అందరూ ఇరుకుగా కూర్చోవాల్సి వస్తుంది. దీంతో పిల్లల చదువుకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. తప్పని పరిస్థితుల్లో ఉపాధ్యాయులు వరండాలో, చెట్ల కింద విద్యను బోధిస్తున్నారు. బెంచీలు లేక విద్యార్థులు తరగతి గది నేలపైనే కూర్చుని విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, తరగతి గదుల కొరత అనేది విద్యార్థుల విద్యాభ్యాసానికి పెద్ద అవరోధంగా మారుతోంది. మధ్యాహ్న భోజన పథకం కోసం నిర్మించిన వంటశాల రెండు గదులు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షానికి గదిలో జల్లు కొట్టడంతో వంట కోసం తీసుకువచ్చిన సరుకులు తడిసిపోతున్నాయని వంట సిబ్బంది తెలిపారు. సరుకుల కోసం గదిలోకి వెళ్లాలంటే భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కొత్త భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్తా : ఎంఈఓ ప్రవీణ్ కుమార్**

దీనిపై ఎంఈఓ ప్రవీణ్ కుమార్ ను వివరణ కోరగా... గత విద్యా సంవత్సరమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లానని, మరో సారి సమస్యను తెలియజేస్తానని తెలిపారు.

# వనపర్తి ఐటీఐ హబ్ అభివృద్ధికి రూ.241 కోట్ల ప్రాజెక్టు

**క్లస్టర్--8 అడ్వాన్స్‌డ్ ఇండస్ట్రియల్ పార్ట్‌నర్ ప్రాజెక్టుకు టెండర్ ప్రక్రియ ప్రారంభం**

**వనపర్తి ప్రభుత్వ ఐటీఐ హబ్‌గా ఎంపిక**

**వనపర్తిబ్యూరో, ఆగస్టు 6 జనంసాక్షి :** రాష్ట్రంలో పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధికి మరింత ఊతమిచ్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ--ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో చేపట్టిన ప్రతిష్టాత్మక క్లస్టర్--8 అడ్వాన్స్‌డ్ ఇండస్ట్రియల్ పార్ట్‌నర్ (ఏ ఐ పి) ప్రాజెక్టుకు రూ.241 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రాజెక్టుకు వనపర్తి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) హబ్‌గా ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు జిల్లాకు మంజూరైనట్లు తెలిపారు. ప్రాజెక్టు మంజూరుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఇంచార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్లస్టర్ పరిధిలో వనపర్తి ప్రభుత్వ ఐటీఐతో పాటు మన్ననూరు, మహబూబ్‌నగర్ బాలికల ఐటీఐ, దిండి, గద్వాల ప్రభుత్వ ఐటీఐలు అనుసంధానమై సమగ్ర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థగా రూపుదిద్దుకోనున్నాయి. దీంతో వనపర్తి రాష్ట్రంలోనే ప్రముఖ నైపుణ్య శిక్షణా కేంద్రంగా ఎదగనుంది. ప్రాజెక్టు అమలులో భాగంగా వనపర్తి ఐటీఐలో అత్యాధునిక ప్రయోగశాలలు, ఆధునిక యంత్రాలు, డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేయడంతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రోబోటిక్స్, ఆటోమేషన్, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి నూతన కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. పరిశ్రమలతో ప్రత్యక్ష అనుసంధానం ద్వారా విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్‌లు, క్యాంపస్ నియామకాలు, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వంతో కలిసి ఎంపికయ్యే పరిశ్రమ భాగస్వామి ఐదేళ్లపాటు క్లస్టర్ నిర్వహణ బాధ్యతలు చేపట్టి మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు శిక్షణా నాణ్యతను పెంపొందించనున్నారు.

## అడ్డొచ్చిన పంది.. అదుపుతప్పిన బైక్

**జేసీబీ ఆపరేటర్ మృతి**



**గోపాలపేట, ఆగస్టు 6 (జనంసాక్షి):** గోపాలపేట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మున్ననూరు గ్రామానికి చెందిన జేసీబీ ఆపరేటర్ మండ్ల ఆంజనేయులు (39) మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆగస్టు 5వ తేదీ రాత్రి సుమారు 9 గంటలకు జేసీబీ పని ముగించుకుని తన షైన్ మోటార్‌సైకిల్‌పై మెట్టుపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా జయన్న తిరుమలాపూర్ సబ్‌స్టేషన్ సమీపంలో ఒక్కసారిగా పంది రోడ్డుపైకి రావడంతో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆంజనేయులు తీవ్రంగా గాయపడగా, సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే ఆయన మృతి చెందారు. మృతుడికి భార్య యాదమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. యాదమ్మ ఫిర్యాదు మేరకు గోపాలపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# చెంచు గిరిజనులకు ఆధార్ నమోదు వేగవంతం చేయాలి

**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**




**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 6(జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో గురువారం ఐటీడీఏ, అటవీ, గిరిజన, రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని లింగాల, బల్మూర్, అమ్రాబాద్, పదర, అచ్చంపేట మండలాల్లో నివసిస్తున్న చెంచు గిరిజన కుటుంబాల పరిస్థితులు, చిన్నారుల ఆధార్ నమోదు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు.నల్లమల్ల అటవీ ప్రాంతంలోని చెంచు గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందాలంటే ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఇటీవల ఐటీడీఏ నిర్వహించిన ప్రత్యేక సర్వేలో అచ్చంపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 760 మంది చెంచు గిరిజన చిన్నారులకు ఆధార్ కార్డులు లేవని గుర్తించిన నేపథ్యంలో, వారికి అత్యవసరంగా ఆధార్ నమోదు చేపట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఆధార్ కార్డు కేవలం గుర్తింపు పత్రం మాత్రమే కాదని, విద్య, స్కాలర్‌షిప్‌లు, వైద్య సేవలు, బ్యాంకింగ్, రేషన్, సామాజిక భద్రత, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు కీలకమని కలెక్టర్ వివరించారు. ఒక్క చిన్నారి కూడా ఆధార్ లేకుండా మిగలకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఐటీడీఏ అధికారులు ఆధార్ లేని పిల్లల పూర్తి జాబితాను గ్రామాల వారీగా సిద్ధం చేసి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వైద్య, విద్య, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో నిర్ణీత గడువులోపు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.మారుమూల అటవీ ప్రాంతాల్లోని చెంచు తండాలు, గూడెలకు అధికారులు స్వయంగా వెళ్లి ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించాలని, అవసరమైతే మొబైల్ ఆధార్ కిట్లను వినియోగించి గ్రామాల్లోనే నమోదు చేపట్టాలని ఆదేశించారు. జనన ధ్రువీకరణ పత్రాలు, నివాస ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ వివరాల వంటి అవసరమైన పత్రాల జారీ విషయంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య శాఖ జనన నమోదుకు సంబంధించిన వివరాలను సమన్వయం చేయాలని, విద్యాశాఖ పాఠశాలల విద్యార్థుల వివరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఆధార్ కార్డులు లేని చెంచు కుటుంబాలకు ముందుగా నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి, అనంతరం ఆధార్ నమోదు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అమ్రాబాద్, పదర, లింగాల, అచ్చంపేట, బల్మూర్, కొల్లాపూర్ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి ఈ నెలాఖరు నాటికి చెంచులందరికీ ఆధార్ కార్డులు జారీ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడంతో పాటు, ప్రత్యేక ఆధార్ కిట్ల ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు.ఈ సమీక్షలు అదనపు కలెక్టర్ దేవ సహాయం, డి.టి.డి.ఓ శ్రీ కోటాజి, డి ఆర్ డి ఓ. చిన్న ఓబులేసు, డీఈవో రమేష్ కుమార్, డిపిఓ, ఈ డి ఎం, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జూదగాళ్లకు చుక్కలు చూపిస్తున్న అయిజ ఎస్ఐ



**అయిజ/రాజోలి, ఆగస్టు 6 (జనంసాక్షి):** ఇటీవల అయిజ మండలంలోని భూపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 9 మందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు, తాజాగా మరోసారి పేకాట రాయుళ్లపై ఉక్కుపాదం మోపారు. అయిజ మండలం సమీపంలోని ఉప్పల్ గ్రామ శివారులోని డంపింగ్ యార్డ్ వద్ద గురువారం పేకాట జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో ఎస్ఐ గురుస్వామి, పోలీసు సిబ్బంది ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో మొత్తం 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.9,910 నగదు, 5 మొబైల్ ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై జూద నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ గురుస్వామి హెచ్చరించారు.

# నీలిపల్లిలో ఆర్టీసీ బస్సు కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



**ఇబ్బందుల్లో విద్యార్థులు**

**మల్దకల్, జులై 6(జనం సాక్షి )**మండల పరిధిలోని నీలిపల్లి స్టేజి వద్ద రవాణా సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, చిన్న పిల్లలు ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రామంలోకి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో నిత్యం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే వందలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల ఉదాసీనతపై మండిపడుతూ విద్యార్థులు, బాలికలు, స్థానికులు కలిసి రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. గ్రామం నుండి మెయిన్ రోడ్డు వరకు సరైన రవాణా సదుపాయం లేకపోవడంతో, చిన్న పిల్లలు పుస్తకాల సంచుల భారంతో ప్రతిరోజూ కిలోమీటర్ల కొద్దీ నడవాల్సి వస్తోంది. ఉదయం వేళల్లో బస్సులు లేకపోవడం వల్ల విద్యార్థులు అనుకున్న సమయానికి పాఠశాలలకు, కాలేజీలకు చేరుకోలేకపోతున్నారు. దీనివల్ల మొదటి పీరియడ్స్ మిస్ అయి చదువులో వెనుకబడిపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో చీకటి పడేవరకు బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణించాల్సి రావడం, ఒంటరిగా నడిచి రావడం వల్ల బాలికలు, వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం (మహాలక్ష్మి పథకం) ఉన్నప్పటికీ, బస్సులు రాకపోవడంతో ప్రైవేట్ వాహనాలకు నిత్యం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. దీంతో పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోంది.హెచ్చరించిన నిరసనకారులు:రోడ్డుపై బైఠాయించిన పిల్లలు, స్థానికులు ఆర్టీసీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారులు వెంటనే స్పందించి నీలిపల్లి గ్రామానికి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక బస్సు సర్వీసులను నడపాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని, బస్సులను డిపోల వద్దే అడ్డుకుంటామని విద్యార్థి సంఘాలు, గ్రామస్థులు హెచ్చరించారు.



## కృష్ణమ్మ పరవళ్లు 4 ప్రాజెక్టులు ఫుల్ అలర్ట్

**ఆల్మట్టి నుండి శ్రీశైలం వరకు నిలకడ ప్రవాహం**

**జోగులాంబ గద్వాల, ప్రతినిధి, ఆగస్టు 6 (జనం సాక్షి)** గత వారం రోజులుగా కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఎగువ నుండి దిగువ వరకు నిలకడగా వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో ఆల్మట్టి, నారాయణపూర్, PJP జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులు అన్నీ అప్రమత్తంగా ఉన్నాయి.ప్రాజెక్టుల వారీగా నీటి పరిస్థితి

కృష్ణాకు మూలమైన ఆల్మట్టి నుండి భారీగా నీరు విడుదల అవుతోంది. ఇక్కడి నుండే దిగువ ప్రాజెక్టులకు నీరు వస్తుంది. ఆల్మట్టి నుండి వచ్చే నీటిని నారాయణపూర్ నిల్వ చేసి క్రమంగా దిగువకు వదులుతోంది.

మధ్యాహ్నం 3 గంటల నాటికి,నీటి మట్టం: 317.59 మీటర్లు,ప్రస్తుత నిల్వ: 4.110 టీఎంసీ,మొత్తం సామర్థ్యం,9.657 టీఎంసీ,ఇన్ ఫ్లో 2,30,000 క్యూసెక్కులు,అవుట్ ఫ్లో 2,20,802 క్యూసెక్కులు,28 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు,స్పిల్‌వే 1,88,776 క్యూసెక్కులు,పవర్ హౌస్ 28,232 క్యూసెక్కులు, జూరాల నుండి వచ్చే నీటిని శ్రీశైలం అందుకుంటుంది. ఇక్కడి నిల్వను బట్టే తెలుగు రాష్ట్రాల సాగు, తాగునీటి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

గత వారం రోజులుగా ఎగువ నుండి నిలకడగా వరద రావడం వల్ల దిగువ ప్రాజెక్టులు నిండే అవకాశం ఉంది. కానీ అదే సమయంలో కృష్ణా పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.అధికారులు 24 గంటలు ప్రాజెక్టులను పర్యవేక్షిస్తున్నారు. వరద నీరు వృధాగా సముద్రంలోకి వెళ్లకుండా ప్రతి టిఎంసి నీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

## పాము కాటుకు తరగతి గదిలో విద్యార్థి మృతి

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి టీఆర్ఎస్**



**నారాయణపేట ఆగస్టు 6(జనం సాక్షి):** నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ పాఠ శాలలో మూడో తరగతి విద్యార్థి పిచ్చుకుంట్ల రంజిత్ కుమార్ పాము కాటేయడంతో మృతి చెందాడు.దాంతో విద్యార్థు లు భయాందోళనకు గుర య్యారు.పాఠశాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడం వాటిని తొలగించక పోవ డంతో విష పురుగులు పాఠశాలలో యదేచ్ఛగా సంచరిస్తున్నాయి.విద్యార్థి మృతితో ఆకుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.ఈ సంఘటనకు పూర్తిగా అధికారులే బాధ్యత వహిం చాలని తెలంగాణ రక్షణ సేన నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివా స్ డిమాండ్ చేశారు. పిచ్చ కుంట్ల రంజిత్ కుమార్ అనే మూడో తరగతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో పాము కాటుకు గురై మృతి చెందడం అత్యంత విషా దకరమని అన్నారు. ఇది ప్రభుత్వం,విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని విద్యాశాఖను నిర్వహిస్తున్న సి ఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.పేద కుటుంబానికి చెందిన అమాయక బాలు డు చదువుకోవాలనే ఆశతో పాఠశాలకు వెళ్లి తిరిగి శవం గా ఇంటికి రావడం ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోం దన్నారు. పాఠశాల ప్రాంగ ణాన్ని పరిశుభ్రంగా ఉంచ కుండా,విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యం వహించిన అధికారులపైవెంటనే చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.మృతి చెందిన బాలుడి కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా,కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, అలాగే కుటుంబానికి అన్ని విధాలా ప్రభుత్వ సహాయం అందిం చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# చేనేత మహిళా కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలి



**ఎంపీ డీకే అరుణ**

**జోగులాంబ గద్వాల, ప్రతీనిధి,ఆగస్టు 6(జనంసాక్షి)** ఢిల్లీలో జరిగిన మహిళా సాధికారత పార్లమెంటరీ కమిటీ సమావేశానికి హాజరైన ఎంపీ డీకే అరుణ,టెక్స్‌టైల్ మరియు హ్యాండ్లూమ్ రంగాలలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్ యనెక్స్ (గ్రానా) బిల్డింగ్ లో పార్లమెంటరీ కమిటీ ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ హాజరై మాట్లాడారు.చేనేత, జౌళి రంగాల మహిళల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. చేనేత, జౌళి పరిశ్రమల్లో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న మహిళా కార్మికులు, నేత కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లను నేరుగా తెలుసుకున్నారు. ఈ రంగంలోని నిపుణులు, స్వచ్ఛంద సంస్థల (చీ+ూం) ప్రతినిధులు హాజరై మహిళల ఆర్థిక, ఆరోగ్య, సామాజిక ఇబ్బందులను కమిటీ దృష్టికి తెచ్చారు.ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. చేనేత మగ్గాలపై గంటల తరబడి కూర్చోవడం వల్ల మహిళలు తీవ్రమైన వెన్నునొప్పి, కంటి సమస్యలతో బాధపడుతున్నారని, వీరికి ప్రత్యేక వైద్య సదుపాయాలు అందించాలని కోరారు.దళారీల వ్యవస్థను అరికట్టి, మహిళా చేనేత కార్మికులకు నేరుగా మార్కెటింగ్ సదుపాయాలు మరియు ముడిసరుకుపై రాయితీలు అందించాలన్నారు. శ్రమను తగ్గించేలా ఆధునిక మగ్గాలు, పరికరాలపై మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు.తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల, నారాయణపేట, పోచంపల్లి వంటి ప్రాంతాల్లో చేనేత రంగంపై వేలాది మంది మహిళలు ఆధారపడి ఉన్నారని, కేంద్ర, రాష్ట్ర పథకాలు వీరికి మరింత వేగంగా అందేలా చూడాలని కోరారు.మహిళా కార్మికుల సంక్షేమం కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ కమిటీ ద్వారా వారి సమస్యలను అధ్యయనం చేస్తోందని తెలిపారు.మహిళా నేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## ఆసిడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా


**డ్రైవర్ సురక్షితం.. తప్పిన భారీ ప్రమాదం**



**బాలానగర్, ఆగస్టు 06)- జనం సాక్షి :** మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ మండల పరిధిలోని శుభ గృహ వెంచర్ ముందు గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. ు+06 ు3857 నంబర్ గల యాసిడ్‌ను హైదరాబాద్ నుంచి స్థానిక కంపెనీ కీ తరలిస్తున్న లారీని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొనడంతో లారీ అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది.

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అదృష్టవశాత్తూ లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లారీలో ప్రమాదకర రసాయనం (యా సిడ్) ఉండటంతో కొంతసేపు స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. బోల్తా పడిన లారీని క్రేన్ సహాయంతో తొలగించే చర్యలు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం కోసం పోలీసులు గాలింపు చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనతో ఆ మార్గంలో కొంతసేపు

## పెళ్లి కాకపోవడంతో మనస్తాపం.. యువకుడు ఆత్మహత్య



**కొల్చారం, ఆగస్టు 6 (జనం సాక్షి) :** కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పెళ్లి కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన వేముల కుమార్ (29) అలియాస్ పంతులు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. అయితే మద్యానికి బానిసైన కుమార్ గత కొంతకాలంగా పనికి వెళ్లకుండా మద్యం సేవిస్తూ తిరుగుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ నేపథ్యంలో అతనికి వివాహ సంబంధాలు కుదరకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు సమాచారం. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో సీలింగ్‌కు నైలాన్ చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సహోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## షేక్ పెట్ చౌరస్తాలో అర్ధరాత్రి కారు ప్రమాదం

**ముగ్గురిని ఢీకొట్టిన కారు**

**ఒకరి దుర్మరణం మరో ఇద్దరి పరిస్థితి విషమం**





**శేరిలింగంపల్లి, ఆగస్టు 06 (జనంసాక్షి) :** ఈనెల 1వ తేదీన షేక్ పేట చౌరస్తాలోని షేక్పేట్ ఫ్లైఓవర్ కింద ఎల్లమ్మ ఆలయం వద్ద హర రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మార్గం చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు రాయదుర్గం పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధి పోచమ్మ బస్తీలో నివాసముండే సుదీప్తా దాస్(26), సౌమ్యేన్ రాయ్(27), అభిజిత్ రాయ్(26), సౌరవ్ సంత్ర(26) బ్రతుకుతెరువు నిమిత్తం పశ్చిమ బెంగాల్ నుండి నగరానికి విచ్చేసి వివిధ పనులు చేసుకుంటూ కలిసి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల ఒకటవ తేదీన సుదీప్తరాయ్, సౌమ్యేన్ రాయ్, అభిజిత్ రాయ్ తమ మొబైల్ ఫోన్ ఇయర్ ఫోన్స్ ను మార్చుకోవడానికి సమీపంలోని మొబైల్ షాప్ కు వెళ్లి రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా షేక్పేట్ బ్రిడ్జి కింది రేణుక ఎల్లమ్మ ఆలయం వద్దకు రాగానే మెహదీపట్నం నుండి గచ్చిబౌలి వైపు వెళ్తున్న ఏపి 31 ఏవై 1551 నెంబర్ గల కారు వేగంగా దూసుకొచ్చి వీరిని బలంగా ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన సుదీప్తా దాస్ ఆసుపత్రికి తరలించలోపే దుర్మరణం చెందగా సౌమైన్ న్ రాయ్ తలకు తీవ్ర గాయాలై అత్యంత విషమ పరిస్థితులలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరో వ్యక్తికి కూడా తీవ్ర గాయాలు కావడం గమనార్హం. కాగా కారు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ 16 సంవత్సరాల మైనర్ అని, అతని తండ్రి ఇమాదొద్దీన్ తోపాటు మైనర్ పై సైతం రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ టాప్




## ప్రధానమంత్రి కార్యాలయ సమీక్షలో అగ్రస్థానంలో రాష్ట్రం

**సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర న్యాయం, డిజిటల్ వేదికల సమర్థ వినియోగంలో తెలంగాణ దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రగతి సమీక్ష సమావేశంలో సైబర్ నేరాల నియంత్రణకు సంబంధించిన తొమ్మిది కీలక ప్రమాణాల ఆధారంగా తెలంగాణకు దేశవ్యాప్తంగా మొదటి ర్యాంకు లభించింది.**

- సైబర్ మోసాల బాధితులకు రూ.16.42 కోట్ల రికవరీ..
- రాష్ట్రాల మధ్య సమన్వయంలోనూ అత్యుత్తమ పనితీరు




**హైదరాబాద్, ఆగస్టు 6 (జనంసాక్షి):**

దేశంలోనే తొలి ప్రత్యేక సైబర్ కేంద్రం ఏర్పాటు, ఆన్‌లైన్‌లో నేరాల నమోదు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, సైబర్ మోసాల్లో కోల్పోయిన నగదును తిరిగి అందించే విధానం, చట్టవిరుద్ధమైన అంతర్జాల సమాచారాన్ని తొలగించే వ్యవస్థ, రాష్ట్రాల మధ్య సమన్వయం, సైబర్ నేరాల ప్రభావిత ప్రాంతాల గుర్తింపు, పోలీసు సిబ్బందికి శిక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాల్లో తెలంగాణ అత్యుత్తమ పనితీరు కనబరిచినట్లు తెలంగాణ సైబర్ భద్రతా విభాగం తెలిపింది.

సైబర్ మోసాలకు సంబంధించిన 2,368 ఫిర్యాదులు అందగా, వాటిలో 2,086 కేసుల్లో చర్యలు తీసుకుని 88 శాతం పనితీరు నమోదు చేసింది. అలాగే సైబర్ మోసాల బాధితులకు రూ.16.42 కోట్ల నగదు తిరిగి అందించే ప్రక్రియ చేపట్టగా, 34,524 కేసులు అర్హత సాధించాయి. ఇందుకు సంబంధించి 28,097 ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది.


చట్టవిరుద్ధమైన 22,447 అంతర్జాల చిరునామాలను పరిశీలించి, వాటిలో 20,070 చిరునామాలను తొలగించడం లేదా నిలిపివేయడం ద్వారా 89.41 శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపింది. రాష్ట్రాల మధ్య సమన్వయంలో భాగంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన 6,721 అభ్యర్థనల్లో 6,518 పూర్తి చేసి 96.68 శాతం పనితీరు నమోదు చేసింది. అలాగే ఇతర రాష్ట్రాలకు పంపిన 7,018 అభ్యర్థనల్లో 5,560 పూర్తిచేసి 79.22 శాతం విజయాన్ని నమోదు చేసింది.

సమన్వయ వ్యవస్థలో 3,524 కేసులు, 5,493 మంది నిందితుల వివరాలు, 14,964 అంతర్రాష్ట్ర అనుసంధానాలు నమోదు చేసినట్లు వెల్లడించింది. సైబర్ నేరాల బాధితులకు త్వరితగతిన సహాయం అందించేందుకు 8712665600 హెల్ప్‌లైన్‌ను అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం, సైబర్ మోసాల్లో కోల్పోయిన నగదు తిరిగి పొందేందుకు ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధానమంత్రి కార్యాలయం నిర్వహించిన సమీక్ష సమావేశంలో తెలంగాణకు దేశంలోనే తొలి స్థానం రావడం రాష్ట్ర సైబర్ భద్రతా వ్యవస్థ సమర్థతకు నిదర్శనమని తెలంగాణ సైబర్ భద్రతా విభాగం డైరెక్టర్, హోం శాఖ ప్రధాన కార్యదర్శి శిఖా గోయెల్ పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ మరింత ముందంజలో కొనసాగుతుందని ఆమె తెలిపారు.

### ఆయుర్వేద వైద్యుడి మృతి


**కరీంనగర్, ఆగస్ట్6 (జనంసాక్షి)**: అనుమానాస్పదస్థితిలో ఆయుర్వేద వైద్యుడి మృతి చెందాడు. ఈ సంఘటన అల్గునూరులో చోటుచేసుకుంది. కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారం గ్రామా నికి చెందిన మారం సంపత్ అల్గునూరులో కొన్నేళ్ల క్రితం నుండి ఆయుర్వేద వైద్యం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.





















Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370